
జామియా మసీదు వక్ఫ్ భూమిలో ఉద్రిక్తత
- వివరలు 6లో..



టోల్‌గేట్లలో కొత్త నిబంధనలు

● నవంబరు 15 నుంచి అమలులోకి...

ఆత్మకూరు, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి) : జాతీయ రహదారులపై ప్రయాణించే వాహనదారులకు కేంద్ర ప్రభుత్వం నిర్ణయం కొంతమేర ఊరట లభించనుంది. టోల్‌గేట్ల వద్ద ఫాస్టాగ్ చెల్లింపులో రెండు కీలక నిబంధనలను ప్రవేశ పెట్టగా, నవంబరు 15 నుంచి అమలులోకి రానున్నాయి. ఇప్పటి వరకు ఫాస్టాగ్ లేని వాహనాలు టోల్‌ప్లాజా వద్ద సాధారణ రుసుమునకు రెట్టింపు మొత్తాన్ని నగదు రూపంలో చెల్లించాల్సి ఉండేది. కేంద్రం ఈ నిబంధనను సవరించింది. ఇకపై ఫాస్టాగ్ లేనివారు యూపీఐ ద్వారా సాధారణ రుసుముకు 1.25 రెట్లు చెల్లిస్తే సరిపోతుంది. ఉదాహరణకు సాధారణ టోల్ ఫీజు రూ.100 అనుకుంటే ఫాస్టాగ్ ఉన్న వారు రూ.100 చెల్లిస్తారు. కానీ ఫాస్టాగ్ లేనివారు నగదు రూపేణా రూ.200 చెల్లించాలి. అయితే యూపీఐ ద్వారా రూ.125 చెల్లిస్తే సరిపోతుంది. అలాగే, మరో కొత్త నిబంధన అమలులోకి రానుంది. ఫాస్టాగ్ ఖాతాలో డబ్బు ఉన్నా టోల్‌గేట్ వద్ద సాంకేతిక కారణాల వల్ల స్కానింగ్ వ్యవస్థ ఫెయిల్ అయి డబ్బులు కట్ కాకపోతే ఆ వాహనదారులు ఎలాంటి ఫీజు చెల్లించకుండా ఉచితంగా వెళ్లిపోవచ్చు. ఈ నిర్ణయంతో టోల్‌ప్లాజాల వద్ద సిస్టమ్ వైఫల్యాల వల్ల వాహనాదారులకు కలిగే ఇబ్బందులకు తెర పడనుంది.



'సోమశిల'కు 20,905 క్యూసెక్కుల ప్రవాహం

అనంతసాగరం అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): సోమశిల జలాశయానికి ఎగువ ప్రాంతాల నుంచి బుధవారం 20,905 క్యూసెక్కుల వరద కొనసాగింది. ఇక డ్యాంలో 73.408 టీఎంసీల నీరు నిల్వ ఉంది. గేట్ల ద్వారా 22,650, ఉత్తర కాలువకు 100, కండలేరుకు వరద కాలువ ద్వారా 4,000 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నారు.

● సంగం బ్యారేజీ వద్ద...

సంగం : సోమశిల నుంచి సంగం బ్యారేజీకి 22,250 క్యూసెక్కుల నీటి ప్రవాహం వస్తోంది. ఈ నీటితోపాటు బ్యారేజీకి ఎగువ, పెన్నానది పరివాహక ప్రాంతంలో రెండు రోజులుగా కురిసిన వర్షం వల్ల వాగులు, వంకలు ప్రవహించి సుమారు మరో 600 క్యూసెక్కుల నీరు వస్తోంది. దీంతో బ్యారేజీ వద్ద నీటిమట్టం 9.6 అడుగులు నమోదయింది.





అయ్యో.. లక్ష్మి!

గాలికి ఎగిరిపోయే పట్టలే ఆమెకు గూడు. ఓ ఐదు పదుల వయసు ఉంటుంది. చింపిరి జుట్టు.. లేవలేని స్థితిలో చిరిగిన రగ్గుల కిందనే పడక.. చేతికి ఏమైందో ఏమో గానీ.. ఓ గుడ్డ కట్టి ఉంది. ఎవరైనా భోజనం తెచ్చినా తినలేని దైన్యం. పగటి పూట ఒంటిని కమ్మేస్తున్న ఈగలు.. రాత్రిపూట ఒంట్లో రక్తం లేకపోయినా చర్మాన్ని పీకేస్తున్న దోమలు. ఎండకు ఎండుతూ వానకు తడుస్తూ జీవచ్ఛవంగా పడిఉంది. ఈమె పేరు లక్ష్మి. ఎప్పుడో మూడు రోజుల క్రితం వెళ్లిన తన పెనిమిటి కోసం మూతపడుతున్న కళ్లను కాయలు కాచేలా ఎదురుచూస్తోంది. కానీ ఆమెకు తెలియదు.. ఇక తన భర్త రాడనీ. ఈ నెల 6వ తేదీ అర్ధరాత్రి గుర్తుతెలియని వ్యక్తుల చేతిలో హతమైన ఇద్దరిలో ఈ ముదుసలి భర్త కూడా ఉన్నాడు. ఇవేమీ తెలియని లక్ష్మి మాత్రం భర్త వెళ్లిన దారిని ఆశగా చూస్తోంది.

- సమగ్ర కథనం 8లో..


మహర్దశ

రోడ్ల అభివృద్ధికి భారీగా నిధులిచ్చిన ప్రభుత్వం

జిల్లాలో 18 రోడ్లకు రూ.73.4 కోట్ల మంజూరు

నిధులు మంజూరైన రోడ్ల వివరాలు

రోడ్డు పేరు	పొడవు (కి.మీ)	నిధులు (రూ.లక్షలు)
ఆత్మకూరు-సోమశిల	8	500
బుచ్చి - ఊటుకూరు	29	800
నెల్లూరు-ములుమూడి-తాటిపర్తి	14	400
నెల్లూరు-పొదలకూరు-సైదాపురం	19	800
నెల్లూరు-కృష్ణపట్నం	5	350
గూడూరు - తురిమెర్ల రోడ్డు	10	500
ఎన్‌బీ రోడ్డు - గౌరవరం, ఎన్‌బీ రోడ్డు-పల్లిపాడు	15	600
టీపీ గూడూరు- సీఎస్ పురం	8	360
వీఎం రోడ్డు - తిరుమలమ్మపాలెం రోడ్డు	9	360
పెనుబర్తి-మాదరాజగూడూరు-కలివేలపాలెం	9	490
వీఎస్ రోడ్డు - పెంచలకోన వయా రామన్నగారిపల్లె	1	60
ఊటుకూరు-పెరుమాళ్లపాడు	4	240
బాంబే రోడ్డు - కోవూరు వయా గంగవరం	8	320
కావలి - కొండాపురం	7	300
పోకూరు- రాళ్లపాడు వయా చీమలపెంట	14	300
ఆర్‌ఐ రోడ్డు - అల్లూరు వయా పురిణి	11	260
ఎంసీ రోడ్డు - ఎస్‌కే రోడ్డు వయా బోగోలు	15	350
ఎంసీ రోడ్డు - కట్టువపల్లి వయా పూలతోట	12	350
మొత్తం 18 రోడ్లు	198	73.4 కోట్లు



గుంతలున్న చోట కొత్తగా లేయర్ నిర్మాణం

పొట్టేపాలెం బ్రిడ్జికి ఎట్టకేలకు మోక్షం

నెల్లూరు, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి) : కనెక్టివిటీలో ప్రధానమైన ఆర్‌అండ్‌బీ రోడ్లను బాగు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం భారీగా నిధులు మంజూరు చేసింది. రాష్ట్ర రహదారులు, మేజర్ డిస్ట్రిక్ట్ రోడ్లలో (ఎండీఆర్) గుంతలు లేకుండా కొత్త లేయర్ వేసేందుకు అనుమతులు ఇస్తూ ఉత్తర్వులు వెలువరిచింది. రాష్ట్రవ్యాప్తంగా 274 రోడ్లకు సంబంధించి 2,104 కి.మీ మేర బాగు చేసేందుకు రూ.వెయ్యి కోట్లు పరిపాలన అనుమతులు జారీ చేసింది. ఆ జాబితాలో జిల్లా నుంచి 18 రోడ్లు చోటు దక్కించుకున్నాయి. ఆర్‌అండ్‌బీ నెల్లూరు సర్కిల్ పరిధిలో 18 రోడ్లకు సంబంధించి 198 కి.మీ మేర బాగు చేయనున్నారు. ఇందుకుగానూ రూ.73.40 కోట్లు కేటాయించింది. ఇందులో 85 కి.మీ మేర రూ.33.50 కోట్లతో రాష్ట్ర రహదారులను బాగు చేయనుండగా, 113 కి.మీ మేర ఎండీఆర్ రోడ్లను రూ.39.90 కోట్లతో అభివృద్ధి చేయనున్నారు. జిల్లాలో గుంతలుగా ఉన్న కీలకమైన రోడ్లన్నింటికీ దాదాపుగా నిధులు మంజూరయ్యాయి. త్వరలోనే ఆర్‌అండ్‌బీ అధికారులు టెండర్లు పిలవనున్నారు. కాగా ఎన్నో ఏళ్లుగా సమస్యగా ఉన్న పొట్టేపాలెం కలుజుపై బ్రిడ్జి నిర్మాణానికి ఎట్టకేలకు మోక్షం లభించింది. తాజాగా ప్రభుత్వం ఇచ్చిన అనుమతుల్లో నెల్లూరు-ములుమూడి-తాటిపర్తి రోడ్డు అభివృద్ధికి రూ.4 కోట్లు కేటాయించింది. ఆ నిధులతో పొట్టేపాలెం కలుజుపై బ్రిడ్జిని నిర్మించనున్నారు.



ఏర్పాట్లపై అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ హిమాన్షు శుక్లా, ఎస్పీ అజిత తదితరులు

సీఎం పర్యటన ఏర్పాట్లు పరిశీలన

వెంకటాచలం, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి) : సర్వేపల్లి సమీపంలోని తాటిపర్తిపాళెం వద్ద విశ్వసముద్ర బయో ఎనర్జీ ప్రైవేటు లిమిటెడ్ పరిశ్రమ ప్రారంభోత్సవానికి ఈ నెల 10న సీఎం చంద్రబాబు నాయుడు రానున్నారు. ఈ మేరకు ఆయన పర్యటన ఏర్పాట్లపై కలెక్టర్ హిమాన్షు శుక్లా, ఎస్పీ అజిత వేజెండ్ల తదితరులు బుధవారం పరిశీలించారు. ఇప్పటికే హెలీప్యాడ్, రోడ్లను ఏర్పాటు చేశారు. సీఎం పర్యటించే ప్రాంతాల్లో పోలీసులు క్షుణ్ణంగా తనిఖీలు చేపట్టారు. అయితే చంద్రబాబు పర్యటన గురువారం అధికారికంగా ఖరారు కానున్నట్లు సమాచారం.

సమ్మెలో వైద్యులు.. ఇబ్బందుల్లో రోగులు

- 3 నుంచి కొనసాగుతున్న డాక్టర్ల ఆందోళన
- పీహెచ్‌సీల్లో రోగులకు నర్సులే దిక్కు

8

నగదు కోసమే జంట హత్యలు

- పాత నేరస్థుల ఘాతుకం
- పోలీసుల అదుపులో ఇద్దరు నిందితులు

నెల్లూరు (క్రైం), అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరులో జంట హత్యల కేసులో పోలీసులు పురోగతి సాధించారు. హత్యలకు పాల్పడిన ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నట్లు తెలుస్తోంది. నగదు కోసమే హత్యలు చేశామని ఆ పాత నేరస్థులు అంగీకరించినట్లు సమాచారం. పెన్నా బ్యారేజ్ సమీపంలో జంట హత్యల సమాచారం అందిన వెంటనే నగర డీఎస్పీ సింధుప్రియ, సంతపేట ఇన్‌స్పెక్టర్ దశరథరామారావు సిబ్బందితో కలిసి కలిసి ఘటనా స్థలికి చేరుకున్నారు. పోలయ్య, శివకుమార్ మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం జీజీహెచ్‌కు తరలించి కేసు దర్యాప్తు ప్రారంభించారు. ఈ క్రమంలో చుట్టుపక్కల ప్రాంతాల్లోని సీసీ కెమెరాల ఫుటేజ్‌లను పరిశీలించడంతోపాటు స్థానికులను విచారించారు. మృతుల్లో ఒకరు సమీపంలోని పెన్నానదిలోకి వెళ్లే దారిలో గుడారంలో ఉంటున్న పోలయ్య, మరొకరు కడప జిల్లాకు చెందిన శివ కుమార్‌గా గుర్తించారు. సోమవారం రాత్రి శివతోపాటు మరో నలుగురు రంగనాయకుల గేటు వద్ద భోజనం చేసి పెన్నా వారధి వద్ద నిద్రించేందుకు వెళ్తుండగా నగరంలోని పుట్టా ఎస్టేట్‌కు చెందిన మదిరి సాయిశంకర్, ముత్తుకూరు మండలం నారికేలపల్లికి చెందిన కొండాపురం మనోజ్ (వీరు పాత నేరస్థులు) అడ్డుకున్నారు. మద్యం సేవించేందుకు వారిని నగదు అడిగారు. తమ వద్ద నగదు లేవని చెబుతున్నా వినకుండా వారిపై ఆ ఇద్దరు రాళ్లతో దాడికి దిగారు. దీంతో నలుగురు అక్కడ నుంచి పరారవగా శివ వారికి చిక్కాడు. ఆ ఇద్దరు శివను తీవ్రంగా కొట్టి చంపేసి, జాఫర్‌సాహెబ్ కాలువలో పడేశారు. కొద్దిసేపటికి అదే మార్గంలో వస్తున్న పోలయ్యను కూడా నగదు అడిగారు. ఆయన లేదని చెప్పడంతో ఆయన్ను కూడా తీవ్రంగా కొట్టి కాలువలో పడేసి, పరారయ్యారు. ఈ హత్యలకు పాల్పడిన ఇద్దరు వ్యక్తులను పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలుస్తోంది. నగదు కోసమే హత్యలు చేశామని వారు అంగీకరించినట్లు సమాచారం. కాగా, సాయిశంకర్‌పై నగరంలో 3 కేసులు, మనోజ్‌పై ముత్తుకూరు పోలీస్‌స్టేషన్‌లో 12 కేసులు ఉన్నట్లు నగర డీఎస్పీ సింధుప్రియ ఓ ప్రకటనలో తెలిపారు.



ఆటోవాలా ర్యాలీ

బుచ్చిరెడ్డిపాళెంలో బుధవారం సాయంత్రం ఆటోవాలాల ర్యాలీ ఆకట్టుకుంది. నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి, నగర పంచాయతీ చైర్‌పర్సన్ సుప్రజ తదితరులు ఈ ర్యాలీలో పాల్గొన్నారు.

- వివరాలు 8లో...

టపాసుల గోదాములు, తయారీ కేంద్రాల్లో తనిఖీ చేయండి

- 48 గంటల్లోపు నివేదిక ఇవ్వాలి : కలెక్టర్

నెల్లూరు (క్రైం) అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి) : దీపావళి పండుగ నేపథ్యంలో టపాసుల తయారీ కేంద్రాలు, గోదాములపై వెంటనే తనిఖీ చేసి 48 గంటల్లోగా నివేదిక ఇవ్వాలని అగ్నిమాపక శాఖ అధికారులను కలెక్టర్ హిమాన్షు శుక్లా ఆదేశించారు. నిబంధనల ప్రకారం అన్ని భద్రతా ప్రమాణాలు తప్పనిసరిగా అమలులో ఉన్నాయో లేదో సమగ్రంగా పరిశీలించాలని ఓ ప్రకటనలో సూచించారు. అగ్ని ప్రమాదాలు చోటుచేసుకోకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. తయారీ కేంద్రాల సమీపంలో పాఠశాల లేదా జనసంచారం ఎక్కువగా ఉండే ప్రదేశాలు లేకుండా చూసుకోవాలని, కేవలం లైసెన్సు పొందిన వారే బాణాసంచా తయారీ, నిల్వ చేసుకోవాలని తెలిపారు. నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

హాస్టళ్లలో మౌలిక వసతులు కల్పించండి!

● రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ జవహర్




నెల్లూరు (హరనాథపురం), అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని సాంఘిక సంక్షేమ శాఖ హాస్టళ్లలో మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ ఎస్. జవహర్ అన్నారు. బుధవారం నగరంలోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో ఆ శాఖ అధికారులతో మాట్లాడారు. ప్రభుత్వం మీద ఆధార పడకుండా జిల్లాలో పరిశ్రమలు విస్తృతంగా ఉన్న దృష్ట్యా సీఎస్ఆర్ నిధుల ద్వారా వసతుల కల్పన వంటి కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. ప్రభుత్వ రెసిడెన్షియల్ పాఠశాలల్లో మౌలిక వసతులపై ప్రత్యేక దృష్టిపెట్టి ఎలాంటి లోటు రానీయకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ముఖ్యంగా విద్యార్థుల్లో చదువుతోపాటు దేహదారుఢ్యం, పారిశుధ్యం, పర్యావరణం వంటి వాటిపై అవగాహన కల్పించాలన్నారు. జిల్లాలో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు తక్కువగా నమోదు కావటం అధికారుల పనితీరుకు నిదర్శనమన్నారు. సీమాంధ్ర ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు పందిటి సుబ్బయ్య మాదిగ, ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ అసోసియేషన్ నాయకులు పాలకీర్తి శ్రీనివాసులు, ఇందూరుపల్లి మణి, మనోజ్‌కుమార్, పరుశురాం, రమణయ్య తదితరులు సమస్యలు పరిష్కరించాలని కోరుతూ జవహర్‌కు వినతులు అందచేశారు.

ఇంటర్మీడియట్‌లో 'ముందస్తు' గుబులు

- ఫిబ్రవరిలోనే వార్షిక పరీక్షలు
- విద్యార్థులకు నష్టమంటున్న అధ్యాపకులు
- సిలబస్ పూర్తవుతుందో లేదోనన్న సందేహం
- ఫలితాలపై తీవ్ర ప్రభావం చూపే అవకాశం

కందుకూరు, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన ఇంటర్మీడియట్ పరీక్షల షెడ్యూల్ విద్యార్థులలో గుబులు రేపుతోంది. ఎన్నడూ లేనివిధంగా ఫిబ్రవరిలోనే పరీక్షలు నిర్వహిస్తుండటంతో తీవ్రంగా నష్టపోతామని విద్యార్థులు ఆందోళన చెందుతుండగా ఫలితాలపై తీవ్రప్రభావం చూపే ప్రమాదం ఉందని ప్రైవేటు విద్యాసంస్థల నిర్వాహకులు సందేహిస్తున్నారు. ఇక ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో సిలబస్ కూడా పూర్తిచేయగలుగుతామా లేదా అన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి. 2026, ఫిబ్రవరి 23వ తేదీ నుంచి ఇంటర్ పరీక్షలు ప్రారంభమయ్యేలా రాష్ట్ర విద్యా శాఖ షెడ్యూల్ విడుదల చేసింది. గత కొన్నేళ్లతో పోలిస్తే దాదాపు నెలరోజులు ముందుగా పరీక్షలు ప్రారంభమవుతుండగా గత సంవత్సరంతో పోల్చినా పరీక్షలు పది రోజులు ముందుకొచ్చాయి. కేవలం ఇంటర్ పరీక్షల షెడ్యూల్ ముందుకు రావడమేగాక జనవరి నుంచి విద్యార్థులు రివిజన్‌పై దృష్టి పెట్టుకునేందుకు ఆస్కారం లేకుండా వివిధ రకాల పరీక్షల షెడ్యూల్స్ ఉండటం తీవ్రనష్టం కలిగిస్తుందని అధ్యాపకులు ఆవేదన చెందుతున్నారు. జనవరి ప్రథమార్థం నూతన సంవత్సరం, సంక్రాంతి సెలవులతో ముగిసిపోతుండగా 24 నుంచి 29వ తేదీ వరకు జేఈఈ మెయిన్స్ పరీక్షలు జరగనున్నాయి. జనవరి ప్రారంభం నుంచే జేఈఈ మెయిన్స్‌పై విద్యార్థులు దృష్టిసారించాల్సి ఉంటుంది. ఆ వెంటనే ఫిబ్రవరి 1 నుంచి 10వ తేదీ వరకు ప్రాక్టికల్స్ ఎగ్జామ్స్ ఉంటాయి. అవి పూర్తయ్యాక 13 రోజుల్లోనే పబ్లిక్ ఎగ్జామినేషన్స్ ప్రారంభమవుతుండటం విద్యార్థులపై ఎంతో ఒత్తిడి పెంచుతుందని ఉన్నతాధికారులు పునరాలోచన చేయాలని కోరుకుంటున్నారు. అనేక ప్రభుత్వ కాలేజీల్లో ఇప్పటివరకు సగం సిలబస్ కూడా పూర్తవలేదు. ప్రైవేటు విద్యాసంస్థల్లో ఎలాగోలా సిలబస్ పూర్తయినా రివిజన్‌కు అవకాశం ఉండదన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. దీనికితోడు గత సంవత్సరం వరకు 16, 17 రోజుల్లో పూర్తయ్యే ఇంటర్ ఎగ్జామ్స్ ఈ ఏడాది 28 రోజుల పాటు జరగనున్నాయి. కీలకమైన మ్యాథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ ఎగ్జామ్స్‌కు ఒక్కో ఎగ్జామ్‌కు వారం రోజులు గ్యాప్ వస్తుండటం కూడా నష్టం కలిగించే అంశమని అధ్యాపకులు ఆందోళన చెందుతున్నారు. ఇన్ని రోజులు పరీక్షల మధ్య గ్యాప్ రావటం ప్రైవేటు విద్యాసంస్థలకు మేలవుతుందని ఆ సమయాన్ని వారు రివిజన్‌కు వాడుకుంటారు కానీ ప్రభుత్వ పాఠశాలల్లో అధ్యాపకులంతా పరీక్షల డ్యూటీలో ఉంటారు కనుక విద్యార్థులు ఈ వారం రోజులు సరదాగా గడిపేసి నష్టపోయే అవకాశాలు మెండుగా ఉన్నాయని అభిప్రాయపడు తున్నారు.



● సెమినార్‌లతో ముప్పు

ఇంటర్ కాలేజీల్లో 5 రోజులపాటు జీఎస్టీ సెమినార్‌లను తప్పనిసరి చేస్తూ విద్యా శాఖ ఉన్నతాధికారులు జారీచేసిన ఆదేశాల పట్ల అధ్యాపకులు, కళాశాలల నిర్వాహకులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు తమ ఘనతను చాటుకోవటం కోసం ఇలాంటి అనాలోచిత కార్యక్రమాలు పెడుతుండటం ఎంతవరకు సమంజసమన్న ఆందోళన వ్యక్తమవుతోంది.

నేడు మండల స్థాయి క్రీడా పోటీలు

పొదలకూరు, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): డీఎన్ఆర్ జడ్పీ బా లుర ఉన్నత పాఠశాలలో మండలస్థాయి క్రీడా పోటీలు గురు, శుక్రవారాలు నిర్వహిస్తున్నట్లు ఎంఈవోలు కె రేణుక, శోభనాద్రి తెలిపారు. ఈ పోటీలు మం డలంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో చదువుతున్న అండర్-14, అం డర్-17 బాలబాలికలకు నిర్వహిస్తామని తెలిపారు. గురువారం కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, చెస్, 10న అథ్లెటిక్స్ యోగా, బ్యాడ్మింటన్‌పోటీలు జరుగుతాయన్నారు.

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)	
ఒక గ్రాము ధర	రూ. 11672
వెండి కిలో ధర	రూ. 156600
వెండి ఒక గ్రాము	రూ. 160.60

జీవితంలో సేవ ఒక భాగం కావాలి : వెంకయ్యనాయుడు


అక్షర విద్యాలయ విద్యార్థులతో పూర్వ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు, పక్కనే ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి

వెంకటాచలం, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి) : ప్రతి ఒక్కరి జీవితంలో సేవ ఒక భాగం కావాలని, సేవ లేని జీవితం సంపూర్ణం కాదని పూర్వ ఉప రాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు పేర్కొన్నారు. మండలంలోని చవటపాళెం పంచాయతీ సరస్వతినగర్ వద్ద ఉన్న అక్షర విద్యాలయంలో బుధవారం విద్యార్థులతో మాటా - మంచి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా విద్యార్థుల ప్రశ్నలకు ఆయన సమాధానం చెప్పారు. ఆయన మాట్లాడుతూ విద్యాలయాలు చదువుతోపాటు సంస్కారం పెంచే కేంద్రాలుగా పనిచేయాలని పిలుపునిచ్చారు. విద్యార్థులకు క్రమశిక్షణ, ప్రాథమిక వ్యాయామం, యోగ, నడక జీవితంలో భాగస్వామ్యం అయ్యేవిధంగా చూడాలన్నారు. పాశ్చాత్య పోకడల బారిన పడకుండా యువతను తీర్చిదిద్దాలన్నారు. చదువుతోపాటు భారతీయ 64 కళలలో ఒకదానివైపు ఆకర్షితులై వాటిలో ప్రావీణ్యత సాధించాలని కోరారు. భారతదేశ సాంప్రదాయ ఆహారాన్ని భుజించే విధంగా చిన్నతనం నుండే అలవాటు చేయాలన్నారు. పిల్లల విషయంలో తల్లిదండ్రులు తగిన శ్రద్ధ వహించాలన్నారు. ప్రపంచంలో మూడవ ఆర్థిక వ్యవస్థగా భారత్ ఎదుగుతున్న తరుణంలో యువత ప్రముఖ పాత్ర వహించాలన్నారు. స్వర్ణభారత్ ట్రస్ట్ సేవా కార్యక్రమాలను ఆయన అభినందిస్తూ ఇలాంటి సంస్థలు మరిన్ని అవసరమని అభిప్రాయపడ్డారు. స్వర్ణభారత్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ దీపావెంకట్ సేవా నిరతని ప్రశంసించారు. అలాగే ముప్పవరపు ఫౌండేషన్ ద్వారా ముప్పవరపు హర్షవర్ధన్ చేస్తున్న సేవలను అభినందించారు. కార్యక్రమంలో ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి, అక్షర విద్యాలయ ప్రిన్సిపాల్ ప్రియా జాకబ్, ఉపాధ్యాయులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

● ఎస్పీ బాలు విగ్రహం సముచిత రీతిలో ఏర్పాటు

నెల్లూరు వాసి, ప్రముఖ గాయకుడు, ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం విగ్రహాన్ని సముచిత రీతిలో ఏదైనా ఒక ప్రముఖ కేంద్రంలో పెట్టడం సముచితంగా ఉంటుందని పూర్వ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు పేర్కొన్నారు. ఈ విషయమై మంత్రి పొంగూరు నారాయణ, నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డిలతో మాట్లాడడం జరిగిందన్నారు. వారందరూ కూడా ఇందుకు అంగీకరించి ముందుకు తీసుకువెళ్తామని చెప్పినట్లు వెంకయ్య ఈ సందర్భంగా వివరించారు.

ఇద్దరుంటేనే పీఎంఏవై 2.0 ఇళ్ల మంజూరు

గృహ నిర్మాణ శాఖ ఏఈ శ్రీపతి శరత్‌కుమార్

ఈ వారం ముఖాముఖి



మనుబోలు, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): గతంలో లాగా కాకుండా ఈ దఫా పీఎంఏ వై 2.0లో ఇల్లు మంజూరు కావాలంటే రేషన్‌కార్డులో ఇద్దరు సభ్యులు ఉండాలని మండల గృహనిర్మాణ శాఖ ఏఈ శ్రీపతి శరత్‌కుమార్ తెలిపారు.

? : మండలంలో కాలనీలో ఇళ్ళ నిర్మాణం మెరుగు పడిందా, ఎన్ని ఇళ్ల నిర్మాణాలు జరిగాయి.

! : మండలంలో 21 లేఅవుట్లు ఉన్నాయి. వాటిలో 6 లేఅవుట్లలో ఇళ్ళ నిర్మాణం జరుగుతోంది. 423 ఇళ్ళు వివిధ దశలలో నిర్మాణాలు జరుగుతున్నాయి.

? : మండలానికి పీఎంఏవై కింద ఎన్ని ఇళ్ళు మంజూరు చేశారు. ఎంత ఇస్తున్నారు.

! : 891 దరఖాస్తులు వచ్చాయి. రూరల్‌కు ప్రభుత్వం ఇంకా అనుమతి ఇవ్వలేదు. అర్బన్‌లో ఇచ్చారు. అర్బన్‌లో ఒక్కో ఇంటికి రూ.2.90లక్షలు ఇస్తున్నారు.

? : నిర్మాణాలు వదిలేసి వెళ్ళిన కాంట్రాక్టర్లపై చర్యలేంటి.

! : నోటీసులు ఇచ్చాం. పోలీసులకు ఫిర్యాదు చేశాం. కొంతమంది కాంట్రాక్టర్లు వచ్చి మరలా నిర్మాణాలు చేస్తున్నారు. పిడూరు, బద్దెవోలు కాంట్రాక్టర్లపై ఎమ్మెల్యేకు ఫిర్యాదుచేశాం. చర్యలు తీసుకోవాల్సి ఉంది.

జీఎస్టీ 2.0తో అందరికీ మేలు


కార్యక్రమంలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ హనుమంతయ్య

రాపూరు, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): జీఎస్టీ 2.0తో అందరికీ మేలు జరుగుతుందని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డా.వి.హనుమంతయ్య తెలియజేశారు. బుధవారం జీఎస్టీపై అవగాహన ర్యాలీ నిర్వహించినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకులు సాయి కిరణ్, సుధావల్లి స్థానిక పంచాయతీ సెక్రటరీ వి.కృష్ణ చైతన్య, వీఆర్ఓ రాజేశ్వరి పాల్గొన్నారు. అనంతరం విద్యార్థులకు పోటీలు నిర్వహించి బహుమతులు అందచేశారు.

సమస్యలపై జనసేన వినతి


సమస్యలపై వినతిపత్రం అందచేస్తున్న రాజేష్ జల్లెల

రాపూరు, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు సమస్యలపై మండల జనసేన నాయకుడు జల్లెల రాజేష్ మంగళగిరి పార్టీ కార్యాలయంలో బుధవారం వినతి పత్రం సమర్పించారు. నూతన రోడ్లు, డ్రైనేజీ ఆధునీకరణ, భూ సమస్యలపై వినతి పత్రం అందచేసినట్లు తెలిపారు. సమస్యల పరిష్కారంపై పార్టీ నాయకులు సానుకూలంగా స్పందించారని జల్లెల రాజేష్ తెలిపారు.

ఎమ్మెల్యేను కలిసిన నేతలు

విడవలూరు, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి) : రామతీర్థం రామలింగేశ్వరస్వామి ఆలయ చైర్మన్ సురేష్‌కృష్ణ బుధవారం ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డిని నెల్లూరులోని ఆమె నివాసంలో కలిసి కృతజ్ఞతలు తెలిపారు. తనను రామలింగేశ్వరస్వామి ఆలయ చైర్మన్‌గా నియమించడంతో బాధ్యతతో పనిచేసి ఆలయ అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు అడపాల శ్రీధర్‌రెడ్డి, ఆవులు వాసు, ఆవుల రవీంద్ర, పొన్నాడి చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఆయన విద్యుతుశాఖ ఎస్ఈ రాఘవేంద్రను కలిసి అభినందించారు.

కండలేరు నీటి లీకేజీని అరికట్టాలి

రాపూరు, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): కండలేరు డ్యాం హెడ్ రెగ్యులేటర్‌లో మరమ్మతు పనులను నిపుణులు పరిశీలించి తగు సూచనలు చేసి నీటి లీకేజీని అరికట్టాలని బీజేపీ నమామి గంగే రాష్ట్ర కన్వీనర్ మిడతల రమేష్ బుధవారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కండలేరు డ్యాం షట్టర్స్ స్ట్రక్ అయ్యి నీటి విడుదల సమయంలో మొరాయిస్తూ ఉన్నాయని ప్రభుత్వం వాటి మరమ్మతుల కోసం టెండర్లు పిలిచి, కోటి రూపాయలతో రోప్స్, బేరింగ్, షట్టర్ల అమరిక పనులు చేపట్టారు. కానీ డ్యామ్ హెడ్ రెగ్యులేటర్ వద్ద కాంట్రాక్టర్ మరమ్మతులు చేసినప్పటికీ షట్టర్లు సక్రమంగా నియంత్రణలోనికి రాలేదని, దీని వలన నీటి లీకేజ్ కొనసాగుతోందని ఆయన తెలిపారు.

'అవినీతికి కేరాఫ్ అడ్రస్ వైసీపీ'

వెంకటాచలం, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ఐదేళ్ల పాలన అవినీతికి, కల్తీ మద్యానికి కేరాఫ్ అడ్రస్‌గా నిలిచిందని సర్వేపల్లి నియోజకవర్గ జనసేన పార్టీ సమన్వయ కర్త బొబ్బేపల్లి సురేష్ నాయుడు విమర్శించారు. వెంకటాచలంలోని ఆపార్టీ కార్యాలయంలో బుధవారం ఆయన విలేకర్ల సమావేశాన్ని ఏర్పాటు చేసి మాట్లాడారు. డిప్యూటీ సీఎం, జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్‌ని విమర్శించే నైతిక హక్కు వైసీపీకి లేదన్నారు. వైసీపీ మాజీ మంత్రి పేర్ని నాని నోరు అదుపులో పెట్టుకుని మాట్లాడితే మంచిదన్నారు. కార్యక్రమంలో జనసేన నేతలు పినిశెట్టి మహేష్, పొట్లూరి సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలతో భవిష్యత్ నాశనం


అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న సీఐ శివరామకృష్ణారెడ్డి, ఎస్ఐ హనీఫ్

పొదలకూరు, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి) : మాదక ద్రవ్యాల అలవాటుతో భవిష్యత్ నాశనమవుతుందని, మాదక ద్రవ్యాల నివారణకు సమిష్టిగా కృషి చేయాలని పొదలకూరు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ శివరామకృష్ణారెడ్డి, ఎస్ఐ హనీఫ్ అన్నారు. బుధవారం పట్టణంలోని విజ్ఞాన్ జూనియర్ కాలేజీలో మాదక ద్రవ్యాల నివారణ, ఈవ్ టీజింగ్ - ర్యాగింగ్‌పై పొదలకూరు ఎస్ఐ హనీఫ్‌తో కలిసి అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ గంజాయి, ఇతర మాదకద్రవ్యాల వినియోగం వల్ల యువత భవిష్యత్ నాశనమవుతుందన్నారు. యువత డ్రగ్స్‌కు అలవాటు పడుతున్నారన్నారు. ప్రతిఒక్కరూ మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా పోరాటం చేయాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జూనియర్, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాళ్లు ఏ సుబ్బారావు, జీఎన్ రెడ్డి, అకడమిక్ డీన్ చల్లా వెంకటకృష్ణ, జూనియర్ కాలేజ్ వైస్ ప్రిన్సిపాల్ చంద్రశేఖర్, అధ్యాపక బృందం, విద్యార్థులు, పోలీసు సిబ్బంది సౌమ్య, మోహన్, రవితేజ, రసూల్, తదితరులు పాల్గొన్నారు.

గిరిజనుల కోసం ప్రత్యేక ఆధార్ కేంద్రం


మనుబోలు సచివాలయం-1లో గిరిజనులకు ఆధార్ నమోదు చేస్తున్న సిబ్బంది

మనుబోలు, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ఆదేశాలతో మనుబోలు సచివాలయం-1లో బుధవారం గిరిజనుల కోసం ప్రత్యేక ఆధార్ కేంద్రాన్ని ఏర్పాటుచేశారు. మండలవ్యాప్తంగా ఉన్న గిరిజనులంతా ఈ కేంద్రంకు వచ్చి కొత్త ఆధార్ కార్డులు, పాత ఆధార్‌లో మార్పులు చేయించుకున్నారు. తొలిరోజున 46మంది గిరిజనులకు ఆధార్ నవీకరణ చేశామని సచివాలయ సిబ్బంది తెలిపారు. వీఆర్వో నాగార్జునరెడ్డి, కార్యదర్శి శ్రావణి దగ్గరుండి గిరిజనులకు ఆధార్ కార్డులు అందించారు. మరో రెండురోజుల పాటు ఈ కేంద్రం ఉంటుందని, మండలంలోని గిరిజనులంతా ఆధార్‌కార్డులు తీయించుకోవాలని ఇన్‌చార్జి ఈవోఆర్‌డీ గరుడయ్య కోరారు.

మత్తు పదార్థాల జోలికి వెళ్లొద్దు : ఎస్ఐ


మనుబోలు బాలుర పాఠశాల విద్యార్థులతో మాట్లాడుతున్న ఎస్ఐ శివరాకేష్

మనుబోలు, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు మత్తుపదార్థాల జోలికి వెళ్ళరాదని ఎస్ఐ శివరాకేష్ హెచ్చరించారు. స్థానిక బాలుర ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు మత్తుపదార్థాలు వాడితే వచ్చే అనర్థాలపై బుధవారం పోలీసులు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ అపరిచితులు ఇచ్చిన వస్తువులు విద్యార్థులు తీసుకోవద్దని, అనుమానంగా ఎవరైనా కనిపిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. తంబాకు, గంజాయి, గుట్కా, పాన్‌పరాగ్, సిగరెట్, మద్యం వంటి జోలికి వెళ్ళకుండా చక్కగా చదువుకోవాలన్నారు. ఎవరైనా మత్తుపదార్థాలు ఇవ్వచూపితే అలాంటి వారి సమాచారాన్ని పోలీసులకు చెప్పాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం. అమూల్యకుమారి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ట్రేడ్ లైసెన్స్ ఫీజులు వసూలు చేయాలి

కావలి, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): పట్టణంలో ట్రేడ్ లైసెన్స్‌లు పొందని, రెన్యువల్ చేయని వ్యాపారస్థులకు నోటీసులు ఇచ్చి ట్రేడ్ లైసెన్స్ ఫీజులు వసూలు చేయాలని మున్సిపల్ కమిషనర్ జీ.శ్రావణ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. సచివాలయ శానిటరీ సెక్రటరీలు, మేస్త్రీలు వారి పరిధిలో ఉన్న వ్యాపారస్థుల వద్దకు వెళ్లి ట్రేడ్ లైసెన్స్‌లు లేని వారికి ట్రేడ్ లైసెన్స్‌లు వేసి రెన్యువల్ చేయని వారితో రెన్యువల్ చేయించి లైసెన్స్ ఫీజులు వసూలు చేయాలన్నారు.

తక్కువ వైకల్యం ఉన్నవారికి వైద్యపరీక్షలు

పట్టణంలో దివ్యాంగుల పింఛన్ పొందుతూ 40 శాతం కన్నా తక్కువ వైకల్యం ఉన్నవారికి ప్రభుత్వ వైద్యశాలలో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ తెలిపారు. అంగవైకల్యం ఉన్న వారికి ఈనెల 9, 11, 15, 16 తేదీలలో కావలి ఏరియా వైద్యశాలలో వైద్య పరీక్షలు నిర్వహిస్తారని పేర్కొన్నారు. అంధత్వం ఉన్న వారికి ఆత్మకూరు ప్రభుత్వ వైద్యశాలలో ఈ నెల 10వ తేదీన వైద్యపరీక్షలు నిర్వహిస్తారని పేర్కొన్నారు. వినికిడి లోపం ఉన్న వారికి నెల్లూరు జిల్లా కేంద్రంలోని వైద్యశాలలో ఈనెల 15, 16, 17 తేదీలలో వైద్యపరీక్షలు నిర్వహిస్తారని తెలిపారు. మానసిక వైకల్యం ఉన్న వారికి జిల్లా వైద్యశాల నెల్లూరులో ఈనెల 15వ తేదీన వైద్య పరీక్షలు నిర్వహిస్తారని తెలిపారు. ఇప్పటికే వార్డు, సంక్షేమ అభివృద్ధి కార్యదర్శులు వారికి నోటీస్‌లు కూడా జారీ చేశారని, వైకల్యం తక్కువ ఉన్న వారు ఈ వైద్యపరీక్షలను సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు.

చినక్రాకలో ఏపీ మోడల్ స్కూల్ ?

జలదంకి, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని చినక్రాకలో ఏపీ మోడల్ స్కూల్ ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధమవుతోన్నాయి. మండలానికి ఒక మోడల్ స్కూల్ ఇవ్వాలని రాష్ట్ర ఐటీ, విద్యాశాఖల మంత్రి నారా లోకేష్‌ను ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ కోరినట్లు సమాచారం. అందుకు మంత్రి సానుకూలంగా స్పందించడంతో ఈ మేరకు ప్రతిపాదనలు సిద్ధం చేసి రాష్ట్ర విద్యాశాఖకు పంపాలని ఎంఈవో బ్రహ్మయ్యను ఎమ్మెల్యే కాకర్ల సురేష్ ఆదేశించారు.

మంచినీటి సమస్య పరిష్కరించండి

● మున్సిపల్ కార్యాలయం ఎదుట బీజేపీ నిరసన


మున్సిపల్ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న బీజేపీ నాయకులు

బుచ్చిరెడ్డిపాళెం, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): బుచ్చిరెడ్డిపాళెం మున్సిపాలిటీ పరిధిలో ప్రజలు ఎదుర్కొంటున్న మంచినీటి సమస్య పరిష్కరించాలని బీజేపీ అర్బన్ అధ్యక్షుడు రామిశెట్టి కల్యాణ్ కోరారు. ఈ మేరకు బుధవారం మున్సిపల్ కార్యాలయం ఎదుట ఆపార్టీ నాయకులు నిరసన వ్యక్తం చేశారు. ఎంతో మంది నిరుపేద కుటుంబాలు, చేనేత కార్మికులు, రైతులు అనేక వృత్తుల వారు నివసిస్తున్న బుచ్చిలో ఎప్పుడూ లేని విధంగా తాగునీటి కొరత తాండవిస్తోందన్నారు. అధికారులు రకరకాల కుంటి సాకులు చెప్తూ తాగునీటి కోసం అధికారులు సమయం విధించారని, కానీ ఆ సమయంలో కూడా తాగునీరు రాకపోవడంతో గుక్కెడు నీళ్ల కోసం ప్రజలు నానా అవస్థలు ఎదుర్కొంటుంటే అధికారులకు పట్టడంలేదన్నారు. మోటార్లు కాలిపోయినా పట్టించుకోకుండా కూటమి ప్రభుత్వానికి చెడ్డపేరు వచ్చే విధంగా ప్రవరిస్తూ ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. ఈ నిరసనలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు కాసా శ్రీనివాసులు, ఆలూరు నాగవేణి, మోహన్‌బాబు, సురేంద్ర, నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు

జాతీయ అవార్డుకు ఉపాధ్యాయుడి ఎంపిక


బాలసుబ్రహ్మణ్యం

విడవలూరు, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని ముదివర్తి మజారా చెలికల కాలనీకి చెందిన సోడం బాలసుబ్రహ్మణ్యం జాతీయస్థాయి ఉత్తమ ఉపాధ్యాయుడి అవార్డుకు ఎంపికయ్యారు. వావిళ్ల జడ్పీ పాఠశాలలో సాంఘికశాస్త్ర ఉపాధ్యాయుడుగా పనిచేస్తు ఆయన విద్యాబోధనలలో అవలంబిస్తున్న పద్ధతులు, ప్రతిభను మెచ్చుకుంటూ త్రేతాయుగ్ స్వచ్ఛంద సంస్థ ఆయనకు అవార్డు ప్రకటించింది. త్వరలో ఆయనను న్యూఢిల్లీలో సన్మానించి అవార్డు అందజేయనున్నారు. అవార్డుకు ఎంపికైన ఆయనను పలువురు అభినందించారు.

సమాజంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకం

● సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి


నూతనంగా ఎంపికైన ఉపాధ్యాయులతో ఎమ్మెల్యే సోమిరెడ్డి

వెంకటాచలం, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): సమాజంలో ఉపాధ్యాయుల పాత్ర అత్యంత కీలకమని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి తెలిపారు. స్థానిక వీఎస్‌యూ ప్రాంగణంలో నూతన ఉపాధ్యాయుల శిక్షణ శిబిరాన్ని బుధవారం ఆయన సందర్శించారు. ఈసందర్భంగా టీడీపీ ప్రభుత్వం చేపట్టిన మెగా డీఎస్సీ ద్వారా ఉపాధ్యాయులుగా ఎంపికైన వారందరికీ ప్రత్యేక అభినందనలు తెలియజేశారు. ఆయన మాట్లాడుతూ చంద్రబాబు సీఎంగా ప్రమాణస్వీకారం చేసిన రోజే తొలి సంతకం డీఎస్సీ నిర్వహిస్తానని చెప్పారని, చెప్పిన విధంగా 150 రోజుల్లోనే మెగా డీఎస్సీ నిర్వహించారన్నారు. సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్ విద్యకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. విజయవంతంగా శిక్షణ పూర్తి చేసుకుని రాబోయే తరానికి మార్గదర్శకంగా ఉండి విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో డీఈఓ ఆర్ బాలాజీ రావు, సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్ట్ కోఆర్డీనేటర్ వెంకటసుబ్బయ్య, హరిప్రసాద్, సుధీర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేటు ఆసుపత్రి ఎదుట చెత్తపోసి, పారిశుధ్య కార్మికుల నిరసన

● కూటమి పార్టీల నేతల పంచాయితీ, సర్దుబాబు



బుచ్చి బస్టాండ్ సమీపంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రి ముందు చెత్త పోసి నిరసన వ్యక్తం చేస్తున్న పారిశుధ్య కార్మికులు

బుచ్చిరెడ్డిపాళెం, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): బుచ్చిలోని ఓ ప్రైవేటు ఆసుపత్రి ఎదుట బుధవారం మున్సిపాలిటీ పారిశుధ్య కార్మికులు చెత్త పోసి నిరసన వ్యక్తం చేశారు. వివరాల మేరకు.. మున్సిపల్ కార్మికులు చెత్త సేకరించే క్రమంలో టీడీపీ అర్బన్ అధ్యక్షుడు గుత్తా శ్రీనివాసరావు కుమారుడు డాక్టర్ శంతన్ హర్షకు సంబంధించిన ఆసుపత్రి ఎదుట చెత్త ట్రాక్టరు నిలిపారు. చుట్టుపక్కల నుంచి చెత్త సేకరించి ఆ వాహనంలో పోస్తుండడడంతో డాక్టర్ శంతన్ హర్ష అభ్యంతరం వ్యక్తం చేస్తూ కార్మికులపై మండిపడ్డారు. ఆసుపత్రి వద్ద చెత్తబండ్లు తియ్యాలని, లేకుంటే టైర్లలో గాలి తీసివేస్తానని హెచ్చరించారు. అయితే ఏమైందో ఏమో గానీ కార్మికులు ఆ ట్రాక్టర్‌లోని చెత్తను ఆసుపత్రి ఎదుట పోసి గంటకు పైగా నిరసన వ్యక్తం చేశారు. ఈ విషయం తెలుసుకున్న తెలుగుదేశం నియోజకవర్గం స్థాయి, స్థానిక నేతలు ఆసుపత్రి వద్దకు చేరుకున్నారు. కమిషనర్, టీడీపీ అర్బన్ అధ్యక్షుడు గుత్తా శ్రీనివాసరావుతో పంచాయతీ చేసి సర్దుబాటు చేయడంతో వివాదం సర్దుమణిగింది. ఈ విషయపై కమిషనర్ బాలకృష్ణను వివరణ కోరగా ప్రభుత్వ వాహనానికి గాలితీయడంపై కార్మికులు ఆగ్రహానికి గురయ్యారని, తాను వెళ్లి సర్దుబాటు చేసి చెత్త తీయించానని చెప్పారు. కాగా బుచ్చిలో అర్బన్ అధ్యక్షుడు ఆధ్వర్యంలో జరగాల్సిన ఆటో ర్యాలీకి ఆయనతోపాటు ఆయన అనుచరగణం ముఖం చాటేయడం గమనార్హం.

C.R.I.M.E N.E.W.S

విద్యుదాఘాతానికి ఎలక్ట్రీషియన్ మృతి


మర్రి శీనయ్య మృతదేహం

చేజర్ల, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ మోటారు మరమ్మతు చేస్తూ విద్యుదాఘాతానికి గురై ఎలక్ట్రీషియన్ మృతి చెందిన సంఘటన చేజర్ల మండలం ఎన్‌వి కండ్రిక పంచాయతీ పరిధిలోని గాలిపాళెంలో బుధవారం చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. గాలిపాళెం గ్రామానికి చెందిన మర్రి శీనయ్య (26) వ్యవసాయ మోటార్లు రిపేరు చేస్తూ జీవనం సాగిస్తుంటాడు. ఈ నేపథ్యంలో గ్రామ సమీపంలోని తెలుగుగంగ కాలువ హెడ్ రెగ్యులేటర్ వద్ద ఒక రైతు మోటారు మరమ్మతుకు గురికావడంతో అక్కడకు వెళ్ళి రిపేరు చేసే క్రమంలో విద్యుదాఘాతానికి గురై అక్కడిక్కడే మృతి చెందాడు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తిరుమలరావు తెలిపారు.

ఉరివేసుకుని గుర్తుతెలియని వ్యక్తి..


ఉరి వేసుకున్న మృతి చెందిన వ్యక్తి

కావలి, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆముదాలదిన్నె గ్రామ పంచాయతీ పొలాల్లో జాతీయ రహదారికి సమీపంలో తుమ్మ చెట్టుకు చొక్కాతో ఉరి వేసుకుని గుర్తుతెలియని వ్యక్తి మృతి చెంది ఉండడాన్ని బుధవారం సాయంత్రం స్థానికులు గుర్తించారు. పోలీస్‌ల కథనం మేరకు.. సుమారు 50 ఏళ్ల వయస్సు కలిగి 5.3 అడుగుల ఎత్తు ఉన్న వ్యక్తి చొక్కాతో ఉరి వేసుకుని చెట్టుకు వేలాడుతుండగా స్థానికులు గుర్తించి ఒకటో పట్టణ పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో పోలీసులు అక్కడకు చేరుకుని వివరాల తెలుసుకునేందుకు ప్రయత్నించగా ఆయన వద్ద ఎలాంటి ఆధారాలు లభ్యం కాలేదు. కేవలం ఖైనీ పొగాకు ప్యాకెట్ మాత్రమే ఉంది. దీంతో చుట్టుపక్కల వారిని విచారించగా ఆయన హైవేపై ఉన్న దాబాలలో పనిచేసే నార్త్ ఇండియన్ వాసి అయి ఉంటాడని చెప్పారు. మధ్యాహ్నం ఒంటరిగా నడుచుకుంటూ రావడాన్ని కొందరు గమనించారు. మృతదేహాన్ని కావలి ఏరియా వైద్యశాలకు తరలించి పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. మృతుడి ఆచూకీ తెలిస్తే ఒకటో పట్టణ సీఐకి 94407 96312కు సమాచారం ఇవ్వాలని కోరారు.

60 గ్రాముల బంగారు ఆభరణాల స్వాధీనం

● దంపతుల అరెస్ట్


స్వాధీనం చేసుకున్న బంగారంతో సీఐ, సిబ్బంది

నెల్లూరు రూరల్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి) : చోరీ కేసులో భార్య, భర్తలను అరెస్ట్ చేసిన వారి నుంచి 60 గ్రాముల బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నట్లు నెల్లూరు రూరల్ సీఐ గుంజి వేణు తెలిపారు. బుధవారం ఆయన స్టేషన్‌లో మీడియాకు వివరాలు వెల్లడించారు. నెల్లూరు రూరల్లోని సామంతుల వారితోపులో నివాసముంటున్న రవి చౌదరి ఇంట్లో రాయవరపు వెంకటేశ్వర్లు, లలిత దంపతులు పని చేస్తున్నారు. ఇంట్లో 60 గ్రాముల బంగారు నల్లపూల దండలు మాయమవడంతో 10 రోజుల క్రితం రవి చౌదరి పోలీసులకు ఫిర్యాదు చేశారు. అనుమానంతో వెంకటేశ్వర్లు, లలితను విచారించగా దొంగతనం చేసినట్లు ఒప్పుకున్నారు. దీంతో వారిని అరెస్ట్ చేసి సొత్తు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు.

కాలువలో పడి యువకుడి మృతి

వెంకటాచలం, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కసుమూరు సమీపంలో కసుమూరు కాలువలో ప్రమాదవశాత్తు పడి ఓ యువకుడు మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. విడవలూరు మండలం ఉటుకూరు గ్రామానికి చెందిన అల్లూరు శ్రీకాంత్ (30)కు కసుమూరుకు చెందిన శిరీషాతో వివాహం జరిగింది. కాగా శ్రీకాంత్ చెన్నైలోని ఓ ప్రైవేటు కంపెనీలో సీఏగా ఉద్యోగం చేస్తున్నాడు. దసరా పండుగ సందర్భంగా కసుమూరులోని అత్తగారింటికి రాగా రెండురోజుల కిందట మార్నింగ్ వాకింగ్‌కు వెళ్లాడు. కానీ తిరిగి ఇంటికి రాకపోవడంతో భార్య శిరీషా ఫోన్ చేసినా అందుబాటులోకి రాలేదు. చుట్టుపక్కల గాలించినా కనిపించలేదు. ఈనేపథ్యంలో బుధవారం కసుమూరు కాలువలో ఒక మృతదేహం కనిపించడంతో విషయం తెలుసుకుని వెళ్లి చూడగా తన భర్త మృతదేహంగా గుర్తించింది. బహిర్భూమికి వెళ్లి ప్రమాదవశాత్తు కాలువలో పడి చనిపోయి ఉంటాడని భావిస్తున్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

జామియా మసీదు వక్ఫ్ భూమిలో ఉద్రిక్తత

● వక్ఫ్ బోర్డు రాష్ట్ర చైర్మన్, అధికారులతో స్థానికుల వాగ్వాదం

● భూముల పరిరక్షణ చర్యలు : అబ్దుల్ అజీజ్


జామియా మసీదు వక్ఫ్ భూములను పరిశీలిస్తున్న రాష్ట్ర వక్ఫ్‌బోర్డు చైర్మన్ అబ్దుల్‌అజీజ్

నెల్లూరు (సాంస్కృతికం), అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరులోని మనుమసిద్ధి నగర్‌లో జామియా మసీదుకు చెందిన వక్ఫ్ భూమి వద్ద బుధవారం ఉద్రిక్తత చోటుచేసుకుంది. మసీదు భూమి చదును చేసి అభివృద్ధి చేస్తామని రాష్ట్ర వక్ఫ్ బోర్డు చైర్మన్ అబ్దుల్‌అజీజ్ అధికారులతో కలిసి ఆ ప్రాంతానికి వచ్చారు. భూమిని పరిశీలిస్తుండగా వారితో స్థానిక ముస్లిం నాయకులు వాగ్వాదానికి దిగారు. సదరు స్థలాన్ని స్థానిక ప్రజల అవసరాలకే వినియోగించాలని, మసీదు, ఖబర్‌స్థాన్, వసతి గృహం వంటి వాటికి వినియోగించాలని, అభివృద్ధి పేరిట వేరే కార్యక్రమాలకు ఈ భూములు కేటాయించవద్దని డిమాండ్ చేశారు. మాటా మాటా పెరిగి ఉద్రిక్తతకు దారి తీసింది. పోలీసులు ఇరువర్గాలకు నచ్చజెప్పి సర్దుబాటు చేశారు. అనంతరం అబ్దుల్‌అజీజ్ విలేకరులతో మాట్లాడుతూ జామియా మసీదు వక్ఫ్ భూమి 13 ఎకరాలను చదును చేసి ప్రహరీ నిర్మించబోతున్నామన్నారు. ఆ భూమిని ఎలా వినియోగించాలన్న దానిపై కలెక్టర్, స్థానిక ప్రజా ప్రతినిధులు, ముస్లిం మతపెద్దలతో చర్చించి ప్రణాళికలు సిద్ధం చేస్తామని చెప్పారు. కాగా, రాష్ట్ర వ్యాప్తంగా 67వేల ఎకరాల వక్ఫ్ భూములుండాల్సి ఉండగా కాలక్రమంలో ఆక్రమణలకు గురయ్యాయని అజీజ్ తెలిపారు. ఈ క్రమంలో వక్ఫ్ భూముల పరిరక్షణకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ భూముల ద్వారా ఆదాయాన్ని పెంచి, పేద ముస్లింల సంక్షేమం, అభివృద్ధికి కృషి చేస్తామని చెప్పారు. నవంబరు 11వతేదీ రాష్ట్ర వ్యాప్తంగా 28 ప్రాంతాల్లో స్కిల్‌డెవలప్‌మెంట్ కేంద్రాలు ప్రారంభిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు ముస్లిం నాయకులు పాల్గొన్నారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	118
స్కిన్ చికెన్	214
స్కిన్‌లెస్	236

కోడిగుడ్ల ధర (100): 540

డీకేడబ్ల్యూలో జీఎస్టీ సూపర్ సేవింగ్స్‌పై వక్తృత్వ పోటీలు

నెల్లూరు(వ్యవసాయం), అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): నగరంలోని దొడ్ల కౌసల్యమ్మ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో బుధవారం జీఎస్టీ 2.0 సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్‌పై విద్యార్థులకు వక్తృత్వ పోటీలు నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ గిరి, వైస్ ప్రిన్సిపాల్ ఏవీ రమణారావు, అర్థశాస్త్ర అధ్యాపకులు రామకృష్ణారెడ్డి, చెంచురామయ్య జీఎస్టీ 2.0 సంస్కరణలపై పిల్లలకు అవగాహన కల్పించారు. పోటీల్లో మొదటి మూడు స్థానాల్లో నిలిచిన ఎన్ చెంగాలీ(బీకాం), ఎస్టీ హందాభాను(సీఏ), హన్సిక(బీకాం)కు సర్టిఫికెట్లు అందించారు. ఈ కార్యక్రమంలో కామర్స్ విభాగాధిపతి డాక్టర్ ఆర్ విజయ భాస్కర్, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.



సర్టిఫికెట్లు అందుకున్న విద్యార్థులతో ప్రిన్సిపాల్ తదితరులు

ఈగల్ ఏమైంది?

- జిల్లాలో యథేచ్ఛగా గంజాయి విక్రయాలు
- సేల్స్‌మెన్లతో వ్యాపారుల అమ్మకం
- రైల్వే స్టేషన్‌లు, బస్టాండ్లు, విద్యాసంస్థలే లక్ష్యం
- ముందు శ్యాంపిల్స్ అందించి, ఆపై ఆకర్షణ, బానిసలుగా..
- గంజాయి మత్తులో పెరుగుతున్న నేరాలు

నెల్లూరు(క్రైం), అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో గంజాయిని ఎంత పట్టుకుంటే అంతకు రెండింతలు మళ్లీ దొరుకుతూనే ఉంది. గంజాయి, మాదకద్రవ్యాలపై ఉక్కుపాదం మోపేందుకు ప్రభుత్వం ఈగల్ (ఎలైట్ యాంటీ నార్కోటిక్స్ గ్రూప్ ఫర్ లా ఎన్‌ఫోర్స్‌మెంట్)ను రంగంలోకి దింపినా ఏమాత్రం ఆగడం లేదు. పేరుకే ఈగల్ అని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. జిల్లాలో జరిగే అధిక నేరాలకు గంజాయే ప్రధాన కారణమని పోలీసుల విచారణలో స్పష్టమైంది.

● యువత, విద్యార్థులే లక్ష్యం

గంజాయి విక్రయదారులు యువత, విద్యార్థులనే లక్ష్యంగా చేసుకుని అమ్మకాలు సాగిస్తున్నారు. ఇటీవల జరుగుతున్న హత్యలు, గొడలు, హత్యాయత్నాలు అన్ని గంజాయి మత్తులోనే జరుగుతున్నాయని పోలీసుల విచారణలో తేలింది. గతంలో చిన్నబజారు పోలీసులు డ్రగ్ రాకెట్‌ను అదుపులోకి తీసుకోగా, వారు విద్యార్థులకు డ్రగ్స్‌ను విక్రయిస్తున్నట్లు తేలింది. అయినా పోలీసులు డ్రగ్స్, గంజాయి మత్తులోకి వెళుతున్న విద్యార్థులు, యువతపై దృష్టి సారించడం లేదు. జిల్లాలోని కొన్ని ప్రైవేటు, కార్పొరేట్ కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులు మత్తుకు బానిసలుగా మారుతున్నారు. యాజమాన్యాలకు ఈ విషయం తెలిసినా, తల్లిదండ్రులకు విషయాన్ని తెలియచేసి మిన్నకుండిపోతున్నారు. తమ విద్యాసంస్థలకు ఎక్కడ చెడ్డపేరు వస్తుందో అన్న భావనతో వారు మౌనం వహిస్తున్నారు.



● సేల్స్‌మెన్‌తో వ్యాపారం

వ్యాపారులు విశాఖపట్టణం, పరిసర ప్రాంతాల నుంచి గంజాయిని రైలు, రోడ్డు మార్గాల ద్వారా జిల్లాకు దిగుమతి చేసుకుంటున్నారు. ఆ గంజాయిని కిందస్థాయి వ్యాపారులకు కేజీ రూ.8 వేల నుంచి రూ.10 వేల వరకు విక్రయిస్తున్నారు. వారు 20, 50 గ్రాముల ప్యాకెట్‌లుగా చేసి విక్రయిస్తున్నారు. కొందరైతే సేల్స్‌మెన్స్‌ను ఏర్పాటు చేసుకొని వారికి ఒక్కో గంజాయి ప్యాకెట్‌పై కమీషన్‌తోపాటు నెలవారీ జీతం ఇస్తున్నారు. దీంతో ముందుగా వారు కళాశాలలు, పాఠశాలలు, రైల్వే స్టేషన్లు, ఆర్టీసీ బస్టాండ్లు, సినిమా థియేటర్లు, కేఫ్‌లు, బార్లు, మద్యం దుకాణాలు, క్రీడామైదానాలను లక్ష్యంగా చేసుకుని విక్రయాలు సాగిస్తున్నారు. ఆయా ప్రాంతాల్లో సిగరెట్లు, మద్యం సేవించే వారిని గుర్తిస్తారు. వారి వద్దకు వెళ్లి 'ఓ సారి పీల్చండి...ఈ మత్తు చూడండి' అంటూ ఫ్రీగా ఇచ్చి అలవాటు చేస్తారు. ఆ తర్వాత మత్తుకు అలవాటు పడ్డాక గంజాయిని అధిక ధరలకు విక్రయిస్తారు.



నిందితులతోపాటు గంజాయిని స్వాధీనం చేసుకుని కేసు వివరాలు వెల్లడిస్తున్న రైల్వే పోలీసులు (కేసు)

కేసుల వివరాలు ఇలా...

సంవత్సరం	కేసులు	పట్టుకున్న గంజాయి	రూ.ధర	అరెస్టులు	వాహనాల సీజ్
2021	16	270.7 కేజీలు	2.70 లక్షలు	39	7
2022	7	708.4 కేజీలు	7.8 లక్షలు	15	7
2023	16	369.5 కేజీలు	3.69 లక్షలు	93	10
2024	13	111.9 కేజీలు	1.11 లక్షలు	44	3

● బానిసలుగా విద్యార్థులు

ఇంటర్ విద్యార్థులు తమ స్నేహితులు, తోటి క్లాస్‌మెట్స్ క్రీడల్లో పరిచయం అయ్యే వ్యక్తుల ద్వారా మత్తుకు అలవాటు పడుతున్నారు. అందుబాటు ధరల్లో ఎక్కడ పడితే అక్కడ దొరుకుతున్న గంజాయికి వారు బానిసలుగా మారుతున్నారు. విద్యార్థుల కోసం అన్నట్లుగా విక్రయదారులు 50, 100 గ్రాముల ప్యాకెట్లలో గంజాయిను అమ్ముతున్నారు. ఇక అక్కడ నుంచి వారు మత్తు పదార్థాలైన ఎల్ఎస్‌డీ , ఎండీఎంఏ, బ్రౌన్‌షుగర్, హెరైన్ వంటి వాటి వైపు పయనిస్తున్నారు.

క్యాన్సర్ ముందస్తు పరీక్షలు చేయించుకోవాలి

● మెడికవర్‌లో స్క్రీనింగ్ పోస్టర్ల విడుదల

నెల్లూరు (వైద్యం), అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి) : క్యాన్సర్ వ్యాధులపై భయం వద్దని, ముందస్తు పరీక్షల ద్వారా వ్యాధిని గుర్తించి చికిత్సలతో బయటపడవచ్చని మెడికవర్ ఆసుపత్రి వైద్య నిపుణులు వెల్లడించారు. ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షల పోస్టర్లను వైద్యులు బుధవారం ఆసుపత్రిలో విడుదల చేశారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కొండేటి మాధవి మాట్లాడుతూ ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రుల భాగస్వామ్యంతో క్యాన్సర్ అవగాహన కార్యక్రమాలు గ్రామీణ స్థాయికి చేరుకోవాలన్నారు. గైనకాలజీ సొసైటీ జిల్లా అధ్యక్షురాలు డాక్టర్ పల్లంరెడ్డి యశోధర మాట్లాడుతూ ప్రతీ ఏటా మహిళలు బ్రెస్ట్ క్యాన్సర్ పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. మెడికవర్ ఆసుపత్రి అంకాలజిస్ట్ డాక్టర్ లోకేశ్వరి మాట్లాడుతూ ఆసుపత్రిలో అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన క్యాన్సర్ నిర్ధారణ, చికిత్సలు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. ఆసుపత్రి క్లస్టర్ హెడ్ రంజిత్ కుమార్, సెంటర్ హెడ్ పవన్‌కుమార్ మాట్లాడుతూ ఈ నెల 31వ తేదీ వరకు క్యాన్సర్ ఉచిత పరీక్షలు జరుగుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో హైకోర్టు న్యాయవాది దీప్తి లక్ష్మి, జేసీఐ ఉమెన్ క్లబ్ అధ్యక్షురాలు మహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న మెడికవర్ వైద్యులు

పద్య కంఠస్థ పోటీ విజేతలకు బహుమతులు

నెల్లూరు (సాంస్కృతికం), అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని మూలాపేట అన్నదేవుల గోవిందారెడ్డి సరస్వతీ సమాజంలో ఇటీవల జరిగిన తెలుగు పద్యాల కంఠస్థ పోటీ విజేతలకు బుధవారం బహుమతి ప్రదానం జరిగింది. సరస్వతీ సమాజం అధ్యక్షుడు మోపూరు పెంచలయ్య మాట్లాడుతూ ఉద్యోగాల కోసం పరభాషపై మక్కువతో ఉన్న విద్యార్థులు మాతృభాషను మరిచిపోతున్నారన్నారు. తెలుగును మర్చిపోకుండా, దాని విశిష్టతను తెలియజేసేందుకే పద్య పోటీలు నిర్వహించామన్నారు. తెలుగు భాష నేర్చుకోవా ల్సిన అవసరాన్ని బాలభవన్ డైరెక్టర్ జీ సుభద్రాదేవి, పెన్నా రచయితల సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు మోపూరు పెంచలనరసింహులు విద్యార్థులకు వివరించారు. మాతృభాష అభివృద్ధికి సరస్వతీ సమాజం చేస్తున్న కృషిని అభినందించారు. అనంతరం విజేతలకు బహుమతి ప్రదానం చేశారు. విద్యార్థులకు తెలుగు పద్యాలు నేర్పించి పోటీలకు పంపిన ఉపాధ్యాయులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో కే వెంకటస్వామిరెడ్డి, మల్లెల శ్రీహరి, రమణయ్య, బాబురెడ్డి, వై వెంకటేశ్వర్లు, కోటేశ్వరరావు, శ్రీనివాసులు, రఘు, గురుబ్రహ్మం, తదితరులు పాల్గొన్నారు.



విజేతలతో సరస్వతీ సమాజం కమిటీ సభ్యులు

నెల్లూరు ఆర్టీసీ బస్టాండుకు స్వచ్ఛాంధ్ర అవార్డు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ నెల్లూరు ప్రధాన బస్టాండుకు జిల్లా స్థాయిలో స్వచ్ఛ బస్ స్టేషన్ అవార్డు రావడం ఆనందంగా ఉందని ఆర్టీసీ నెల్లూరు జోనల్ చైర్మన్ సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి తెలిపారు. ఆ బస్టాండులో బుధవారం ఆయన అధికారులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి అభినందనలు తెలిపారు. జిల్లాలోని ప్రతీ బస్టాండును స్వచ్ఛ బస్టాండుగా నిలిపేందుకు అధికారులు కృషి చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం బస్‌స్టేషన్ పారిశుధ్య సిబ్బందిని అభినందించి సత్కరించారు. వారికి చీరలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రజా రవాణా అధికారి షేక్ షమీమ్, సీటీఎం రమేష్, నెల్లూరు-1,2 డిపోల మేనేజర్లు వెంకటేశ్వర్లు, కరిమున్నీసా తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్టీసీ రీజనల్ చైర్మన్ సురేష్‌రెడ్డి

ప్రధాని మోదీ పాలనలో రెండు స్కాములు

● కేంద్ర మాజీ మంత్రి చింతా

నెల్లూరు (సాంస్కృతికం), అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి) : దేశ ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ 11 ఏళ్ల పాలనలో రెండు కుంభకోణాలు జరిగాయని, వాటిని ఎవరూ ప్రస్తావించడంలేదని కేంద్ర మాజీ మంత్రి చింతా మోహన్ ఆరోపించారు. బుధవారం నగరంలోని ప్రెస్‌క్లబ్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. మోదీ ప్రధాని కాకముందు రెండు హామీలు ఇచ్చారని చెప్పారు. వాటిలో ఒకటి దేశంలోని నల్లధనాన్ని వెలికితీసి ప్రతీ కుటుంబానికి రూ.15లక్షలు ఇస్తామన్నారని, రెండోది సంవత్సరానికి రూ.2కోట్ల ఉద్యోగులు ఇస్తామని వాగ్దానం చేశారన్నారు. ఈ రెండింటినీ నెరవేర్చలేదన్నారు. రుణ మాఫీ పేరుతో దాదాపు రూ.లక్ష కోట్లు మింగేశారని, దీనికి బీజేపీ సమాధానం చెప్పాలన్నారు. అలాగే రష్యా నుంచి లీటరు రూ.30కు ముడి చమురు కొనుగోలు చేస్తున్నారని, కానీ ఆ ఆయిల్ పెట్రోలు బంకులకు రావడంలేదన్నారు. అదంతా మోదీ మిత్రులకు చేరుతోందని, వారు యూరప్ దేశాలకు ఎగుమతి చేసుకుని సొమ్ము చేసుకుంటున్నారని, తద్వారా రూ.50వేల కోట్లు సంపాదించుకుంటున్నారని ఆరోపించారు. మోదీ పాలనలో అయోధ్యలో రామాలయ నిర్మాణం, 125 అడుగుల పటేల్ విగ్రహ నిర్మాణం తప్ప ఏ అభివృద్ధీ చేయలేదన్నారు. ఆర్ఎస్ఎస్ వైఖరిపై చింతా తీవ్ర విమర్శలు చేశారు. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిపై చెప్పు విసరడం హేయమైన చర్యగా ఖండించారు. చంద్రబాబు తొందరపాటు బాబుగా మారారని విమర్శించారు.



వేదగిరి క్షేత్రం చైర్మన్‌గా అచ్యుతరెడ్డి బాధ్యతల స్వీకరణ

నెల్లూరు రూరల్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి) : వేదగిరి లక్ష్మీనరసింహ స్వామి ఆలయ ట్రస్టు బోర్డు చైర్మన్‌గా పొట్టేపాళెం గ్రామానికి చెందిన ఇందుపూరు అచ్యుత శంకర్‌రెడ్డి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయనతోపాటు ముత్తంశెట్టి శీనయ్య, చెరుకూరు సింహాద్రి, పురిణి సరస్వతి, బెల్లం శ్రీనివాసులురెడ్డి, తోడేటి కామాక్షమ్మ, మడపాకుల జయమ్మ, కొత్తకోట కవిత, డబ్బుగుంట కృష్ణయ్య, కందుకూరు శ్రావణి ట్రస్టు బోర్డు సభ్యులుగా బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా స్వామి వారి సన్నిధిలో ప్రత్యేక పూజలు, విశేష అభిషేకాలు నిర్వహించారు. అందరిని సమన్వయం చేసుకుని ఆలయ అభివృద్ధికి కృషి చేస్తామని చైర్మన్, సభ్యులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ మాజీ చైర్మన్లు వేమిరెడ్డి సురేంద్రరెడ్డి, అశోక్‌రెడ్డి, ఈవో గోపి పాల్గొన్నారు.



రోజంతా నాణ్యమైన త్రీఫేస్ కరెంటు

● 20 రోజుల్లో అందుబాటులోకి : రూరల్ ఎమ్మెల్యే

నెల్లూరు రూరల్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరు రూరల్లోని విద్యుత్ వినియోగదారులకు మరో 20 రోజుల వ్యవధిలో రోజంతా త్రీఫేస్ కరెంట్ అందుబాటులోకి రానున్నదని రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి తెలిపారు. మండలంలోని పాత వెల్లంటిలో రూ.3.11 కోట్లతో నిర్మించిన నూతన విద్యుత్ సబ్‌స్టేషన్‌ను బుధవారం ఆయన ప్రారంభించారు. మండలంలోని 18 గ్రామ పంచాయతీలు, 1,2,12 మున్సిపల్ డివిజన్లలోని విద్యుత్ వినియోగదారులకు త్రీ ఫేస్ కరెంటు 24 గంటలూ అందుబాటులోకి తీసుకువస్తున్నామని చెప్పారు. దీని వల్ల 80 వేల మందికి విద్యుత్ కష్టాలు తీరుతాయన్నారు. పొట్టేపాళెం కలుజు వద్ద వంతెన నిర్మాణ పనులు అతిత్వరలో మొదలుకానున్నాయని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేత గిరిధర్‌రెడ్డి, నాయకులు వేమిరెడ్డి సురేంద్రరెడ్డి, పముజుల ప్రదీప్, ఇందుపూరు శ్రీనివాసులురెడ్డి, సోము జనార్దన్ రెడ్డి, వెంకటేశ్వర్లురెడ్డి, సురేష్‌రెడ్డి పాల్గొన్నారు.



శిలాఫలకం ఆవిష్కరణలో ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి, పక్కన గిరిధర్‌రెడ్డి, నాయకులు

వారం రోజుల కర్నూలు పర్యటనకు గిరిధర్‌రెడ్డి

ప్రధాని మోదీ కర్నూలు పర్యటన నేపథ్యంలో అక్కడ పార్టీ, ప్రభుత్వ పరంగా చేపట్టాల్సిన ఏర్పాట్ల కమిటీలో టీడీపీ నేత గిరిధర్‌రెడ్డికి టీడీపీ నాయకత్వం చోటు కల్పించింది. దీంతో ఆయన గురువారం నుంచి వారంరోజులు కర్నూలులో ఉంటారని రూరల్ ఎమ్మెల్యే కార్యాలయం పేర్కొంది.

న్యూస్ బాక్స్

14 నుంచి అలంకార వెంకయ్యస్వామి ఆరాధనోత్సవాలు

నెల్లూరు (సాంస్కృతికం), అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని శ్రామిక నగర్‌లో ఉన్న అలంకార వెంకయ్యస్వామి మందిరంలో 22వ వార్షికోత్సవ, ఆరాధనోత్సవాలు ఈనెల 14 నుంచి 16వతేదీ వరకు నిర్వహిస్తున్నట్లు ఆలయ వ్యవస్థాపకురాలు మొలతాటి నీరదమ్మ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 14వతేదీ ఉదయం సుప్రభాత సేవ, గణపతి పూజ, మహాన్యాస పూర్వక రుద్రాభిషేకాలు జరుగుతాయని తెలిపారు. అశ్వత్థ నారాయణ కల్యాణం, భజనలు, సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతాయని పేర్కొన్నారు. 15వతేదీ సుదర్శన హోమం, అన్నప్రసాద వితరణ, 16వతేదీ ప్రత్యేక అభిషేకాలు, విశేష పూజలు జరుగుతాయని తెలిపారు. రాత్రి ఐరావత వాహనంపై నగరోత్సవం జరుగుతుందని. భక్తులందరూ తరలిరావాలని ఆమె కోరారు.

అంబేడ్కర్ విగ్రహాన్ని తగలబెట్టిన వారిని శిక్షించాలి

నెల్లూరు(హరనాథపురం), అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి) : చిత్తూరు జిల్లా గంగాధర నెల్లూరు నియోజకవర్గం దేవళ్లమిట్ట గ్రామంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని తగులబెట్టిన దుండగులను వెంటనే శిక్షించాలని మాల ఐక్యవేదిక గౌరవాధ్యక్షుడు ఇంగిలాల మదన మిత్రా, మాల ఉద్యోగుల సంఘం గౌరవ అధ్యక్షుడు నూకలపాటి రమణయ్య, నాయకుడు ఎర్రజర్ల శివ డిమాండ్ చేశారు. బుధవారం నగరంలోని మాల ఐక్యవేదిక కార్యాలయం ఎదుట వారు నిరసన తెలిపారు. సుప్రీంకోర్టు సీజేపై బూటు విసిరిన న్యాయవాదిని అరెస్టు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాల ఉద్యోగుల సంఘం నాయకులు, మాల ఐక్యవేదిక, బీటీఏ నాయకులు పాల్గొన్నారు.

రాష్ట్రాన్ని మద్యాంధ్రప్రదేశ్‌గా మార్చేశారు : పూజిత

నెల్లూరు(క్రైం), అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రాన్ని మద్యాంధ్రప్రదేశ్‌గా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మార్చేశారని వైసీపీ రాష్ట్ర మహిళా విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్ కాకాణి పూజిత విమర్శించారు. నకిలీ మద్యం తయారీదారులపై చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం బీవీనగర్‌లోని ఎక్సైజ్ డీసీ కార్యాలయం ఎదుట వైసీపీ మహిళా విభాగం ఆధ్వర్యంలో మహిళలు నిరసన చేపట్టి మద్యం బాటిళ్లను ధ్వంసం చేశారు. పూజిత మాట్లాడుతూ రాష్ట్రంలో మద్యం ఏరులై పారుతోందని, చుక్క నీరు దొరకని ప్రాంతాల్లో సైతం మద్యం దొరుకుతోందని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకురాలు మెయిళ్ల గౌరి తదితరులు పాల్గొన్నారు.

తురకా సూరిబాబు అరెస్ట్, బెయిల్‌పై విడుదల

నెల్లూరు(క్రైం) అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): ఓ సివిల్ కేసులో మాజీ కార్పొరేటర్ భర్త తురకా సూరిబాబును వేదాయపాలెం పోలీసులు బుధవారం అరెస్ట్ చేశారు. రెండు నెలల కిందట కార్మిక నగర్‌లో మూడు ఎకరాల తొమ్మిది సెంట్ల భూమిని సూరిబాబు ఆక్రమించాడని దయాకర్ రెడ్డి అనే వ్యక్తి పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు కేసు నమోదు చేసి బుధవారం సూరిబాబును అరెస్ట్ చేశారు. రిమాండ్ నిమిత్తం కోర్టుకు తరలించారు. కోర్టు సూరిబాబుకు బెయిల్ మంజూరు చేసింది. దీంతో ఆయనను విడుదల చేశారు.

సీమాంధ్ర బీసీ సంక్షేమ సంఘం రూరల్ అధ్యక్షుడిగా రాంబాబు



విలేకరుల సమావేశంలో ఉల్లిపాయల శంకరయ్య, నాయకులు

నెల్లూరు (సాంస్కృతికం), అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి) : సీమాంధ్ర బీసీ సంక్షేమ సంఘం రూరల్ అధ్యక్షుడిగా బాలు రాంబాబును నియమిస్తున్న ట్లు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఉల్లిపాయల శంకరయ్య తెలిపారు. బుధవారం నగరంలోని జర్నలిస్టు భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. రూరల్ నియోజకవర్గంలోని ప్రతీ గ్రామంలో కమిటీలు, టౌన్ పరిధిలో డివిజన్ స్థాయి కమిటీలను ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటిం చారు. అర్హులైన బీసీలకు కార్పొరేషన్ రుణాలు అందించేలా రాష్ట్ర ప్రభు త్వం చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో టీ బాబురెడ్డి, ఐ రమేష్, వీ శ్రీనివాసులు, కే దయాకర్, కే వీరబాబు పాల్గొన్నారు.





పప్పులవీధిలో బుధవారం పగటి పూట దుకాణాల ముందు నిలిపిన ట్యాంకరు, పక్కన ఆగిన వాహనాలు

ఎస్పీ చెప్పినా ఏమిటిది?

- పప్పులవీధిలో పగటి పూటే భారీ వాహనాలు
- పట్టించుకోని పోలీసులు

నెల్లూరు(క్రైం), అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): నగరంలోకి భారీ వాహనాలను పగటి పూట అనుమతించవద్దని, రాత్రి వేళల్లోనే రాకపోకలకు అనుమతులు ఇవ్వాలని ఎస్పీ డాక్టర్ అజిత వేజెండ్ల ట్రాఫిక్ పోలీసులను ఇటీవల ఆదేశించారు. ఈ క్రమంలో స్టోన్‌హౌస్‌పేట, పప్పులవీధి, ఇతర రద్దీ ప్రాంతాల్లోని వ్యాపారస్తులతో ట్రాఫిక్ పోలీసులు ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. పగటిపూట భారీ వాహనాలకు అనుమతులు లేవని, ఉదయం పూట వాహనాలు నిలిపి సరుకు అన్‌లోడ్ చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆ తర్వాత రెండు రోజులు భారీ వాహనాలు నిలపకపోవడంతో ట్రాఫిక్ అంతరాయం లేకుండా సాగిపోయింది. అయితే అది రెండు రోజుల ముచ్చటే అయ్యింది. తాజాగా వ్యాపారులు మళ్లీ పగటి పూట భారీ వాహనాలను దుకాణాల ముందు నిలిపి సరుకు అన్‌లోడ్ చేసుకుంటున్నారు. ట్రాఫిక్ పోలీసులు అక్కడే బైక్‌లపై కూర్చొని వేడుక చూస్తున్నారేగానీ పట్టించుకోకపోవడం గమనార్హం. దీంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది.

ఉపాధి హామీ పనుల అవకతవకలపై విచారణ

కొండాపురం, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని మర్రిగుంటలో ఉపాధి హామీ పనుల అవకతవకలపై ఏపీడీ మృదుల బుధవారం గ్రామంలో విచారణ చేపట్టారు. ఆమె మాట్లాడుతూ క్షేత్ర సహాయకుడు బీ.అంకబాబు 2022-23 సంవత్సరానికి సంబంధించి ఒకరి పేరుపై మరొకరు ఉపాధి పనులను చేయించి అవినీతికి పాల్పడినట్లు అదే గ్రామానికి చెందిన పలువురు జిల్లా కలెక్టరుకు ఫిర్యాదు చేశారన్నారు. ఆయన ఆదేశాల మేరకు గ్రామంలో విచారణ నిర్వహించామన్నారు.

ఎన్‌సీసీలో 'నారాయణ' విద్యార్థుల ప్రతిభ

నెల్లూరు(వ్యవసాయం), అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): ఎన్‌సీసీ నేవల్ యూనిట్ గుంటూరులో నిర్వహించిన ఎల్‌ఏటీసీ క్యాంపులో జరిగిన వివిధ పోటీల్లో నెల్లూరు నారాయణ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు ప్రతిభ కనబర్చినట్లు ఆ కళాశాల డైరెక్టర్ డాక్టర్ బీ దత్తాత్రేయశర్మ పేర్కొన్నారు. మూడో సంవత్సరం సీఎస్ఈ చదువుతున్న ఎండీ అదీలా బెస్ట్ కేడెట్ అవార్డు, రెండో సంవత్సరం మెకానికల్ విద్యార్థి పీ వికాస్ సాంస్కృతిక విభాగంలో, బోట్ సెయిలింగ్‌లో గోల్డ్ మెడల్ సాధించినట్లు తెలిపారు. తేజస్వీరెడ్డి, హర్షిణి, యశ్వంత్, వికాస్, అదీలాలు సికింద్రాబాద్‌లో జరగబోయే ఐజీసీ-ఆర్‌డీసీ శిబిరానికి ఎంపికైనట్లు పేర్కొన్నారు. వారికి కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసులు రెడ్డి, సీటీవోడీ ప్రసాదరావు, డీన్ విశ్వక్‌సేన్‌రెడ్డి, హెచ్‌వోడీ ఏవీఎస్ శ్రీధర్, ఏజీఎం బీవీ శ్రీధర్ బుధవారం అభినందనలు తెలిపారు.



ప్రతిభ కనబర్చిన విద్యార్థులతో కళాశాల డైరెక్టర్, ప్రిన్సిపాల్ తదితరులు

ఆత్మకూరు మున్సిపాలిటీకి రాష్ట్రస్థాయి అవార్డు

ఆత్మకూరు, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో ఆత్మకూరు మున్సిపాలిటీకి రాష్ట్రస్థాయి అవార్డు దక్కడం పట్ల మున్సిపల్ చైర్‌పర్సన్ జి వెంకటరమణమ్మ, టీడీపీ పట్టణ అధ్యక్షుడు తుమ్మల చంద్రారెడ్డి, పలువురు మున్సిపల్ కౌన్సిలర్లు, మున్సిపల్ వర్కర్స్(ఏఐటియుసి) యూనియన్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. బుధవారం స్థానిక మున్సిపల్ కార్యాయలంలో వారు కమిషనర్ జి గంగాప్రసాద్‌ను సన్మానించారు. ఈ సందర్భంగా వారు ఆత్మకూరు అభివృద్ధికి కృషిచేస్తున్న మంత్రి ఆనం రామనారాయణరెడ్డికి ధన్యవాదాలు తెలిపారు.

నెల్లూరుపై ఆంగ్ల కవితా సంపుటి

నెల్లూరు (సాంస్కృతికం), అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరీయుడైన అంతర్జాతీయ కవి డాక్టర్ పెరుగు రామకృష్ణ తన సాహితీ స్వర్ణోత్సవం సందర్భంగా జన్మభూమి నెల్లూరు నగరంపై 50 ఆంగ్ల కవితలు రాసి సంపుటిగా ప్రచురించారు. నెల్లూరు ప్రాముఖ్యతలు ప్రపంచానికి తెలియజేయాలని ఈ కవితలు రాశారు. ఆ పుస్తకం బుధవారం విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య అల్లం శ్రీనివాసరావు తన చాంబర్‌లో ఆవిష్కరించారు. తొలి ప్రతిని విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ఆచార్య సునీతకు అందించారు. కార్యక్రమంలో మెరైన్ బయాలజీ ఆచార్య వెంకట్రాయులు కూడా పాల్గొన్నారు. సంపుటిలో వీఎస్‌యూపై కూడా కవిత ఉండటంపై వీసీ హర్షం వ్యక్తం చేశారు. గ్రీకు కవయిత్రి ప్రొఫెసర్ ఇరేన్ కవాడియా ఈ కవితా సంపుటికి ముందు వాక్యం రాశారని కవి తెలిపారు.



ఆంగ్ల కవితా సంపుటిని ఆవిష్కరిస్తున్న వీసీ శ్రీనివాసరావు, వర్సిటీ అధికారులు, కవి రామకృష్ణ



దేవుడా... నాకీ బతుకెందుకు!?

- తొందరగా నీ దగ్గరకు తీసుకెళ్లు.. ● పెన్నాలో కదల్లేని స్థితిలో వృద్ధురాలు
- నెల్లూరు జంట హత్యల్లో భర్త ● ఇంకా వస్తాడని కళ్లు కాయలుకాచేలా ఎదురుచూపు

'దేవుడా... నేనేమి పాపం చేశాను... నాకెందుకు ఇలాంటి బతుకునిచ్చావు....ఇకచాలు స్వామీ... నన్ను తొందరగా నీ దగ్గరకు తీసుకెళ్లు'... అంటూ ఓ వృద్ధురాలు కన్నీరుమున్నీరవుతోంది. ఓ పక్క అనారోగ్యంతో పైకి లేవలేని పరిస్థితి. మరో పక్క ఒళ్లంతా ఈగలు వాలడంతో ఆమె నరకాన్ని చూస్తోంది.

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): నెల్లూరు నగరంలోని పెన్నా బ్యారేజీకి సమీపంలోని శివాలయం ఎదురుగా ప్లాస్టిక్ గోతాలతో కట్టుకున్న చిన్న గుడిసెలో ఒంగోలు ప్రాంతానికి చెందిన లక్ష్మి అనే వృద్ధురాలు నివాసం ఉంటోంది. ఆమెను పదేళ్ల కిందట బాపట్ల ప్రాంతానికి చెందిన పోలయ్య రెండో వివాహం చేసుకున్నాడు. కొద్ది రోజులు ఒంగోలులో కాపురం పెట్టారు. ఐదేళ్ల కిందట వారు నెల్లూరుకు వచ్చారు. రైల్వేస్టేషన్, బస్టాండ్లు, రోడ్డు పక్కగా ఉంటూ చివరికి పెన్నా బ్యారేజీ దగ్గర్లో ఉన్న శివాలయం ఎదురుగా చిన్న టెంటులో కాపురం పెట్టారు. ఇద్దరూ ప్లాస్టిక్ సీసాలు వేరుకుంటూ, ఎవరైనా పనులు చెబితే చేస్తూ జీవించేవారు.

● లేవలేని స్థితిలో...

ఆ చిన్నగుడిసెలో ఎముకల గూడుగా లక్ష్మి కనిపిస్తోంది. ఆమె చేతికి అరుదైన వ్యాధి సోకగా, బాధపడుతోంది. అంతేకాక ఆరు నెలలుగా ఇతర రుగ్మతలు కూడా ఆమె బాధిస్తున్నాయి. ఆమె పరిస్థితిని చూసి ఎవరైనా భోజనం తీసుకువచ్చినా, తినలేని పరిస్థితి. పగటి పూట ఒంటిని కమ్మేస్తున్న ఈగలు.. రాత్రిపూట ఒంట్లో రక్తం లేకపోయినా చర్మాన్ని పీకేస్తున్న దోమలు. ఎండకు ఎండుతూ వానకు తడుస్తూ జీవచ్ఛవంగా ఆమె ఉంది.

● జంట హత్యల్లో భర్త మృతి

ఈ నెల 6న అర్ధరాత్రి రంగనాయకులపేటలో జరిగిన జంట హత్యల్లో లక్ష్మి భర్త పోలయ్య మృతి చెందాడు. అయితే, ఈ విషయం ఆమెకు ఇప్పటికీ తెలియదు. తన భర్త బయటకు వెళ్లి 3 రోజులు అవుతోందని, ఇంకా రాలేదని కన్నీరు పెట్టుకుంటోంది. పోలయ్య హత్యకు గల కారణాలు తెలియక పోయినా.. ఆయన్నే నమ్ముకొని లక్ష్మి జీవిస్తున్నది. హత్యకు గురైన ప్రాంతంలో రక్తపు మరకలను వర్షపు చినుకులు తుడిపేసినా.. నేడో రేపో హంతకులు జైలుకు వెళ్లినా.. లక్ష్మికి మాత్రం ఎవరూ న్యాయం చేయలేరు. అందకేనేమో ఆమె దేవుడి దగ్గరకు వెళ్లాలని ఎదురుచూస్తున్నది.

అబ్దుల్‌కలాం వేసిన బీజం వల్లే ఆపరేషన్ సిందూర్ విజయవంతం

రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు డాక్టర్ సతీష్‌రెడ్డి



సభలో మాట్లాడుతున్న సతీష్‌రెడ్డి

నెల్లూరు(సిటీ), అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి):నాడు అబ్దుల్‌కలాం వేసిన బీజం వల్లే నేడు ఆపరేషన్ సిందూర్ ఘన విజయం సాధించిందని ఏపీ ప్రభుత్వ సలహాదారు, డీఆర్డీవో మాజీ చైర్మన్ డాక్టర్ జీ సతీష్‌రెడ్డి తెలిపారు. బుధవారం నగరంలోని కస్తూర్బా కళాక్షేత్రంలో మున్సిపల్ పాఠశాలలోని పదోతరగతి విద్యార్థులకు శాస్త్ర, సాంకేతిక పురోగాభివృద్ధిపై ఆయన అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రామేశ్వరంలోని చిన్న ప్రభుత్వ పాఠశాలలో చదువుకున్న అబ్దుల్‌కలాం రాష్ట్రపతిగా ఎదగడానికి చదువే కారణమన్నారు. నాటికీ, నేటికీ ఆయన అందరికీ ఆదర్శప్రాయుడని కొనియాడారు. ఆయన వేసిన బీజం వల్లే ఆపరేషన్ సిందూర్ విజయవంతమైందని తెలిపారు. స్వదేశీ ఆలోచనలతో రూపొందించిన ఆత్మనిర్భర్ భారత్ ద్వారా యుద్ధాల్లో భారత్ గొప్ప విజయం సాధించిందన్నారు. రష్యాతో కలిసి తయారు చేసిన బ్రహ్మోస్ క్షిపణిలో భారత్ సాంకేతికత ఉందన్నారు. దీన్ని ఉపయోగించి పాక్‌పై తిరుగులేని విజయం సాధించామని అన్నారు. భారత్‌లో క్షిపణులకు నాంది పలికింది అబ్దుల్‌కలామ్‌మేనని గుర్తు చేశారు. ఆయన జయంతిని ఈ నెల 15న ఘనంగా నిర్వహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎంసీ కమిషనర్ నందన్, డీఈవో బాలాజీరావు, డిప్యూటీ డైరెక్టర్ మాధురి పాల్గొన్నారు.

సమ్మెలో వైద్యులు.. ఇబ్బందుల్లో రోగులు

● పీహెచ్‌సీల్లో నర్సులే దిక్కు



డీఎంహెచ్‌వో కార్యాలయం వద్ద సమ్మె చేస్తున్న వైద్యులు

వైద్యుల సమ్మెతో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో(పీహెచ్‌సీల్లో) రోగులకు వైద్య చికిత్సలు అందటం లేదు. నర్సులే చిన్నచిన్న వ్యాధులకు మందులిస్తున్నారు. ఈ నెల 3 నుంచి పీహెచ్‌సీల్లో వైద్యులు ఆందోళన చేస్తుండటంతో ఆయా ఆసుపత్రులకు వచ్చే రోగులు దూరంగా ఉన్న సామాజిక ఆరోగ్య కేంద్రాలకు పరుగులు తీస్తున్నారు.

నెల్లూరు (వైద్యం), అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): ప్రతినెలా 9న పీహెచ్‌సీల్లో జరిగే ప్రధాన మంత్రి మాతృత్వ వందన యోజన కార్యక్రమం ద్వారా గర్భిణులకు అందించాల్సి ప్రత్యేక వైద్య సేవలు వైద్యులు నిలిచిపోనున్నాయి. అలాగే ప్రతి బుధ, శనివారాల్లో జరిగే వ్యాధి నిరోధక టీకాల పర్యవేక్షణ కూడా ఆగిపోయింది. కుటుంబ ఆరోగ్య కార్యక్రమం కింద ప్రతిరోజూ 104 అంబులెన్స్ ద్వారా గ్రామీణులకు సేవలు అందించే కార్యక్రమం కూడా ఆగింది. అలాగే ప్రతి గురువారం ప్రభుత్వం పాఠశాలల్లో నిర్వహించే విద్యార్థుల ఆరోగ్య పరీక్షలు కూడా ఆగిపోయాయి. ప్రతి ఆఖరి శనివారం ప్రభుత్వ సంక్షేమ హాస్టల్‌లలో పరీక్షలు చేయాల్సిన విద్యార్థుల ఆరోగ్య పరీక్షలకు ఆటంకాలు ఏర్పడ్డాయి. దీంతో పాటు ప్రతి రోజూ 30 నుంచి 50 మంది వరకు పీహెచ్‌సీలకు వచ్చే వ్యాధి గ్రస్థుల రిపోర్టులను వైద్యులు ఉన్నతాధికారులకు పంపించాల్సి ఉంటుంది. ప్రస్తుతం ఈ రిపోర్టులు ఆగాయి.

● డిమాండ్లు ఇవే...

పీహెచ్‌సీ వైద్యుల పీజీ సీట్ల కోటాను గతంలో ఉన్న 30శాతాన్ని గత వైసీపీ ప్రభుత్వం 15 శాతాన్ని తగ్గించింది. అయితే దాన్ని 20 శాతానికి పెంచాలని, మూడేళ్ల పాటు ఈ పీజీ సీట్లు కొనసాగించాలని వైద్యులు డిమాండ్ చేస్తున్నారు. ఈ ఏడాదే అమలు చేస్తామని ప్రభుత్వం వాగ్దానం చేసింది. అలా కుదరదని వైద్యులు సమ్మె కొనసాగిస్తున్నారు. అలాగే 20 నుంచి 25 ఏళ్లుగా వైద్యులకు ఉద్యోగోన్నతి లేకుండా వైద్యాధికారులుగానే ఉద్యోగ విరమణ చేస్తున్నారు. వైద్యులకు టైంబౌండ్ ఉద్యోగోన్నతులు కల్పించాలని డిమాండ్ చేస్తున్నారు. ప్రతి నియోజక వర్గానికి ఓ సివిల్ సర్జన్, ప్రతి నాలుగు పీహెచ్‌సీలకు ఒక డిప్యూటి సివిల్ సర్జన్ లేదంటే డిప్యూటీ డీఎంహెచ్‌వోలుగా ఉద్యోగోన్నతులు కల్పించాలని కోరుతున్నారు. జీవో నెంబర్ 99ను రద్దు చేయాలని, చంద్రన్న సంచార క్లినిక్‌లకు రూ. 5వేల భత్యం కల్పించాలన్నారు. గిరిజన ప్రాంతాలలో పనిచేస్తున్న వైద్యులకు 50 శాతం మూలవేతనంతో పాటు నోషనల్ ఇంక్రిమెంట్‌లు అందించాలని వైద్యులు డిమాండ్ చేస్తున్నారు.

సమస్యలు పరిష్కరించే వరకు సమ్మెలోనే...

ప్రభుత్వం తమ డిమాండ్లను సానుకూలంగా పరిష్కరించాలి. ప్రస్తుతం తమ సంఘంతో ప్రభుత్వం జరుపుతున్న చర్చలు సానుకూలంగా సాగడం లేదు. త్వరలో ప్రభుత్వం నుంచి సానుకూల స్పందన వస్తుందని భావిస్తున్నాం. మా సమస్యలు పరిష్కరించే వరకు సమ్మె కొనసాగిస్తాం.

\- డాక్టర్ అమరేంద్రనాథ్‌రెడ్డి, పీహెచ్‌సీల వైద్యుల సంఘం జిల్లా అధ్యక్షుడు

తాత్కాలికంగా సామాజిక వైద్యుల సేవలు

పీహెచ్‌సీల్లో వైద్యులు సమ్మెలో ఉండటంతో తాత్కాలికంగా సీహెచ్‌సీల వైద్యులు రోగులకు వైద్య సేవలు అందించేలా చర్యలు తీసుకుంటున్నాం. ప్రతిరోజూ వైద్యులు హాజరు లేని విషయం కూడా సమాచారం అందుతుంది. వైద్యుల సమ్మెను ప్రభుత్వం త్వరలోనే విరమింప చేసి, పీహెచ్‌సీల్లో వైద్య చికిత్సలు అందేలా చర్యలు తీసుకోవాలి.

\- డీఎంహెచ్‌వో డాక్టర్ సుజాత

వారి కోసమే 'ఆటోడ్రైవర్ల సేవలో..'

- ఇచ్చిన హామీలన్నీ నెరవేరుస్తున్న సీఎం
- ఆటోల ర్యాలీలో ఎంపీ వేమిరెడ్డి, ఎమ్మెల్యే ప్రశాంతి



ర్యాలీలో ఆటోలో ఉన్న ఎంపీ వేమిరెడ్డి, ఎమ్మెల్యే ప్రశాంతి, నగర పంచాయతీ చైర్‌పర్సన్ సుప్రజ

బుచ్చిరెడ్డిపాళెం, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి) : స్త్రీశక్తి పథకం వల్ల ఆటో డ్రైవర్లు ఇబ్బంది పడకూడదనే ఆలోచనతోనే ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు 'ఆటో డ్రైవర్ల సేవలో' పథకాన్ని ప్రవేశపెట్టారని నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి చెప్పారు. బుధవారం బుచ్చిరెడ్డిపాళెంలోని టోల్‌గేట్ వద్ద నుంచి సెయింట్‌మేరి కాలేజీ సమీపంలోని ఓలే అవుట్ వరకు సుమారు 500 ఆటోలతో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో వారు మాట్లాడుతూ రాష్ట్రం ఇబ్బందుల్లో ఉన్నా రాష్ట్రవ్యాప్తంగా రూ. 435 కోట్లు ఆటో డ్రైవర్ల ఖాతాలకు జమచేసిన ఘనత సీఎం చంద్రబాబుకే దక్కుతుందన్నారు. నగదు జమకాని వారికి కూడా త్వరలో జమ అవుతుందని అన్నారు. ఎన్నికలకు ముందు ఇచ్చి హామీలకు మించి కూటమి ప్రభుత్వం సంక్షేమ, అభివృద్ధి పథకాలు అక్షరాలా అమలు చేసి చూపిస్తోందని స్పష్టం చేశారు. బుచ్చి ఊటుకూరు రోడ్డు మరమ్మతులకు సీఎం రూ.8 కోట్లు మంజూరు చేశాని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ పక్కా గృహాలు మంజూరు చేయిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో నగర పంచాయతీ చైర్‌పర్సన్ మోర్ల సుప్రజ, వవ్వేరు, బుచ్చి బ్యాంకుల చైర్మన్లు విజయలక్ష్మి, శివకరామకృష్ణారెడ్డి, వైస్ చైర్మన్లు, కౌన్సిలర్లు, ఐదు మండలాల టీడీపీ అధ్యక్షులు, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రేపు ఎస్‌జీఎఫ్ ఫుట్‌బాల్ జట్ల ఎంపిక

నెల్లూరు(వ్యవసాయం), అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్-17 బాలబాలికల ఫుట్‌బాల్ క్రీడా జట్ల ఎంపికలు శుక్రవారం నెల్లూరు ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో జరుగుతాయని జిల్లా విద్యాశాఖాధికారి బాలాజీరావు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 9 గంటలకు పోటీలు, ఎంపికలు జరుగుతాయని, ఆసక్తి కలిగిన ప్రభుత్వ, ప్రైవేటు, ఎయిడెడ్ పాఠశాలల క్రీడాకారులు ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేయించుకుని సంబంధిత పత్రాలతో హాజరుకావాలని సూచించారు. పూర్తి వివరాలకు క్రీడా సమాఖ్య కార్యదర్శులు బీవీ రమణయ్య(9490320435), ఎం దేవిక(9492936165)ను సం ప్రదించాలని కోరారు.

డీసీపల్లిలో పొగాకు ధరలు

మర్రిపాడు, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి) : డీసీపల్లి పొగాకు వేలం కేంద్రానికి బుధవారం రైతులు 914 బేళ్లను తీసుకొనిరాగా 20 కంపెనీల ప్రతినిధులు వేలంలో పాల్గొని 654 బేళ్లను కొనుగోలు చేశారు. వివిధ కారణాలతో 260 బేళ్లను తిరస్కరించారు. కేజీ గరిష్ఠ ధర రూ. 315 కాగా, కనిష్ఠ ధర రూ. 70 పలికినట్లు వేలం నిర్వహణాధికారి జి రాజశేఖర్ తెలిపారు.

ఖతర్‌లో నర్సులుగా ఉద్యోగావకాశాలు

నెల్లూరు(హరనాథపురం), అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి) : బీఎస్సీ, జీఎన్ఎం నర్సింగ్ అభ్యర్థులకు ఖతర్ దేశ రాజధాని దోహాలో హోంకేర్ నర్సులుగా ఉద్యోగావకాశాలు ఉన్నాయని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మైనార్టీస్ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ షేక్ హైఫా ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అర్హత కలిగిన మైనార్టీ అభ్యర్థులు ఆన్‌లైన్‌లో వివరాలు నమోదు చేసి, ఆ దరఖాస్తును ఈనెల 12లోగా నెల్లూరులోని కిమ్స్ ఆసుపత్రి సమీపంలో ఉన్న తమ కార్యాలయంలో అందించాలని తెలిపారు. ఇతర వివరాలకు 9849901154 నంబరును సంప్రదించాలని కోరారు.

పాడిరైతుల ఆదాయాభివృద్ధికి కృషి

● పశుసంవర్ధక శాఖ జేడీ రమేష్ నాయక్

నెల్లూరు(వ్యవసాయం), అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): పాడిరైతుల ఆదాయాభివృద్ధికి ప్రతీ ఒక్కరూ కృషి చేయాలని పశుసంవర్ధకశాఖ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ కే రమేష్‌నాయక్ పిలుపునిచ్చారు. పశుసంవర్ధకశాఖ జిల్లా కార్యాలయ ప్రాంగణంలోని సమావేశ మందిరంలో బుధవారం పాఠ్య ప్రణాళిక వర్క్ ఎక్స్‌పీరియన్స్ ప్రోగ్రాము విజయవంతంగా పూర్తిచేసుకున్న పాలిటెక్నిక్ విద్యార్థుల వీడ్కోలు కార్యక్రమం జరిగింది. ముఖ్యఅతిథిగా జేడీ పాల్గొని మాట్లాడారు. శిక్షణ కాలంలో విద్యార్థులు పశువుల ప్రాథమిక వైద్యం, క్లీనికల్ పరీక్షలు, వ్యాధి నివారణ టీకాలు, శస్త్రచికిత్సలలో సహాయం చేయడం, పశువుల పోషణ, సంరక్షణ వంటి పలు అంశాలపై అవగాహన పెంపొందించుకున్నారని చెప్పారు. భవిష్యత్తులో మరింత ప్రగతిని సాధించాలని ఆకాంక్షించారు. విద్యార్థులకు శిక్షణ ధ్రువీకరణ పత్రాలు అందించారు. ఈ కార్యక్రమంలో పశుసంవర్ధకశాఖ డీడీ డాక్టర్ టీ సోమయ్య, ఏడీ మాలకొండయ్య పాల్గొన్నారు.

ఎండ... వాన !

● 8.2 మి.మీ. వర్షపాతం నమోదు



పిడుగుపడి మృతి చెందిన గేదెలు

నెల్లూరు(హరనాథపురం), అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఎండ, వాన దోబూచులాడుతున్నాయి. ఉదయం నుంచి ఎండ తీవ్రంగా ఉంటుండగా మధ్యాహ్నానికి ఆకాశం మేఘావృతమై వాతావరణం చల్లబడుతోంది. ఆ తర్వాత వర్షం కురుస్తోంది. మళ్లీ కాపేసటికి ఎండ కనిపిస్తోంది. రెండు రోజులుగా ఇదే పరిస్థితి. మంగళవారం నాటి కుండపోత వర్షంతో వాతావరణ చల్లబడగా బుధవారం మధ్యాహ్నం వరకు ఎండకాసింది. బుధవారం సాయంత్రం మళ్లీ వర్షం పడింది. వాన కురవడంతో రహదారులపైకి నీరు చేరింది. నెల్లూరు నగరంలోని ట్రంకురోడ్డు, బారకాసు, వేదాయపాళెం, రాయాజీ వీధి ప్రాంతాల్లో రోడ్లపై వర్షపు నీరు నిలవడంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. జిల్లా వ్యాప్తంగా బుధవారం 8.2 మి.మీ.ల సగటు వర్షపాతం నమోదైంది. అత్యధికంగా కొండాపురంలో 53.4 మి.మీ. వర్షం కురవగా అత్యల్పంగా పొదలకూరులో ఒక మి.మీ. వర్షం పడింది. నెల్లూరు అర్బన్‌లో 36.2, నెల్లూరు రూరల్‌లో 9.8 మి.మీ. వర్షపాతం నమోదైంది.

పిడుగుపడి రెండు గేదెలు మృతి

జలదంకి, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని చామదలలో బుధవారం మధ్యాహ్నం పెద్దపెద్ద శబ్దాలతో ఉరుములు మెరుపులతో భారీ వర్షం కురిసింది. ఈ ఉరుములు, మెరుపులకు ఆదిరెడ్డిపాలెంలో పిడుగుపడి మునగాల వీరరాఘవరెడ్డికి చెందిన రెండు గేదెలు మృతి చెందాయి. మధ్యాహ్నం ఒక్కసారిగా వాతావరణంలో మార్పులు వచ్చి భారీ శబ్దాలతో వీరరాఘవరెడ్డి పశువుల దొడ్డిలో పిడుగులు పడ్డాయి. దీంతో రెండు గేదెలు మృతి చెందాయి. ఈ ప్రమాదంలో బాధిత రైతుకు రూ.80 వేలు నష్టం జరిగిందని బాధితుడు తెలిపారు.

ప్రతీ ఇంటికి జీఎస్టీ 2.0 ఫలాలు అందాలి

● అవగాహన సదస్సులో ఎంపీ వేమిరెడ్డి



సదస్సులో జీఎస్టీ కరపత్రాలను విడుదల చేస్తున్న ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, తదితరులు

నెల్లూరు(హరనాథపురం), అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి) : ప్రతీ ఇంటికి జీఎస్టీ 2.0 ఫలాలు అందాలని నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి అన్నారు. బుధవారం నగరంలోని పీఎస్ఆర్ కల్యాణ మండపంలో జిల్లా సేల్స్ టాక్స్ బార్ ఆసోసియేషన్ ఆధ్వర్యంలో జీఎస్టీపై అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ కేంద్రప్రభుత్వం చేపట్టిన జీఎస్టీ 2.0 సంస్కరణలు దేశాభివృద్ధికి బాటలు వేస్తాయని చెప్పారు. జీఎస్టీ సంస్కరణలతో ప్రతి ఇంట్లో దీపావళి కాంతులు వెల్లివిరుస్తున్నాయని పేర్కొన్నారు. ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు ఆదేశాలతో జీఎస్టీపై ప్రచారం చేయటం ఎంతో సంతోషంగా ఉందన్నారు. కేంద్ర ప్రభుత్వం పేద, మధ్య తరగతి ప్రజలకు ఊరట కలిగించేలా జీఎస్టీ సంస్కరణలు చేపట్టిందన్నారు. జీఎస్టీ 2.0పై ప్రజలంతా అవగాహన పెంచుకోవాలన్నారు. ప్రతి ఒక్కరూ హెల్త్ ఇన్సూరెన్స్ తీసుకోవాలని కోరారు. వాణిజ్య పన్నులశాఖ జాయింట్ కమిషనర్ కిరణ్‌కుమార్ మాట్లాడుతూ జీఎస్టీ 2.0పై ఇప్పటికే క్షేత్రస్థాయిలో అవగాహనా కార్యక్రమాలు నిర్వహించామని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వ సూచనల మేరకు దశల వారీగా కార్యక్రమాలు అమలు చేస్తున్నామన్నారు. తమశాఖ తరఫున ధరల బోర్డులను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ఈ సదస్సులో జీఎస్టీ అవగాహన కరపత్రాలను ఎంపీ వేమిరెడ్డితో కలిసి, అధికారులు విడుదల చేశారు. కార్యక్రమంలో జిల్లా సేల్స్‌టాక్స్ బార్ అసోసియేషన్ కార్యదర్శి వెంకటేష్, కార్యక్రమ కన్వీనర్ కృష్ణమోహన్, మదీనా వాచ్ కంపెనీ అధినేత ఇంతియాజ్, ఏసీసీ రాష్ట్ర అధ్యక్షుడు రంగయ్యనాయుడు, నాయకులు కేతంరెడ్డి వినోద్‌రెడ్డి, గుడి హరిరెడ్డి, వ్యాపారవేత్తలు తదితరులు పాల్గొన్నారు.

కాలుష్యాన్ని నియంత్రించాలి

● సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సోమిరెడ్డి, వేదికపై కలెక్టర్ హిమాన్షు శుక్లా, ఏపీపీసీబీ చైర్మన్ కృష్ణయ్య, వీసీ అల్లం శ్రీనివాసరావు తదితరులు

వెంకటాచలం, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): వస్తు తయారీలో ప్రమాణాలు పాటించడమే కాదు.. కాలుష్యాన్ని కూడా నియంత్రించాల్సిన అవసరం ఉందని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి అన్నారు. బుధవారం స్థానిక వీఎస్‌యూలో ప్రపంచ ప్రమాణాల దినోత్సవం సందర్భంగా బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్, ఎఫ్ఎస్ఎంఈ ఆధ్వర్యంలో జరిగిన స్టాండర్డ్స్ కాన్ క్లేవ్‌లో ఆయన పాల్గొన్నారు. జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లాతో కలిసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఏ వస్తువు అయినా వినియోగదారులకు నాణ్యతతో అందించాలన్నారు. ప్రమాణాలు తగ్గితే టీడీపీ ప్రభుత్వం చూస్తూ ఊరుకోదన్నారు. నకిలీ మద్యం విషయం వెలుగులోకి వచ్చిన వెంటనే ప్రభుత్వం వేగంగా స్పందించిందన్నారు. ఆ స్కామ్‌తో సంబంధం ఉన్న టీడీపీ నేతలను కూడా పార్టీ నుంచి సస్పెండ్ చేసేశారన్నారు. నిందితులను అరెస్ట్ చేయడమే కాకుండా కఠిన చర్యలు ఉండేలా ఆదేశాలు ఇచ్చారన్నారు. ఇలాంటి స్పందన వైసీపీ ఐదేళ్ల పాలనలో ఎప్పుడూ చూడలేదన్నారు. పరిశ్రమలు పెద్దసంఖ్యలో ఏర్పాటవుతున్నాయని, ప్రధానంగా పేదలు, గిరిజనులు ఎక్కువగా కాలుష్యం బారిన పడుతున్నారని, కాలుష్యం పెరగకుండా చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత కూడా ఉందన్నారు. కార్యక్రమంలో కలెక్టర్ హిమాన్షు శుక్లా, ఏపీపీసీబీ చైర్మన్ పీ కృష్ణయ్య, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి కే పరశురామయ్య, వీఎస్‌యూ వీసీ ప్రొఫెసర్ అల్లం శ్రీనివాసరావు, బీఐఎస్ జాయింట్ డైరెక్టర్ కళ్లే సాయికౌశిక్, ఎఫ్ఎస్ఎంఈ జాతీయ అధ్యక్షుడు ఏ.పీ.కే రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హత్యాయత్నం కేసులో ముగ్గురి అరెస్ట్

నెల్లూరు రూరల్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి) : పొట్టేపాళెం కలుజు వద్ద ఓ వ్యక్తి హత్యకు యత్నించిన కేసులో ముగ్గురు వ్యక్తులను బుధవారం అరెస్ట్ చేసినట్లు రూరల్ సీఐ వేణు తెలిపారు. పాతకక్షల నేపథ్యంలో మంగళవారం మాణికల మణిపై కత్తితో దాడి చేసి హత్యాయత్నానికి పాల్పడిన సోమశిలకు చెందిన సూర్య, మరో ఇద్దరు మైనర్లను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశామని పేర్కొన్నారు. నిందితులను కోర్టులో హజరుపరిచినట్లు ఆయన తెలిపారు.

వ్యర్థాలతో సంపద తయారు చేయాలి

ఔత్సాహిక పారిశ్రామికవేత్తలతో కలెక్టర్ హిమాన్షు శుక్లా





సదస్సులో మాట్లాడుతున్న కలెక్టర్ హిమాన్షు శుక్లా, పాల్గొన్న వివిధ శాఖల అధికారులు,

నెల్లూరు(వెంకటేశ్వరపురం), అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి) : వ్యర్థాలను విలువైన సంపదగా మార్చేందుకు జిల్లాలో రీసైక్లింగ్ యునిట్ల ఏర్పాటుకు ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు ముందుకు రావాలని కలెక్టర్ హిమాన్షు శుక్ల పిలుపునిచ్చారు. బుధవారం కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో ఆంధ్రప్రదేశ్ సర్క్యులర్ ఎకానమీ, వేస్ట్ రీసైక్లింగ్ పాలసీ 4.0పై పారిశ్రామిక వేత్తలతో జిల్లా పరిశ్రమలశాఖ, పర్యావరణ నియంత్రణ మండలి ఆధ్వర్యంలో సదస్సు నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రతీ రోజూ 350 టన్నుల తడి, పొడి వ్యర్థాలను నెల్లూరు నగరపాలక సంస్థ సేకరిస్తోందని, ఈ వ్యర్థాలను రీసైక్లింగ్ ప్లాంట్ల ద్వారా విలువైన సంపదగా మార్చవచ్చన్నారు. ఆ యూనిట్ల ఏర్పాటుకు ముందుకు వచ్చిన వారికి ప్రభుత్వపరంగా అన్నీ సబ్సిడీలు, రాయితీలు కల్పిస్తామన్నారు. ఏపీ కాలుష్య నియంత్రణ మండలి రాష్ట్ర చైర్మన్ డాక్టర్. పీ కృష్ణయ్య మాట్లాడుతూ స్వచ్ఛాంధ్రప్రదేశ్ లక్ష్యంగా ప్రభుత్వం పర్యావరణ పరిరక్షణకు పెద్దపీట వేస్తోందని చెప్పారు. వేస్ట్ రీసైక్లింగ్ ప్లాంట్ల ఏర్పాటుకు సహకరిస్తుందన్నారు. రాష్ట్రంలో పేరుకుపోయిన దాదాపు 85 లక్షల టన్నుల చెత్తను తొలగిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పరిశ్రమలశాఖ జీఎం మారుతీ ప్రసాద్, ఏపీఐఐసీ జెడ్ఎం శివకుమార్, మున్సిపల్ కమిషనర్ నందన్, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఈఈ అశోక్‌కుమార్ పాల్గొన్నారు.

ఆత్మకూరు
ఉదయగిరి

రేపు మండల సర్వసభ్య సమావేశం

సీతారామపురం, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఉదయం మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఇన్‌చార్జ్ ఎంపీడీవో చంద్రశేఖర్ బుధవారం తెలిపారు. ఎంపీపీ చింతంరెడ్డి పద్మావతి అధ్యక్షతన జరిగే ఈ సమావేశంలో తాగునీరు, విద్య, వైద్యం, వ్యవసాయం, ఉపాధిహామీ పథకం, పంచాయతీరాజ్, గృహనిర్మాణ శాఖలపై సమీక్ష నిర్వహించనున్నట్లు అయన తెలిపారు. మండలంలోని అన్ని శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరుకావాలని కోరారు.

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)	
ఒక గ్రాము ధర	రూ. 11672
వెండి కిలో ధర	రూ. 156600
వెండి ఒక గ్రాము	రూ. 160.60

సమస్యల వలయంలో సర్కారు బడులు

- విద్యార్థుల అవస్థలు
- పట్టించుకోని అధికారులు



యర్రంరెడ్డిపల్లిలో విద్యార్థులు లేక తలుపులు తెరుచుకొని పాఠశాల

ఉదయగిరి రూరల్, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రానికి శివారు మెట్ట ప్రాంతమైన వరికుంటపాడు మండలంలో సర్కారు బడులు ఏళ్ల తరబడి సమస్యల వలయంలో సాగుతున్నాయి. మండలంలో మొత్తం 47 ప్రాథమిక, 3 ప్రాథమికోన్నత, 8 ఉన్నత పాఠశాలల పరిధిలో 2257మంది విద్యార్థులు అరకొర వసతుల నడుమ విద్యాభ్యాసం సాగిస్తున్నారు. కాంచెరువు, సాతువారిపల్లి, గువ్వాడి ఎస్సీ కాలనీ, జంగంరెడ్డిపల్లి, వరికుంటపాడు పాఠశాలలకు సరిపడా తరగతి గదులు, ప్రహరీ, వంట గదులు వంటి సమస్యలు వెంటాడుతున్నాయి. దీంతో చేసేదేమిలేక ఆరు బయట వరండాలు, అసంపూర్తి భవనాల్లోనే తరగతులు నిర్వహించాల్సిన దుస్థితి నెలకొంది. దీంతో ప్రతినిత్యం విద్యార్థులు దుమ్ము, ధూళితో నిండిపోవడంతో పాటు మధ్యాహ్న భోజనం తినే సమయంలోను తిప్పలు తప్పడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆంధ్రావారిపల్లి, గువ్వాడి ఎస్సీ కాలనీ పాఠశాలల్లో ఉన్న ఒక్కగానొక్క ఇరుకు గదిలో విద్యాబోధన చేయడం ఉపాధ్యాయులకు తలకు మించిన భారంగా మారుతోంది. అందులోనూ బెంచీలను సైతం సరఫరా చేయకపోవడంతో నేలపైనే బోధన సాగుతుండడం విశేషం. వంట గదులు సైతం లేకపోవడంతో నిర్వాహకులు నివాసాల నుంచి వంటలను పాఠశాలలకు తరలించాల్సి వస్తోంది. పలు పాఠశాలల్లో మరుగుదొడ్ల వసతి కూడా పూర్తిస్థాయిలో లేకపోవడంతో విద్యార్థులకు తిప్పలు తప్పడంలేదు. కాంచెరువు, గువ్వాడి, వరికుంటపాడు, గువ్వాడి ఎస్సీ కాలనీ ప్రాథమిక పాఠశాలలకు మంజూరైన అదనపు తరగతి, వంట గదులు ఏళ్లతరబడి అసంపూర్తిగా నిలిచి వెక్కిరిస్తున్నాయి. ఇలాంటి పరిస్థితుల నేపథ్యంలో అధిక శాతం మంది విద్యార్థులు ప్రైవేటు పాఠశాలలకు పరుగులు తీస్తుండడంతో భవిష్యత్తులో పలు గ్రామాలలో పాఠశాలలు మూతపడే పరిస్థితి నెలకొంది.

తలుపులు తెరుచుకోని పాఠశాలలు

యర్రంరెడ్డిపల్లి, బ్రాహ్మణపల్లి ప్రాథమిక పాఠశాలల్లో ఈ ఏడాది విద్యార్థులు ఎవరూ చేరకపోవడంతో తలుపులు తీసే పరిస్థితి లేదు. రికార్డుల్లో ఉన్నప్పటికీ అక్కడి ఉపాధ్యాయులను మాత్రం ఇతర పాఠశాలలకు తరలించడం జరిగింది. అలాగే నల్లబోతులవారిపల్లి, విరువూరు ఎస్సీ కాలనీల్లో ఒక్కో విద్యార్థి మాత్రమే ఉండడంతో అక్కడ కూడా అలాంటి పరిస్థితే దాపురించింది. వీటికి తోడు ఆంధ్రావారిపల్లి, దక్కనూరు, హుస్సేన్‌నగర్, జడదేవి, జంగంరెడ్డిపల్లి, సౌత్ కృష్ణంరాజుపల్లి, నార్త్‌కొండాయపాళెం, మహమ్మదాపురం, నారసింహాపురం, పాపన్నగారిపల్లి, పెద్దిరెడ్డిపల్లి, తూర్పురొంపిదొడ్ల, తిమ్మారెడ్డిపల్లి ఎస్సీ, రామాపురం బీసీ, సాతువారిపల్లి, తొడుగుపల్లి, తూర్పుపాళెం పాఠశాలల్లో కేవలం పది మంది లోపే విద్యార్థులు ఉండడం విశేషం. భవిష్యత్తులో ఆ పాఠశాలలు కూడా మూత పడే అవకాశాలు ఉన్నాయి.

ఆకతాయిలు, మందుబాబులకు అడ్డాగా ప్రహరీ లేని పాఠశాలలు

ప్రహరీలేని పాఠశాలలు ఆకతాయిలు, మందుబాబులకు అడ్డాగా మారుతున్నాయి. పాఠశాల సమయం ముగిసిన తరువాత, సెలవుల్లో ఆకతాయిలు, సంచార వాసులతో పాటు పశువులు, మూగ జీవాలు మకాం వేస్తుండడంతో ప్రాంగణమంతా అపరిశుభ్రంగా మారుతోంది. ఏపుగా కంపచెట్లు కమ్ముకు పోవడంతో విష పురుగుల సంచారంతో సిబ్బంది, విద్యార్థులు భయందోళనకు గురవుతున్నారు. మందుబాబులు ఖాళీ మద్యం సీసాలు, ఇతర వ్యర్థాలను అక్కడే వదిలేస్తున్నారు. వీటికి తోడు మరికొంతమంది అసాంఘిక కార్యక్రమాలు సాగిస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ప్రభుత్వ పాఠశాలల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని విద్యార్థులు, తల్లిదండ్రులు కోరుతున్నారు.

న్యూస్ బాక్స్

జీఎస్టీపై అవగాహన



జీఎస్టీపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న అధ్యాపకులు

ఆత్మకూరు, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): స్థానిక డాక్టర్ ఎస్ఆర్‌జె డిగ్రీ కళాశాలలో బుధవారం జీఎస్టీపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ జి వర కుమారి, వైస్‌ప్రిన్సిపాల్ డాక్టర్ టి శ్రీనివాసులరెడ్డి మాట్లాడుతూ ప్రస్తుతం అమలులో ఉన్న జీఎస్టీలోని వివిధ అంశా లను వివరించారు. విద్యార్థులు మేకిన్ ఇండియా, డిజిటల్ ఇండియా, వికసిత్ భారత్, స్వర్ణాంధ్ర విజన్-2047 తదితర అంశాలపై అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. జీఎస్టీ వలన కలిగే ప్రయోజనాలను ఎకనామిక్ లెక్చరర్ అంకమ్మ విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కళాశాల లెక్చరర్లు డాక్టర్ ప్రసాద్, రేణుక, వెంకటరవి, విజయ కుమారి పాల్గొన్నారు.

ఆటల పోటీలు ప్రారంభం



ఖోఖో ఆడుతున్న విద్యార్థులు

కలువాయి, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో బుధవారం మండలస్థాయి ఆటల పోటీలు జరిగాయి. మండలంలోని ఐదు ఉన్నత పాఠశాలలు ఉండగా దాచూరు, కలువాయి హైస్కూలు విద్యార్థులు మాత్రమే పాల్గొన్నారు. మిగిలిన కుల్లూరు, వెరుబొట్లపల్లి, చీపినాపి ఉన్నత పాఠశాలల విద్యార్థులు ఈ పోటీలలో పాల్గొనలేదు. కాగా, స్కూల్ గేమ్స్‌ను మొక్కుబడిగా జరపడంపై పలువురు విమర్శిస్తున్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు



డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు చేస్తున్న ఎస్ఐ కోటయ్య, సిబ్బంది

కలువాయి, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): జిల్లా ఎస్పీ అజిత వేజండ్ల ఆదేశాల మేరకు బుధవారం రాత్రి కలువాయిలో డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించారు. ఎస్ఐ కోటయ్య ఆధ్వర్యంలో పోలీసులు వాహనాలు నిలిపి తనిఖీలు చేశారు. మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న పలువురిపై కేసు నమోదు చేశారు. రాత్రి 8గంటల నుంచి 9గంటల వరకు డ్రైవ్ చేపట్టారు. మద్యం తాగి వాహనాలపై రాత్రులు తిరుగుతూ పట్టుబడితే ఇకపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ తెలిపారు.

ఘనంగా కేవీపీఎస్ ఆవిర్భావ దినోత్సవం



కేవీపీఎస్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలో పాల్గొన్న జిల్లా నాయకుడు నాగయ్య

ఆత్మకూరు, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి) : కులవివక్ష పోరాట సమితి (కెవిపిఎస్) ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఆత్మకూరు పట్టణంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. కెవిపిఎస్ జిల్లా నాయకుడు ఆత్మకూరు నాగయ్య ఆధ్వర్యంలో జెండాను ఆవిష్కరించారు. ఈకార్యక్రమంలో సీపీఎం, కెవిపిఎస్ నాయకులు నాగేంద్ర, మహేష్, కాంగ్రెస్ పార్టీ నాయకులు వన్నెం నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

పెళ్లికానుక అందజేత

ఉదయగిరి, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొండాయపాళెం పంచాయతీ వెంకట్రావుపల్లి గ్రామానికి చెందిన దుగ్గినబోయిన శ్రీనివాసులు, సుబ్బమ్మ దంపతుల కుమార్తె శిరీష వివాహం సందర్భంగా ఎమ్మెల్యే కాకర్ల సురేష్ సూచన మేరకు కాకర్ల చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో టీడీపీ నాయకులు బుధవారం కుటుంబ సభ్యులకు రూ.10 వేలు ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు గడ్డం ఓబులరెడ్డి, సత్తెనపల్లి శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

విశ్రాంత వీఆర్వో మృతి

ఏఎస్ పేట, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): అనుమసముద్రం గ్రామానికి చెందిన విశ్రాంత వీఆర్వో రాధాకృష్ణమూర్తి మంగళవారం సాయంత్రం అనారోగ్యంతో మృతి చెందారు. బుధవారం ఆయన అంత్యక్రియలు నిర్వహించారు. పలువురు ఆయన మృతికి సంతాపం వ్యక్తంచేశారు.

ఆత్మకూరు మున్సిపాల్టీకి రాష్ట్రస్థాయి అవార్డు



మున్సిపల్ కమిషనర్ గంగాప్రసాద్‌ను సన్మానిస్తున్న చైర్‌పర్సన్ జి వెంకటరమణమ్మ తదితరులు

ఆత్మకూరు, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో ఆత్మకూరు మున్సిపాల్టీకి రాష్ట్రస్థాయి అవార్డు దక్కడం పట్ల మున్సిపల్ చైర్‌పర్సన్ జి వెంకటరమణమ్మ, టీడీపీ పట్టణ అధ్యక్షుడు తుమ్మల చంద్రారెడ్డి, పలువురు మున్సిపల్ కౌన్సిలర్లు, మున్సిపల్ వర్కర్స్(ఏఐటీయుసి) యూనియన్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. బుధవారం స్థానిక మున్సిపల్ కార్యాయలంలో వారు కమిషనర్ జి గంగాప్రసాద్‌ను సన్మానించారు. ఈ సందర్భంగా వారు ఆత్మకూరు అభివృద్ధికి కృషిచేస్తున్న మంత్రి ఆనం రామనారాయణరెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. వ్యర్థాల నిర్వహణ, రీసైక్లింగ్, ప్రజాఅవగాహన ద్వారా ఆత్మకూరు మున్సిపాల్టీ పురోగతిని సాధించడంలో కమిషనర్ గంగాప్రసాద్ కీలకపాత్ర పోషించారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు పిడికిటి వెంకటేశ్వర్లు నాయుడు, కొప్పోలు చిన్నపురెడ్డి, సాబ్జాన్, పలువురు మున్సిపల్ కౌన్సిలర్లు సూరా భాస్కర్‌రెడ్డి, షేక్ మహబూబ్ బాషా, పొడమేకల పెంచలయ్య, కొప్పోలు రమాదేవి, రాజశేఖర్, శివకోటారెడ్డి, మున్సిపల్ యూనియన్ కార్యదర్శి బెల్లకొండ హజరయ్య, ప్రచార కార్యదర్శి దొమ్మరాజు వాసు, ట్రెజరర్ ఎం చెంచయ్య, నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

తల్లిపాలే బిడ్డకు మొదటి టీకా



కార్యక్రమంలో మాట్లాడుతున్న సూపర్‌వైజర్ కస్తూరి

ఏఎస్ పేట, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): తల్లిపాలు బిడ్డకు మొదటి టీకాగా పనిచేస్తుందని, రోగనిరోధక శక్తి పెరుగుతుందని ఐసిడిఎస్ సూపర్‌వైజర్‌లు కస్తూరి, శ్రీదేవి తెలిపారు. బుధవారం వారు అనుమసముద్రం, పందిపాడు గ్రామాలలో వేరువేరుగా పౌష్టికాహార పక్షోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బిడ్డ పుట్టిన వెంటనే అరగంట లోగా తల్లిపాలు తాగించాలని, దీంతో ఎన్నో ప్రయోజనాలు ఉంటాయని తెలిపారు. చేతుల శుభ్రత, తల్లిపాల ప్రాముఖ్యత గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు కే ప్రసన్న, సిహెచ్ రత్నమ్మ, డి పుష్పకళ, ఎస్‌కె జరిందాజ్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ రహదారిపై బంకమట్టితో ప్రమాదాలు



రహదారిపై బంకమట్టి కారణంగా అదుపుతప్పిన మోటారు బైకు

సంగం, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పెరమన క్రాస్ రోడ్డు వద్ద ముంబాయి జాతీయ రహదారిపై పేరుకుపోయిన బంకమట్టితో వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. ముంబాయి జాతీయ రహదారి పక్కన పొలాల్లో నూర్పిడి చేయగా ధాన్యం గట్టుకు తరలించే క్రమంలో ట్రాక్టర్లు, వరికోత మిషన్‌లు ముంబాయి రహదారిపై తిరగడంతో చక్రాలకు ఉన్న బంకమట్టి రహదారిపై పేరుకుపోయింది. ఈనేపథ్యంలో మంగళ, బుధవారాలలో కురిసిన వర్షానికి బంకమట్టి రోడ్డుపైకి చేరి ద్విచక్ర వాహనాలు జారిపోయి వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. అంతేగాక ఎదురెదురుగా వాహనాలు వచ్చినప్పుడు రోడ్డు మార్జిన్‌లోకి వెళ్లే క్రమంలో ప్రమాదాలకు గురికావల్సి వస్తోందని, ఇప్పటికైనా ముంబాయి జాతీయ రహదారి అథా రిటీ అధికారులు స్పందించి రోడ్డు మీద పేరుకుపోయిన బంకమట్టిని తొల గించి ప్రమాదాలు నివారించాలని వాహనదారులు కోరుతున్నారు.

రామన్నగారిపల్లె రోడ్డు అభివృద్ధికి నిధుల మంజూరు

కలువాయి, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రామన్నగారిపల్లె రోడ్డు అభివృద్ధికి ప్రభుత్వం రూ.60 లక్షలు ఎస్ఏఎస్‌సీఐ నిధులు మంజూరు చేసింది. ఇందుకు సంబంధించిన జీవో బుధవారం ప్రభుత్వం విడుదల చేసింది. ఈ రోడ్డు కలువాయి నుంచి సీతారాంపల్లె, రామన్నగారిపల్లె, చింతలపాళెం మీదుగా పెంచలకోన రోడ్డులో కలుస్తుంది. కాగా, కలువాయి చెరువు దాటిన తరువాత కండలేరు కాలువపైకి ఉన్న రోడ్డు వెడల్పు తక్కువగా ఉండటంతో రెండు వాహనాలు ఎదురెదురుగా వచ్చినప్పుడు ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్యను గ్రామస్థులు వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ దృష్టికి తీసుకువెళ్లడంతో ఆయన స్పందించి ప్రభుత్వం నుంచి రోడ్డు అభివృద్ధికి నిధులు మంజూరు చేయించారు.

స్వచ్ఛమైన ఓటర్ల జాబితా తయారీకి సహకరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఈఆర్వో రామ్మోహన్

ఉదయగిరి, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): నియోజక వర్గం లో తప్పుల తడకలు లేని స్వచ్ఛమైన ఓటరు జాబితా తయారీకి అధికారులు, రాజకీయ పార్టీల నాయకులు సహకరించాలని నియోజకవర్గ ఎలక్ట్రోరల్ రిజిస్ట్రేషన్ అధికారి మురళి కోరారు. బుధవారం స్థానిక తహసీల్దారు కార్యాలయంలో నియోజకవర్గంలోని ఎనిమిది మండలాల తహసీల్దారులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని 323 పోలింగ్ కేంద్రాల పరిధిలో 18 ఏళ్లు నిండిన ప్రతిఒక్కరికీ ఓటుహక్కు కల్పించడంతోపాటు ఓటర్ల జాబితాలో మార్పులు, చేర్పులను పారదర్శకంగా చేపట్టాలన్నారు. కాగా, పలువురు తహసీల్దారులు సమావేశానికి హాజరుకాకపోవడంపై మండిపడ్డారు. ఈసారి నిర్వహించే సమావేశానికి హాజరుకాకపోతే వాయిదా వేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈఆర్వో ఎల్ రామ్మోహన్, సీనియర్ అసిస్టెంట్ నీహా, రాజకీయ పార్టీల నాయకులు బయ్యన్న, బొజ్జా నరసింహులు, నరసింహ, వెంకటేశ్వర్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి కూలీలందరూ ఈకేవైసీ చేయించుకోవాలి



ఈకేవైసీని పరిశీలిస్తున్న ఏపీడీ గాయత్రీదేవి

కలువాయి, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): జాబ్‌కార్డు కల్గిన ఉపాధి కూలీలందరూ తప్పనిసరిగా ఈకేవైసీ చేయించుకోవాలని డ్వామా నెల్లూరు క్లస్టర్ ఏపీడీ గాయత్రీ దేవి సూచించారు. బుధవారం కలువాయి, చింతలాత్మకూరు, చిన గోపరంలో జరుగుతున్న ఈకేవైసీ ప్రక్రియను ఆమె పరిశీలించారు. ఈసందర్భంగా ఏపీడీ మాట్లాడుతూ మండలంలోని 16,409 మంది జాబ్ కార్డు కల్గినవారు ఉన్నారని, ఇప్పటివరకు వారిలో 2344మంది మాత్రమే ఈకేవైసీ చేయించుకున్నారని, మిగిలిన వారందరూ త్వరగా చేయించుకోవాలన్నారు. క్షేత్రసహాయకులు, మేట్‌లు ఈ ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలని తెలిపారు. ఈకేవైసీ చేయించుకుంటేనే కూలీలకు పేమెంట్ వస్తుందన్నారు. 2025-26కు సంబంధించి మండలంలో 260 ఎకరాలు ఉపాధిహామీ ద్వారా పండ్ల తోటలు పెంపకం చేపట్టామని, లబ్ధిదారులందరూ వారి తోటలలో తప్పకుండా నీటి కుంటలు తవ్వుకోవాలన్నారు. ఆమె వెంట ఏపీవో సునీల్ వారి సిబ్బంది ఉన్నారు.

గ్రామీణ కౌశల్ పథకాన్ని సద్వినియోగం చేసుకోండి



ఎంఈవోకు బ్రోచర్‌ను అందజేస్తున్న పథకం కోఆర్డినేటర్లు

ఉదయగిరి, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా అమలుచేస్తున్న దీన్ దయాల్ ఉపాధ్యాయ గ్రామీణ కౌశల్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని పథకం కోఆర్డినేటర్లు షేక్ హనీఫా, ఎస్ స్పందన సూచించారు. ఈసందర్భంగా వారు బుధవారం స్థానిక ఎంఈవో కార్యాలయంలో ఎంఈవో-1 టీ.వెంకటేశ్వర్లుకు పథకం వివరా లను తెలియజేసి బ్రోచర్లు అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ఈ పథకం కేవలం గ్రామీణ ప్రాంత విద్యార్థులకు వర్తిస్తుందన్నారు. ఇంటర్మీడియట్ లేదా ఐటీఐ పాస్ అయిన వారు ఈ పథకానికి అర్హులన్నారు. వారికి మూడు నెలలపాటు ఉచిత శిక్షణ నిర్వహించడం జరుగుతుందన్నారు. ఆ సమయంలో ఉచిత భోజనం, హాస్టల్ వసతి కల్పించడంతో పాటు స్టడీ మెటీరియల్, ప్రాక్టికల్స్ కిట్, యూనిఫాం అందజేస్తారన్నారు. శిక్షణ అనంతరం ఉద్యోగ అవకాశాలు కల్పించడం జరుగుతుందన్నారు. మరిన్ని వివరాలకు 9177255671, 70939630 89 అనే నెంబర్లను సంప్రదించాలని వారు కోరారు.

అడవులు, వన్యప్రాణుల సంరక్షణ అందరి బాధ్యత



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న అటవీ శాఖాధికారులు

ఉదయగిరి, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): అడవులు, వన్యప్రాణుల సంరక్షణ అందరి బాధ్యత అని ఫారెస్టు సెక్షన్ ఆఫీసర్ చినవెంకటయ్య పేర్కొన్నారు. బుధవారం మండలంలోని దుర్గంపల్లి గ్రామంలో వన్యప్రాణుల వారోత్సవాల్లో భాగంగా అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అడవులను కాపాడుకుంటే సకాలంలో వర్షాలు కురిసి గ్రామాలు పాడి పంటలతో కళకళలాడతాయన్నారు. ప్రతి ఒక్కరూ అడవులు, వన్యప్రాణుల సంరక్షణపై అవగాహన పెంపొందించుకోవాలన్నారు. మానవ మనుగడకు అడవులు ఎంతగానో దోహద పడతాయన్నారు. అడవులు, వన్యప్రాణులకు ఎవరైనా హాని కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎఫ్‌బీవోలు లక్ష్మీప్రసన్న, బచ్చల వెంకటేశ్వర్లు, గ్రామస్థులు పాల్గొన్నారు.

C.R.I.M.E N.E.W.S

విద్యుదాఘాతానికి ఎలక్ట్రీషియన్ మృతి



మర్రి శీనయ్య మృతదేహం

చేజర్ల, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ మోటారు మరమ్మతు చేస్తూ విద్యుదాఘాతానికి గురై ఎలక్ట్రీషియన్ మృతి చెందిన సంఘటన చేజర్ల మండలం ఎన్‌వి కండ్రిక పంచాయతీ పరిధిలోని గాలిపాళెంలో బుధవారం చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. గాలిపాళెం గ్రామానికి చెందిన మర్రి శీనయ్య (26) వ్యవసాయ మోటార్లు రిపేరు చేస్తూ జీవనం సాగిస్తుంటాడు. ఈ నేపథ్యంలో గ్రామ సమీపంలోని తెలుగుగంగ కాలువ హెడ్ రెగ్యులేటర్ వద్ద ఒక రైతు మోటారు మరమ్మతుకు గురికావడంతో అక్కడకు వెళ్ళి రిపేరు చేసే క్రమంలో విద్యుదాఘాతానికి గురై అక్కడిక్కడే మృతి చెందాడు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తిరుమలరావు తెలిపారు.

ఉరివేసుకుని గుర్తుతెలియని వ్యక్తి..



ఉరి వేసుకున్న మృతి చెందిన వ్యక్తి

కావలి, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆముదాలదిన్నె గ్రామ పంచాయతీ పొలాల్లో జాతీయ రహదారికి సమీపంలో తుమ్మ చెట్టుకు చొక్కాతో ఉరి వేసుకుని గుర్తుతెలియని వ్యక్తి మృతి చెంది ఉండడాన్ని బుధవారం సాయంత్రం స్థానికులు గుర్తించారు. పోలీస్‌ల కథనం మేరకు.. సుమారు 50 ఏళ్ల వయస్సు కలిగి 5.3 అడుగుల ఎత్తు ఉన్న వ్యక్తి చొక్కాతో ఉరి వేసుకుని చెట్టుకు వేలాడుతుండగా స్థానికులు గుర్తించి ఒకటో పట్టణ పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో పోలీసులు అక్కడకు చేరుకుని వివరాల తెలుసుకునేందుకు ప్రయత్నించగా ఆయన వద్ద ఎలాంటి ఆధారాలు లభ్యం కాలేదు. కేవలం ఖైనీ పొగాకు ప్యాకెట్ మాత్రమే ఉంది. దీంతో చుట్టుపక్కల వారిని విచారించగా ఆయన హైవేపై ఉన్న దాబాలలో పనిచేసే నార్త్ ఇండియన్ వాసి అయి ఉంటాడని చెప్పారు. మధ్యాహ్నం ఒంటరిగా నడుచుకుంటూ రావడాన్ని కొందరు గమనించారు. మృతదేహాన్ని కావలి ఏరియా వైద్యశాలకు తరలించి పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. మృతుడి ఆచూకీ తెలిస్తే ఒకటో పట్టణ సీఐకి 94407 96312కు సమాచారం ఇవ్వాలని కోరారు.

60 గ్రాముల బంగారు ఆభరణాల స్వాధీనం

- భార్య, భర్తల అరెస్ట్



స్వాధీనం చేసుకున్న బంగారంతో సీఐ, సిబ్బంది

నెల్లూరు రూరల్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి) : చోరీ కేసులో భార్య, భర్తలను అరెస్ట్ చేసిన వారి నుంచి 60 గ్రాముల బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నట్లు నెల్లూరు రూరల్ సీఐ గుంజి వేణు తెలిపారు. బుధవారం ఆయన స్టేషన్‌లో మీడియాకు వివరాలు వెల్లడించారు. నెల్లూరు రూరల్‌లోని సామంతుల వారితోపులో నివాసముంటున్న రవి చౌదరి ఇంట్లో రాయవరపు వెంకటేశ్వర్లు, లలిత దంపతులు పని చేస్తున్నారు. ఇంట్లో 60 గ్రాముల బంగారు నల్లపూల దండలు మాయమవడంతో 10 రోజుల క్రితం రవి చౌదరి పోలీసులకు ఫిర్యాదు చేశారు. అనుమానంతో వెంకటేశ్వర్లు, లలితను విచారించగా దొంగతనం చేసినట్లు ఒప్పుకున్నారు. దీంతో వారిని అరెస్ట్ చేసి సొత్తు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు.

కాలువలో పడి యువకుడి మృతి

వెంకటాచలం, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కసుమూరు సమీపంలో కనుపూరు కాలువలో ప్రమాదవశాత్తు పడి ఓ యువకుడు మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. విడవలూరు మండలం ఉటుకూరు గ్రామానికి చెందిన అల్లూరు శ్రీకాంత్ (30)కు కసుమూరుకు చెందిన శిరీషాతో వివాహం జరిగింది. కాగా శ్రీకాంత్ చెన్నైలోని ఓ ప్రైవేటు కంపెనీలో సీఏగా ఉద్యోగం చేస్తున్నాడు. దసరా పండుగ సందర్భంగా కసుమూరులోని అత్తగారింటికి రాగా రెండురోజుల కిందట మార్నింగ్ వాకింగ్‌కు వెళ్లాడు. కానీ తిరిగి ఇంటికి రాకపోవడంతో భార్య శిరీషా ఫోన్ చేసినా అందుబాటులోకి రాలేదు. చుట్టుపక్కల గాలించినా కనిపించలేదు. ఈనేపథ్యంలో బుధవారం కనుపూరు కాలువలో ఒక మృతదేహం కనిపించడంతో విషయం తెలుసుకుని వెళ్లి చూడగా తన భర్త మృతదేహంగా గుర్తించింది. బహిర్భూమికి వెళ్లి ప్రమాదవశాత్తు కాలువలో పడి చనిపోయి ఉంటాడని భావిస్తున్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

జామియా మసీదు వక్ఫ్ భూమిలో ఉద్రిక్తత

- వక్ఫ్ బోర్డు రాష్ట్ర చైర్మన్, అధికారులతో స్థానికుల వాగ్వాదం
- భూముల పరిరక్షణ చర్యలు : అబ్దుల్ అజీజ్



జామియా మసీదు వక్ఫ్ భూములను పరిశీలిస్తున్న రాష్ట్ర వక్ఫ్‌బోర్డు చైర్మన్ అబ్దుల్‌అజీజ్

నెల్లూరు (సాంస్కృతికం), అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరులోని మనుమసిద్ధి నగర్‌లో జామియా మసీదుకు చెందిన వక్ఫ్ భూమి వద్ద బుధవారం ఉద్రిక్తత చోటుచేసుకుంది. మసీదు భూమి చదును చేసి అభివృద్ధి చేస్తామని రాష్ట్ర వక్ఫ్ బోర్డు చైర్మన్ అబ్దుల్‌అజీజ్ అధికారులతో కలిసి ఆ ప్రాంతానికి వచ్చారు. భూమిని పరిశీలిస్తుండగా వారితో స్థానిక ముస్లిం నాయకులు వాగ్వాదానికి దిగారు. సదరు స్థలాన్ని స్థానిక ప్రజల అవసరాలకే వినియోగించాలని, మసీదు, ఖబరస్థాన్, వసతి గృహం వంటి వాటికి వినియోగించాలని, అభివృద్ధి పేరిట వేరే కార్యక్రమాలకు ఈ భూములు కేటాయించవద్దని డిమాండ్ చేశారు. మాటా మాటా పెరిగి ఉద్రిక్తతకు దారి తీసింది. పోలీసులు ఇరువర్గాలకు నచ్చజెప్పి సర్దుబాటు చేశారు. అనంతరం అబ్దుల్‌అజీజ్ విలేకరులతో మాట్లాడుతూ జామియా మసీదు వక్ఫ్ భూమి 13 ఎకరాలను చదును చేసి ప్రహరీ నిర్మించబోతున్నామన్నారు. ఆ భూమిని ఎలా వినియోగించాలన్న దానిపై కలెక్టర్, స్థానిక ప్రజా ప్రతినిధులు, ముస్లిం మతపెద్దలతో చర్చించి ప్రణాళికలు సిద్ధం చేస్తామని చెప్పారు. కాగా, రాష్ట్ర వ్యాప్తంగా 67వేల ఎకరాల వక్ఫ్ భూములుండాల్సి ఉండగా కాలక్రమంలో ఆక్రమణలకు గురయ్యాయని అజీజ్ తెలిపారు. ఈ క్రమంలో వక్ఫ్ భూముల పరిరక్షణకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ భూములు ద్వారా ఆదాయాన్ని పెంచి, పేద ముస్లింల సంక్షేమం, అభివృద్ధికి కృషి చేస్తామని చెప్పారు. నవంబరు 11వతేదీ రాష్ట్ర వ్యాప్తంగా 28 ప్రాంతాల్లో స్కిల్‌డెవలప్‌మెంట్ కేంద్రాలు ప్రారంభిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు ముస్లిం నాయకులు పాల్గొన్నారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	118
స్కిన్ చికెన్	214
స్కిన్‌లెస్	236

కోడిగుడ్ల ధర (100): 540

రాకేష్ కిషోర్‌పై దేశద్రోహం కేసు నమోదు చేయాలి

కందుకూరు, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): ఇటీవల సుప్రీం కోర్టులో భారత సర్వోన్నత న్యాయాధిపతి బీఆర్ గవాయిపై చెప్పు విసిరిన న్యాయవాది రాకేష్‌కిషోర్‌పై దేశద్రోహం కేసు నమోదు చేయాలని బహుజన టీచర్స్ అసోసియేషన్ (బీటీఏ) నాయకులు డిమాండ్ చేశారు. బీటీఏ ఆధ్వర్యంలో బుధవారం పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద రాకేష్‌కుమార్ ప్రవర్తనను నిరసిస్తూ ఆందోళన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో బీటీఏ నాయకులు కె.మోహనరావు, షేక్ అబ్దుల్లా, రమణయ్య, సుబ్రహ్మణ్యం, మోహనరావు, కోటేశ్వరరావు, అంజయ్య, వెంకటరావు, శివన్నారాయణ, మెండా వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.


నిరసన తెలుపుతున్న బీటీఏ నాయకులు

రహదారులు ఛిద్రం!

● అధిక లోడుతో ఇసుక టిప్పర్లు


పరిమితికి మించి అధికలోడుతో వెళ్తున్న ఇసుక టిప్పర్లు

కలిగిరి, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): కలిగిరి-సంగం రహదారిలో పరిమితికి మించి అధిక లోడుతో ఇసుక టిప్పర్లు ప్రయాణిస్తుండటంతో రహదారులు ఛిద్రమవుతున్నాయి. సంగం వద్ద ఇసుక రీచ్ ఉండటంతో రేయింబవళ్లు ఈ మార్గంలో ప్రమాదకరంగా టిప్పర్లు, ట్రాక్టర్లు ప్రయాణిస్తున్నాయి. కలిగిరి-సంగం రహదారి మొత్తం 28 కి.మీలలో పాతనాపురం వద్ద నుంచి హసనాపురం వరకు ఉన్న 8కి.మీ సింగిల్‌రోడ్డు పూర్తిగా దెబ్బతిని ఉంది. సంగం నుంచి కలిగిరి మీదుగా కావలి, ఒంగోలు ప్రాంతాలకు ఇసుక రవాణా జరుగుతుండటం, పరిమితికి మించి అధిక లోడుతో ఈ మార్గంలో ప్రయాణించడంతో రహదారులు మొత్తం గొతుల మయంగా మారిపోయాయి. వింజమూరు, కలిగిరి, కొండాపురం మండలాల నుంచి నెల్లూరుకు వెళ్లే ఈ మార్గం ప్రయాణాలు చేసేవారితో రద్దీగా ఉంటుంది. ఇసుక టిప్పర్ల తాకిడితో దెబ్బతిన్న ఈ మార్గంలో రాత్రివేళల్లో ప్రయాణం చేసే వాహనదారులు రహదారి మధ్యలో ఏర్పడిన గుంతలను గుర్తించలేక ప్రమాదాలకు గురవుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గుంతలమయమైన రహదారులకు మరమ్మతులు నిర్వహించడంతోపాటు పరిమితికి మించి ఇసుకలోడుతో వెళ్తున్న టిప్పర్లపై చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు.


కలిగిరి-సంగం మార్గంలో రహదారి మధ్యలో ఏర్పడిన గుంతలు

న్యూస్ బాక్స్

చినక్రాకలో ఏపీ మోడల్ స్కూల్?

జలదంకి, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని చినక్రాకలో ఏపీ మోడల్ స్కూల్ ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధమవుతోన్నాయి. మండలానికి ఒక మోడల్ స్కూల్ ఇవ్వాలని రాష్ట్ర ఐటీ, విద్యాశాఖల మంత్రి నారా లోకేష్‌ను ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ కోరినట్లు సమాచారం. అందుకు మంత్రి సానుకూలంగా స్పందించడంతో ఈ మేరకు ప్రతిపాదనలు సిద్ధం చేసి రాష్ట్ర విద్యాశాఖకు పంపాలని ఎంపీడీవో బ్రహ్మయ్యను ఎమ్మెల్యే ఆదేశించారు. అందులో భాగంగా ఎంఈవో-1 నాగేశ్వరరావును మండలంలో ఎంత మంది విద్యార్థులు ఇంటర్మీడియట్ లోపు విద్యనభ్యసిస్తున్నారనే వివరాలతో కూడిన నివేదిక తయారు చేసి ఇవ్వాలని ఎంపీడీవో ఆదేశించారు. ఈ ప్రతిపాదనలు సిద్ధమై ప్రభుత్వానికి వెళితే మండలానికి మోడల్‌స్కూల్ వచ్చే అవకాశాలు పుష్కలంగా ఉండడంతో మోడల్‌స్కూల్ ఏర్పాటుకు సంబంధించి స్థల సేకరణ, విద్యార్థుల వివరాలు తదితర పనులు చకచకా జరుగుతున్నాయి. చినక్రాక వద్ద ఎన్‌హెచ్ 167బిజి రహదారి పక్కన ప్రభుత్వ భూమి అందుబాటులో ఉండడంతో ఏపీ మోడల్ స్కూల్ ఏర్పాటుకు ఆ ప్రాంతం అనుకూలమని భావిస్తున్నారు. మరికొందరు జలదంకిలో ఏర్పాటు చేస్తే మండలంలో అన్ని గ్రామాలకు అందుబాటులో ఉంటుందని భావిస్తున్నారు.

విద్యుత్ సబ్‌స్టేషన్‌లో పాముల సంచారం

● భయం గుప్పెట్లో ఆపరేటర్లు


సబ్‌స్టేషన్ ఆపరేషన్ గదిలోకి దూరిన పాము

జలదంకి, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): జలదంకి విద్యుత్ సబ్‌స్టేషన్‌లో పాముల సంచారం అధికమైంది. దీంతో ఆపరేటర్లు భయంగుప్పెట్లో విధులు నిర్వర్తిస్తున్నారు. సబ్‌స్టేసన్‌లో బుధవారం ఉదయం విధుల్లో ఉన్న ఆపరేటర్ తన గదిలోకి వెళ్లగా పాము తారసపడడంతో భయంతో బయటకు పరుగుపెట్టాడు. అనంతరం గదిలో ఉన్న పామును చంపి బయట పడేశాడు. తరచూ ఆపరేటర్ గదిలోకి పాములు వస్తున్నాయని, భయంతో విధులు నిర్వర్తిస్తున్నామని ఆపరేటర్ పేర్కొన్నాడు. సబ్‌స్టేషన్‌లో నిర్మించి ఉన్న ఆఫీసుగది, ఆపరేటర్ గదిలోకి వెళ్లే మెట్లు నెర్రెలు పడి ఉండడంతో ఈ నెర్రెలలో పాములు చేరి గదుల్లోకి వస్తున్నాయని అంటున్నారు. అంతేకాక సబ్‌స్టేషన్ ఆవరణలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు, సామగ్రిల కింద కూడా పాములు తరచూ సంచరిస్తున్నాయని, వీటిని ముట్టుకోవాలంటే ఎక్కడ పాములు కరుస్తాయోనని భయపడుతున్నామని విద్యుత్‌లైన్లు వేసే ప్రైవేటు వర్కర్లు పేర్కొన్నారు. ఈ విషయమై ఏఈ సునీల్‌కుమార్ దృష్టికి తీసుకుపోగా మెట్లు మరమ్మతులు చేయిస్తానని తెలిపారు.

ట్రేడ్ లైసెన్స్ ఫీజులు వసూలు చేయాలి

కావలి, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): పట్టణంలో ట్రేడ్ లైసెన్సులు పొందని, రెన్యువల్ చేయని వ్యాపారస్తులకు నోటీసులు ఇచ్చి ట్రేడ్ లైసెన్స్ ఫీజులు వసూలు చేయాలని మున్సిపల్ కమిషనర్ జీ.శ్రావణ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. సచివాలయ శానిటరీ సెక్రటరీలు, మేస్త్రీలు వారి పరిధిలో ఉన్న వ్యాపారస్థుల వద్దకు వెళ్లి ట్రేడ్ లైసెన్స్‌లు లేని వారికి ట్రేడ్ లైసెన్స్‌లు వేసి రెన్యువల్ చేయని వారితో రెన్యువల్ చేయించి లైసెన్స్ ఫీజులు వసూలు చేయాలన్నారు.

● 40 శాతం కన్నా తక్కువ వైకల్యం ఉన్నవారికి వైద్య పరీక్షలు

పట్టణంలో దివ్యాంగుల పింఛన్ పొందుతూ 40 శాతం కన్నా తక్కువ వైకల్యం ఉన్నవారికి ప్రభుత్వ వైద్యశాలల్లో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ తెలిపారు. అంగవైకల్యం ఉన్న వారికి ఈనెల 9, 11, 15, 16 తేదీలలో కావలి ఏరియా వైద్యశాలలో వైద్యపరీక్షలు నిర్వహిస్తారని పేర్కొన్నారు. అంధత్వం ఉన్న వారికి ఆత్మకూరు ప్రభుత్వ వైద్యశాలలో ఈ నెల 10వ తేదీన వైద్యపరీక్షలు నిర్వహిస్తారని పేర్కొన్నారు. వినికిడి లోపం ఉన్న వారికి నెల్లూరు జిల్లా కేంద్రంలోని వైద్యశాలలో ఈనెల 15, 16, 17 తేదీలలో వైద్యపరీక్షలు నిర్వహిస్తారని తెలిపారు. మానసిక వైకల్యం ఉన్న వారికి జిల్లా వైద్యశాల నెల్లూరులో ఈనెల 15వ తేదీన వైద్య పరీక్షలు నిర్వహిస్తారని తెలిపారు. ఇప్పటికే వార్డు, సంక్షేమ అభివృద్ధి కార్యదర్శులు వారికి నోటీస్‌లు కూడా జారీ చేశారని, వైకల్యం తక్కువ ఉన్న వారు ఈ వైద్యపరీక్షలను సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు.

6 రోజులు మంచినీటి సరఫరా నిలిపివేత


రాళ్లపాడు-రోళ్లపాడు మంచినీటి ట్రీట్‌మెంటు ప్లాంటులో మరమ్మతులు చేస్తున్న సిబ్బంది

లింగసముద్రం, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): రాళ్లపాడు-రోళ్లపాడు భారీ మంచినీటి పథకంకు చెందిన వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంటులో మరమ్మతు పనుల కారణంగా 6 రోజుల పాటు నీటి సరఫరా నిలిపి వేశారు. ఈ పథకం నుంచి గత కొన్ని నెలలుగా కలుషిత నీరు సరఫరా అవుతున్న విషయం తెలిసిందే. దీంతో కందుకూరు ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు ఈ పథకం ట్రీట్‌మెంటు ప్లాంటులో మరమ్మతులకు గురైన ఫిల్టర్ బెడ్లను కొన్నింటిని బాగు చేసేందుకు మెకానిక్‌లను రప్పించి పనులను ప్రారంభించారు. దీంతో బుధవారం నుంచి ఈనెల 13వ తేదీ వరకు ఈ పథకం నుంచి 48 గ్రామాలకు నీటి సరఫరాను నిలిపి వేస్తున్నట్లు ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈఈ సీహెచ్ రాజశేఖర్ తెలిపారు. ఈ పథకం పరిధిలోని లింగసముద్రం, వలేటివారిపాలెం మండలాల్లోని గ్రామ పంచాయతీలకు చెందిన పంచాయతీ కార్యదర్శులు ప్రజలు మంచినీటికి ఇబ్బందులు పడకుండా తగిన చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

సాహిత్య మేధావి అడవి బాపిరాజు


అడవి బాపిరాజు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మాలకొండారెడ్డి, కోటేశ్వరి

కావలి(టౌన్), అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): సాహిత్య మేధావి అడవి బాపిరాజు అని సామాజిక కార్యకర్త, గ్రంథాలయ అభివృద్ధి కమిటీ సభ్యుడు మాలకొండారెడ్డి, కావలి శాఖా గ్రంథాలయాధికారిణి బీ.కోటేశ్వరి తెలిపారు. బుధవారం వెంగళ రావునగర్‌లోని శాఖా గ్రంథాలయంలో అడవి బాపిరాజు జయంతి పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వక్తలు మాట్లాడుతూ బహుముఖ ప్రజ్ఞాశాలి స్వాతంత్ర సమర యోధుడు, రచయిత, కళాకారుడు, నాటక కర్త అడవి బాపిరాజు 130వ జయంతి వేడుకలు నిర్వహించకోవడం మనందరి బాధ్యత అన్నారు. ఆయన రచించిన గోనగన్నారెడ్డి, తుపాను, కోనంగి వంటి నవలలు సాహిత్యరంగంలో చిరస్థాయిగా నిలచిపోతాయని, తెలుగు ప్రజల్లో విస్తృతంగా ప్రచారంలో ఉన్న బావ బావ పన్నీరు అనేపాట ఆయన రచించిందే అన్నారు. కార్యక్రమంలో సచివాలయ మహిళా కానిస్టేబుల్ యం.విజయ, పాఠకులు పాల్గొన్నారు.

జీఎస్టీ సంస్కరణలతో పెరిగిన కొనుగోళ్లు

● అసిస్టెంట్ కమిషనర్ వరప్రసాద్

కావలి, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం తీసుకు వచ్చిన జీఎస్టీ సంస్కరణలతో ప్రజలకు నిత్యం అవసరమైన అన్ని రకాల వస్తువులపై జీఎస్టీ తగ్గి ప్రజల కొనుగోలు శక్తి పెరిగి దేశాభివృద్ధికి దోహద పడుతోందని జీఎస్టీ కావలి అసిస్టెంట్ కమిషనర్ వరప్రసాద్ తెలిపారు. బుధవారం కావలి పుల్లారెడ్డి నగర్‌లోని వశిష్ట కళాశాలలో జీఎస్టీ సంస్కరణలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వరప్రసాద్ మాట్లాడుతూ పన్నులు ప్రత్యక్ష, పరోక్ష పన్నులుగా రెండు రకాలు ఉంటాయన్నారు. ప్రత్యక్ష పన్ను ఆదాయ పన్ను అని, దానిని ఆదాయం కలిగిన వారే కడతారన్నారు. మనం నిత్యం కొనుగోలు చేసే ప్రతి వస్తువుపై పన్నులు కలిపి విక్రయిస్తున్నందున దానినే పరోక్ష పన్ను అంటారని, అది ప్రతి ఒక్కరం మనకు తెలికుండానే కడుతున్నామన్నారు. ఈ పరోక్ష పన్నులను జీఎస్టీ రూపంలో నాలుగు శ్లాబుల కింద 5,12,18,28 శాతాల కింద వస్తువులపై విధిస్తూ వచ్చిందన్నారు. అయితే కేంద్ర ప్రభుత్వం గత నెలలో జీఎస్టీని 5, 18 శాతంలకు తీసుకు రావటంతో పేద మధ్యతరగతి ప్రజలకు ఎంతో ఊరటగా ఉందన్నారు.



మాట్లాడుతున్న అసిస్టెంట్ కమిషనర్ వరప్రసాద్

ఎప్పుడైతే ప్రజల కొనుగోలు శక్తి పెరుగుతుందో అప్పుడు దేశాభివృద్ధికి తోడ్పడుతోందని చెప్పారు. కనుక ప్రతి ఒక్కరూ తగ్గిన ఈ జీఎస్టీపై అవగాహన కలిగి ఉండలన్నారు. ఎవరైనా జీఎస్టీని తగ్గించకుండా సరుకులను విక్రయిస్తే మీరు అలాంటి వారిపై లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఈ కార్యక్రమంలో వశిష్ట కళాశాల ప్రిన్సిపాల్ అన్వర్ పాల్గొన్నారు.

సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్

కావలి(టౌన్,ఆంధ్రజ్యోతి): సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్ అని డీబీఎస్ ఇంజనీరింగ్ కళాశాల కార్యదర్శి దామిశెట్టి బాలసురేష్‌బాబు పేర్కొన్నారు. బుధవారం డీబీఎస్ ఇంజనీరింగ్ కళాశాలలో సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్ అనే అశంపై అవగాహన కార్యక్రమం నిర్వహించి విద్యార్థులకు ఎలోక్యూషన్ పోటీలు నిర్వహించి విజేతలకు ప్రశంసాపత్రాలు, బహుమతులు అందించారు. సూపర్ జీఎస్టీ 2.0పై ప్రతిఒక్కరు అవగాహన కలిగి ఉండాలని, జీఎస్టీ సవరణ వలన కలిగే ప్రయోజనాలు తెలుసుకుని వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు జరిగిన అవగాహన కార్యక్రమానికి ప్రిన్సిపాల్ టీవీ రావు అధ్యక్షతన వహించగా కరస్పాండెంట్ సుధీర్‌నాయుడు, పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్ రమణయ్య పాల్గొన్నారు.



విద్యార్థినికి ప్రశంసాపత్రం అందజేస్తున్న బాలసురేష్‌బాబు, సుధీర్‌నాయుడు

పాఠశాల ఆవరణలో వర్షపు నీరు

● ఇబ్బందులు పడ్డ విద్యార్థులు, ఉపాధ్యాయులు


చినపవనిలోని హెచ్‌పీ పాఠశాల ఆవరణలో చేరిన వర్షపు నీరు

లింగసముద్రం, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని చినపవనిలో బుధవారం మధ్యాహ్నం 1.30 గంటలకు భారీ వర్షం కురిసింది. దీంతో ఎస్సీ కాలనీలోని హెచ్‌పీ పాఠశాల ఆవరణలోకి భారీగా వర్షపు నీరు చేరింది. దీంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు ఇబ్బందులు పడ్డారు. ముఖ్యంగా ఈ పాఠశాల చాలా కాలం క్రితం నుంచి శిథిలావస్థకు చేరిన విషయం తెలిసిందే. ఈ పాఠశాల స్లాబు పెచ్చులూడి చువ్వలు బయట పడడం, గోడలు నెర్రెలిచ్చాయి.అంతేగాక వర్షం పడ్డప్పుడు పాఠశాల గోడలు నాని ప్రమాదం జరిగే అవకాశం ఉంది. దీంతో వర్షం పడ్డప్పుడు ఉపాధ్యాయులు, విద్యార్థులు కాలనీలోని కమ్యూనిటీ హాలులోకి వెళుతున్నారని స్థానికులు అంటున్నారు. ఉన్నతాధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని కాలనీవాసులు కోరుతున్నారు.

ఉపాధి హామీ పనుల అవకతవకలపై విచారణ

కొండాపురం, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని మర్రిగుంటలో ఉపాధి హామీ పనుల అవకతవకలపై ఏపీడీ మృదుల బుధవారం గ్రామంలో విచారణ చేపట్టారు. ఆమె మాట్లాడుతూ క్షేత్ర సహాయకుడు బీ.అంకబాబు 2022-23 సంవత్సరానికి సంబంధించి ఒకరి పేరుపై మరొకరు ఉపాధి పనులను చేయించి అవినీతికి పాల్పడినట్లు అదేగ్రామానికి చెందిన పలువురు జిల్లా కలెక్టరుకు ఫిర్యాదు చేశారన్నారు. ఆయన ఆదేశాల మేరకు గ్రామంలో విచారణ నిర్వహించామన్నారు. కూలీలను పిలిచి వారి నుంచి వివరాలు సేకరించామని, నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో కార్యాలయ ఏవో శేషసాయి, ఏపీవో మురళీధరరావు, ఉపాధిహామీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.


కూలీలను విచారిస్తున్న ఏపీడీ మృధుల

రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక


రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న కరస్పాండెంట్, డైరెక్టర్లు

కందుకూరు, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా(ఎస్జీఎఫ్ఐ) నిర్వహించిన తైక్వాండో పోటీలలో విశేష ప్రతిభ చూపటం ద్వారా రాష్ట్రస్థాయి పోటీలకు కందుకూరు బీఆర్ ఆక్స్‌ఫర్డ్ విద్యార్థులు ఎంపికయ్యారు. పాఠశాలకు చెందిన పీ.సార్థిక్, జే.రేష్మి, ఎస్కే. సాజిద్‌లు ఒంగోలులో నిర్వహించిన జిల్లాస్థాయి పోటీలలో పతకాలు సాధించి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారని చైర్మన్ ఉన్నం భాస్కరరావు తెలిపారు. వీరు ఈనెల 11, 12వ తేదీలలో రేపల్లెలో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొంటారని తెలిపారు. ఆ విద్యార్థులను విద్యాసంస్థల కరస్పాండెంట్ బండి వెంకటేశ్వర్లు, డైరెక్టర్లు జీ.బాలభాస్కరరావు, బీ. నరేంద్రబాబు, అభినందించారు.

రాఘవేంద్ర కాలనీలో దొంగల హల్‌చల్


సీసీ కెమెరాలో నమోదైన దుండగుల కదలికలు

కావలి రూరల్, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ముసునూరు రాఘవేంద్ర కాలనీలో దొంగలు హల్‌చల్ చేసిన ఘటన బుధవారం వెలుగు చూసింది. రూరల్ పోలీసుల వివరాల మేరకు.. రాఘవేంద్ర కాలనీలో తాళాలు వేసి ఉన్న దొడ్డంరెడ్డి ప్రతాప్‌రెడ్డి, గుర్రం వెంకట్రావ్, కొండూరు ప్రసాద్, దేవూరుపల్లి అశోక్ ఇళ్లల్లో గుర్తు తెలియని దుండగులు తాళాలు పగలగొట్టి ఇళ్లల్లోకి చరబడ్డారు. అయితే అశోక్ ఇంట్లో మాత్రమే కొన్ని వెండి వస్తువులతో పాటు స్కూటీని అపహరించుకెళ్లారు. చోరీ జరిగిన విషయాన్ని గుర్తించిన బాధితుడి అశోక్ ఈనెల 7 తేదీన పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసినట్లు సీఐ రాజేశ్వరరావు తెలిపారు. రంగంలోకి దిగిన పోలీసుల ఆ ప్రాంతంలోని ఇళ్లల్లో సీసీ కెమెరాలను పరిశబూలించగా దుండగులు రాడ్లు పట్టుకుని ఆ ప్రాంతంలో సంచరించడం అక్కడ సీసీ ఫుటేజ్‌లో రికార్డు అయ్యాయి. ఎమ్మెల్యే ఇంటికి కూతవేటు దూరంలో చోరీ జరిగినా పోలీసులు గోప్యంగా ఉంచటంతో ఆ ప్రాంత వాసులు దొంగల భయంతో బెంబేలెత్తి పోతున్నారు.

జాతీయ రహదారిపై మలుపు

● పొంచి ఉన్న ప్రమాదం


జలదంకి పెద్దచెరువు కట్ట కింద రోడ్డు మలుపు

జలదంకి, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): జలదంకి పెద్దచెరువు కట్ట కింద ప్రాంతంలో నూతనంగా నిర్మాణం జరిగిన ఎన్‌హెచ్167బిజి రహదారిపై ప్రయాణం ప్రమాదపుటంచుల్లో సాగుతోంది. చెరువుకట్ట కింద రోడ్డు పంట పొలాలకంటే ఆరు నుంచి పది అడుగుల మేర ఎత్తుగా వేయడంతో పాటు మలుపులు ఉండడంతో ఏ సమయంలోనైనా వాహనాలు ప్రమాదాలకు గురయ్యే అవకాశాలు మెండుగా ఉన్నాయని వాహనచోదకులు ఆందోళన చెందుతున్నారు. రాత్రి వేళల్లో ఈ ప్రాంతంలో ప్రయాణం మరింత ప్రమాదకరమని భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు. వేగంగా వాహనాలు వచ్చే సమయంలో మలుపుల వద్ద వాహనాలు అదుపులో లేకుండా ఉంటే ప్రమాదం జరిగే అవకాశం ఉంది. కొత్తగా వేసిన రోడ్డు వద్ద ఎలాంటి ప్రమాద హెచ్చరిక బోర్డులు కానీ ఎత్తుగా వేసిన రోడ్డు అంచుల ఇనుప కంచెలు కానీ ఏర్పాటు చేయకపోవడంతో ప్రమాదాలు జరిగే వీలుంది. జాతీయ రహదారి కాంట్రాక్టరు ఈ ప్రాంతంలో హెచ్చరిక బోర్డులతో పాటుగా రోడ్డు పంటపొలాల కంటే ఎత్తుగా వేసిన రోడ్డు ప్రాంతాల్లో ఇనుప కంచెలు ఏర్పాటు చేసి ప్రమాదాలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలు చేపట్టాలని వాహనచోదకులు, ప్రయాణికులు కోరుతున్నారు.

దళిత, గిరిజనులపై కక్షతోనే అంబేడ్కర్‌ను అవమానించారు



అంబేడ్కర్ విగ్రహానికి పాలభిషేకం చేస్తున్న దళిత,గిరిజన నేతలు

బిట్రగుంట, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): దళిత గిరిజనులపై ఉన్న కక్షతోనే దళిత ఆరాధ్యుడు భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ను అవమానిస్తూ ఆయన విగ్రహానికి నల్లటి గ్రీస్ పూశారని గిరిజన సంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు పాలకీర్తి రవి అన్నారు. బోగోలు మండలం చెంచులక్ష్మీపురంలో దళిత, గిరిజనులు ఏర్పాటు చేసుకున్న బాబా సాహెబ్ అంబేడ్కర్ విగ్రహానికి ఉన్మాదులు నల్లటిగ్రీస్ పుయ్యడాన్ని వ్యతిరేకిస్తూ బుధవారం వివిధ ప్రాంతాలకు చెందిన పలువురు దళిత, గిరిజన సంఘాల నేతలు తరలివచ్చి అంబేడ్కర్ విగ్రహానికి పాలభిషేకం చేశారు. దళిత, గిరిజన నేతలు తుమ్మ మస్తాన్, చల్లా మాధవి, సముద్రాల దావీదు అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారతీయులందరి కోసం అంబేడ్కర్ రాజ్యాంగాన్ని రాశారని అటువంటి మహానుభావునిని అవమానించడం హేయమైన చర్య అన్నారు. అటువంటి వారు ఎవరైనసరే ఉపేక్షించకుండా పోలీసులు వెంటనే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు షేక్.సందానీ, గుర్నాథం రవి, షేక్.రజియా, బీర్షన్, సుధాకర్, బీ.రవిచంద్ర, యు.రవి, వై.జయరాజు, బీ.యోహాను, తదితరులు పాల్గొన్నారు.

పట్టణ పోలీస్‌స్టేషన్‌లో డీఎస్పీ తనిఖీ


రికార్డులు పరిశీలిస్తున్న డీఎస్పీ బాలసుబ్రహ్మణ్యం

కందుకూరు, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): కందుకూరు పట్టణ పోలీసు స్టేషన్‌లో డీఎస్పీ సీహెచ్‌వీ బాలసుబ్రహ్మణ్యం బుధవారం తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్టేషన్‌లోని రికార్డులు, పెండింగ్ కేసులను పరిశీలించటంతో పాటు కేసుల పురోగతిని విచారించారు. మహిళలు, చిన్నారులు, వృద్ధులకు సంబంధించిన కేసులలో సత్వర న్యాయం జరిగేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఎస్ఐ శివనాగరాజుకు సూచించారు. అలాగే జూదం, బెట్టింగ్ యాప్‌లు, ఆన్‌లైన్ లోన్ యాప్‌లు, క్రికెట్ బెట్టింగ్ యాప్‌లు, ఫైనాన్షియల్ వేధింపులకు సంబంధించిన కేసులపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, యాప్‌లతో యువతను ఆర్థికంగా కుంగదీస్తున్న నేరస్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం సిబ్బంది సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో సీఐ అన్వర్‌బాషా పాల్గొన్నారు.





బుధవారం ఉదయం బస్టాప్ వద్ద నలుగురు వృద్ధులు - మిగిలిన ముగ్గురిని ఆస్పత్రికి తరలిస్తున్న వైద్యులు - చనిపోయిన వృద్ధుడికి సామాజిక కార్యకర్త సుజాత నివాళి

ఆ ముగ్గురూ ఆస్పత్రికి

చికిత్స అందిస్తున్న వైద్యులు ● మరో వృద్ధుడి మృతి

'అవును.. వీళ్లు బతికే ఉన్నారు' అంటూ ప్రాణమున్న శవాల్లా పడున్న వారి గురించి 'ఆంధ్రజ్యోతి' మానవీయ కోణంలో స్పందించింది. మొన్న ఆరుగురు.. మంగళవారానికి ఐదుగురయ్యారు. మంగళవారం వృద్ధుడి మృతితో నలుగురు మిగిలారు. ఎవరికీ పట్టని ఆ నలుగురి దైన్యస్థితి, వారికి అమ్మలా సేవలు అందిస్తున్న సామాజిక కార్యకర్త సుజాత గురించి ప్రస్తావించింది. దీనికి కలెక్టర్ వెంకటేశ్వర్ నుంచి మానవీయ కోణంలో స్పందన లభించింది. తిరుపతి రుయాస్పత్రి సమీపంలోని ఇస్కాన్‌కు వెళ్లే రోడ్డు పక్కన బస్టాప్‌లో పడున్న ఆ నలుగురికీ మెరుగైన చికిత్స అందించాలని డీఎంహెచ్‌వో బాలకృష్ణనాయక్‌ను బుధవారం కలెక్టర్ ఆదేశించారు. వైద్య సిబ్బంది అక్కడకు చేరుకునే సరికే మరో వృద్ధుడు మరణించాడు. మిగిలిన ముగ్గురిని రుయాస్పత్రికి తరలించి అవసరమైన వైద్యం అందిస్తున్నారు. వైద్య సిబ్బంది కంటే ముందే అక్కడకు చేరుకున్న సామాజిక కార్యకర్త సుజాత మృతి చెందిన మరో వృద్ధుడికి కూడా సొంత ఖర్చులతో దహన సంస్కారాలు నిర్వహించారు. చికిత్స పొందుతున్న ముగ్గురికి అవసరమైన సహాయ సహకారాలు అందించేందుకు శ్రీజనతా సేవా మిత్ర హెల్పింగ్ హ్యాండ్ అసోసియేషన్ సభ్యులు ముందుకు వచ్చారు. వారికోసం ముగ్గురు అటెండర్లను రుయాస్పత్రిలో ఉంచారు. అవసరమైన మందులను అందిస్తామని తెలిపారు. ఆ ముగ్గురి ఆరోగ్యం మెరుగై.. వారు కోలుకోవాలని అందరూ ఆకాంక్షిస్తున్నారు.

- తిరుపతి(వైద్యం), ఆంధ్రజ్యోతి



వృద్ధులను తీసుకెళ్లడంతో ఖాళీగా ఉన్న బస్టాప్



అరాచకుల పీచమణచ..
బిగిసెను శాంతిదూత పిడికిలి

ఘోరాలను కళ్లజూసి..
ఎరుపెక్కెను చల్లనయ్య

మంచికాలం వచ్చునని..
ముడిసెను మువ్వన్నెల జెండా

చిత్తూరు గాంధీసెంటర్‌లో
బుధవారం రాత్రి
కనిపించిన దృశ్యం.

-స్టాఫ్ ఫొటోగ్రాఫర్, ఆంధ్రజ్యోతి, చిత్తూరు

బోధనకు పదును

నూతన ఉపాధ్యాయులకు శిక్షణ

భావిభారత పౌరులైన విద్యార్థులను అభివృద్ధి మార్గంలో నడిపించాల్సిన గురుతర బాధ్యత గురువులదే. అందుకు ముందుగా ఉపాధ్యాయులు అన్నివిధాలైన పరిజ్ఞానాన్ని, మెలకువలు అవసరం. ఈ దిశగా నూతన ఉపాధ్యాయులను తీర్చిదిద్దేందుకుగాను వృత్తిపరమైన శిక్షణ ఇస్తున్నారు. తద్వారా బోధనకు పదును పెడుతున్నారు.

- తిరుపతి(విద్య), ఆంధ్రజ్యోతి



మెగా డీఎస్సీ ద్వారా ఉపాధ్యాయ ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులను నిజమైన ఉపాధ్యాయులుగా పూర్తిస్థాయిలో తీర్చిదిద్దేలా రాష్ట్ర ప్రభుత్వం వృత్తి శిక్షణా కార్యక్రమాన్ని రూపొందించింది. బోధన, అభ్యసన అంశాల్లో శిక్షణ ఇప్పిస్తోంది. విజయవాడ నుంచి వచ్చిన రిసోర్స్ పర్సన్లు 10 రోజులపాటు (ఈనెల 10వ తేదీ వరకు) శిక్షణ తరగతులను నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా నూతన ఉపాధ్యాయులు మానసిక ఒత్తిడిని జయించేందుకు ఉదయం 6-7 గంటల వరకు యోగా, ఆసనాలపై శిక్షణ ఇస్తున్నారు. 7-8 గంటలమధ్య వ్యక్తిత్వ వికాసంకు సంబంధించిన అంశాలను బోధిస్తున్నారు. విద్యార్థి సమగ్ర మూర్తిమత్వం, విద్యార్థుల్లో నైతికత పెంపొందించడం, స్థిరమైన జీవితాన్ని ప్రోత్సహించడం, సమాజంపై అవగాహన కల్పించడం తోపాటు విద్యార్థి శారీరక అభివృద్ధి, మేధోభివృద్ధి, భాషాభివృద్ధి, సామాజిక సాంస్కృతిక కళాభివృద్ధిని పెంపొందించడానికి అవసరమైన నైపుణ్యాలపై అవగాహన కల్పిస్తున్నారు. 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు రాష్ట్ర విద్యాశాఖ ఎస్‌ఈఆర్టీ రూపొందించిన బోధనా విధానాలకు సంబంధించిన పుస్తకాలను, ఎఫ్‌ఎల్ఎన్ విధనాలు, టీఏఆర్ఎల్ విధానాలకు సంబంధించిన అంశాలపై శిక్షణ ఉంటోంది. బోధనా అభ్యసన సామగ్రిని తయారు చేయించడం, వాటి ఆధారంగా సులభ బోధన ఎలా చేయాలనే అంశాలపై శిక్షణ ఇస్తున్నారు. ఉపాధ్యాయులుగా పాఠశాలల్లో నిర్వహించాల్సిన రిజిస్టర్లు, రికార్డులు, పాఠ్య బోధన, తరగతి నిర్వహణ, తల్లిదండ్రుల సమావేశాలు, మధ్యాహ్న భోజన పథకాల నిర్వహణ, పాఠశాల పరిశుభ్రత, పాఠశాలల్లో నిర్వహించాల్సిన వివిధ కార్యక్రమాలకు సంబంధించిన విషయాలతో సమగ్రంగా ఈ వృత్తిపరమైన శిక్షణ సాగుతోంది. ఈ శిక్షణా కార్యక్రమంతో నూతన ఉపాధ్యాయులు సరికొత్తగా ప్రభావవంతమైన ఉపాధ్యాయులుగా అవతరించనున్నారు. అనంతరం వీరికి మళ్లీ వేసవి సెలవుల్లో రెండో దఫా శిక్షణ ఇవ్వనున్నారు.



ఆరు కేంద్రాల్లో శిక్షణ

● తిరుపతి రూరల్ దుర్గసముద్రం మెడ్జ్‌స్కూల్‌లో 450 మంది ఎస్జీటీలకు శిక్షణ సాగుతోంది. వేదాంతపురం ఢిల్లీపబ్లిక్ స్కూల్‌లో 213 మంది ఫిజికల్‌సైన్స్, మైనర్ మీడియంలకు చెందిన స్కూల్ అసిస్టెంట్లకు శిక్షణ ఇస్తున్నారు. తిరుపతి జీవకోనలోని విశ్వం పాఠశాలలో 250 ఎస్జీటీలకు, గూడూరు ఆదిశంకర ఇంజినీరింగ్ కళాశాలలో 222 మంది ఎస్జీటీలకు మొత్తం 1135 మంది నూతన ఉపాధ్యాయులకు తిరుపతి జిల్లాలోని నాలుగు కేంద్రాల్లో శిక్షణ తరగతులు సాగుతున్నాయి. అలాగే చిత్తూరులో శ్రీవెంకటేశ్వర ఫార్మసీ కళాశాలలో భాషా శాస్త్రాలకు చెందిన 152 మంది స్కూల్ అసిస్టెంట్లకు.. ఆర్కే ఇంటర్నేషనల్ స్కూల్లో గణితం, బయాలజీ, సోషల్, ఫిజికల్‌సైన్స్‌కు చెందిన 160 మంది స్కూల్ అసిస్టెంట్ల శిక్షణ ఇస్తున్నారు. వీరికి అన్ని ఏర్పాట్లు చేసినట్లు డీఈవో కేవీఎన్ కుమార్ తెలిపారు. అవసరమైన మెటీరియల్, అభ్యసన సామగ్రి అందించామన్నారు.

7 ఆర్‌అండ్‌బీ రోడ్లకు

రూ.24.30 కోట్లు

తిరుపతి, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో రోడ్లు, భవనాల శాఖ పరిధిలోని ఏడు ప్రధాన రోడ్ల అభివృద్ధికి ప్రభుత్వం రూ.24.30 కోట్లు మంజూరు చేసింది. స్టేట్ హైవేస్‌కు సంబంధించి గూడూరు డివిజన్‌లో గూడూరు-తురిమెర్ల రోడ్డును పది కిలోమీటర్ల మేర అభివృద్ధి చేయడానికి రూ. 5 కోట్లు, తిరుపతి డివిజన్‌లో శ్రీకాళహస్తి - మిద్దికండ్రిగ రోడ్డును 14.65 కిలోమీటర్ల మేర మెరుగుపరిచేందుకు రూ. 4 కోట్లు చొప్పున 19.65 కిలోమీటర్ల మేర రెండు రోడ్ల అభివృద్ధి పనులకు రూ. 9 కోట్లు మంజూరైంది. అలాగే మేజర్ డిస్ట్రిక్ట్ రోడ్లకు సంబంధించి గూడూరు డివిజన్‌లో ఎంసీ రోడ్డు నుంచీ పూలతోట మీదుగా కట్టువపల్లి వరకు, పెనుబాక నుంచీ చెంబేడు రోడ్డు మీదుగా సిరసనంబేడు వరకు, సిరసనంబేడు రాజుపాలెం నుంచీ మోదుగులపాలెం వరకూ 12 కిలోమీటర్ల మేర రోడ్డు అభివృద్ధికి రూ. 3.50 కోట్లు, తిరుపతి డివిజన్‌లో బైరాజు కండ్రిగ నుంచీ రామాపురం వరకూ 4.10 కిలోమీటర్ల మేర రోడ్డు అభివృద్ధికి రూ. 2.30 కోట్లు, శ్రీకాళహస్తి నుంచీ ముసలిపేడు వరకూ 5.90 కిలోమీటర్ల మేర రోడ్డు అభివృద్ధికి రూ. 3 కోట్లు, భాకరాపేట నుంచీ మంగళంపేట వరకు, పీబీసీ రోడ్డు నుంచీ రంగన్నగారి గడ్డ మీదుగా పెద్దమల్లెల-ఎర్రావారిపాలెం రోడ్డు వరకు 14.20 కిలోమీటర్ల మేర రోడ్ల అభివృద్ధికి రూ. 3.50 కోట్లు, వడమాలపేట నుంచీ తిరుమండ్యం మీదుగా ఎన్‌ఎన్‌పీ రోడ్డు వరకు, పాదిరేడు నుంచీ లక్ష్మమ్మ కండ్రిగ మీదుగా టీసీ అగ్రహారం వరకూ ఏడు కిలోమీటర్ల మేర రోడ్ల అభివృద్ధికి రూ. 3 కోట్లు చొప్పున మొత్తం 43.2 కిలోమీటర్ల మేర రోడ్లను అభివృద్ధి పరిచేందుకు 15.30 కోట్లు మంజూరైంది. రెండు కేటగిరీలూ కలిపి ఏడు పనుల కింద 62.85 కిలోమీటర్ల మేరకు రోడ్లను అభివృద్ధి చేయడానికి రూ. 24.30 కోట్లు మంజూరైంది.

[ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్]

'రెవెన్యూ మాయాజాలం'పై కలెక్టర్ సీరియస్

సత్యవేడు, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): సత్యవేడు రెవెన్యూలో చోటు చేసుకున్న భూ మాయాజాలంపై కలెక్టర్ వెంకటేశ్వర్ సీరియస్ అయ్యారు. బుధవారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనంపై స్పందించారు. 'వానెల్లూరు పంచాయతీ సర్వే నెంబర్ 197-1లోని అటవీ భూములకు పట్టాలు సృష్టించిన ఘటనపై వారం కిందటే క్షేత్రస్థాయి నివేదికలు నాకు అందాయి. వీటి ఆధారంగా అప్పటి ఎన్నికల విధులకు వచ్చిన తహసీల్దార్‌తో పాటు రెవెన్యూ సిబ్బంది, డేటా ఎంట్రీ ఆపరేటర్‌పై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని జేసీని ఆదేశించా. వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటాం' అని కలెక్టర్ చెప్పారు.

మాతృ మరణాలు నియంత్రించండి

● లేకుంటే చర్యలు తప్పవన్న కలెక్టర్
● సీఆర్ ఆస్పత్రికి రూ.3లక్షల జరిమానా

తిరుపతి(కలెక్టరేట్), అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): జిల్లాలో మాతృమరణాలను నివారించేందుకు వైద్యాధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదేశించారు. నిబంధనలు అతిక్రమించిన ఆస్పత్రులపై చర్యలు చేపడతామని హెచ్చరించారు. మాతృ మరణాలపై బుధవారం సాయంత్రం ఆయన కలెక్టరేట్‌లో సమీక్షించారు. చిల్లకూరు పీహెచ్‌సీ పరిధిలో ఇటీవల చోటు చేసుకున్న మాతృమరణాలపై చర్చించారు. గూడూరు సీఆర్‌రెడ్డి ఆస్పత్రిలో మాతృమరణంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆ ఆస్పత్రికి రూ.3లక్షలు జరిమానా విధించాలని డీఎంహెచ్‌వోను ఆదేశించారు. ఇకపై మాతృమరణాలు చోటుచేసుకుంటే ఆస్పత్రిని సీజ్ చేస్తామన్నారు. మాతృమరణాల ఘటనల్లో వైద్యులు, సిబ్బందిపైనా చర్యలు ఉంటాయన్నారు. డీఎంహెచ్‌వో బాలకృష్ణ నాయక్, డీఐవో శాంతకుమారి, ఇతర అధికారులు,ప్రైవేటు ఆస్పత్రి నిర్వాహకులు పాల్గొన్నారు.



● ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రుల్లో పారదర్శకత, సమయానుకూల వైద్యసేవలు అందకుంటే కఠిన చర్యలు ఉంటాయని జిల్లాస్థాయి క్రమశిక్షణా కమిటీ సమావేశంలో కలెక్టర్ వెంకటేశ్వర్ హెచ్చరించారు. సూపర్ జీఎస్టీ, సూపర్‌సేవింగ్స్‌పథకాలపై రోగులకు అవగాహన కల్పించాలన్నారు. జిల్లా సమన్వయ అధికారి రాజశేఖర్‌రెడ్డి, వివిధ ప్రైవేటు ఆస్పత్రుల ప్రతినిధులు పాల్గొన్నారు.

టీటీడీలో డిప్యూటీ ఈవోల బదిలీ

● శ్రీవారి ఆలయ డిప్యూటీ ఈవోగా హరీంద్రనాథ్

తిరుపతి, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): టీటీడీలో పలువురు డిప్యూటీ ఈవోలు బదిలీ అయ్యారు. శ్రీవారి ఆలయ డిప్యూటీ ఈవోగా పనిచేస్తున్న లోకనాథం తిరుపతిలో గోవిందరాజస్వామి ఆలయానికి బదిలీ కాగా ఆయన స్థానంలో హరీంద్రనాథ్ నియమితులయ్యారు. హెచ్ఆర్ డిప్యూటీ ఈవోగా భాస్కర్, తిరుచానూరు పద్మావతి అమ్మవారి ఆలయ డిప్యూటీ ఈవోగా శాంతి నియమితులయ్యారు. కొండపై ఆర్1 డిప్యూటీ ఈవోగా నియమితులైన రాజేంద్ర ఆర్2కు కూడా ఇంచార్జిగా వ్యవహరించనున్నారు. తిరుమలలో అన్నదానం డిప్యూటీ ఈవోగా సెల్వం నియమితులు కాగా తిరుపతిలో అన్నదానం డిప్యూటీ ఈవోగా వెంకటయ్య నియమితులయ్యారు.కల్యాణకట్ట డిప్యూటీ ఈవోగా నియమితులైన గోవిందరాజన్ డోనార్ సెల్‌కు ఇంచార్జిగా వ్యవహరించనున్నారు.ఈ మేరకు టీటీడీలో బుధవారం బదిలీలకు సంబంధించిన ఉత్తర్వులు జారీ అయ్యాయి.

ఎస్వీయూ వీసీగా నరసింగరావు

● నానో టెక్నాలజీ శాస్త్రవేత్తకు అవకాశం



తిరుపతి (విశ్వవిద్యాలయాలు),అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): ఎస్వీయూనివర్సిటీ నూతన ఉపకులపతిగా ప్రొఫెసర్ టాటా నరసింగరావు నియమితులయ్యారు. హైదరాబాదు ఐఐటీ రీసెర్చ్ అడ్వైజర్, అడ్జంక్ట్ ప్రొఫెసర్ అయిన నరసింగరావు గురువారం కొత్త పదవీ బాధ్యతలు స్వీకరించనున్నారు.మూడేళ్ళ పాటు వీసీగా కొనసాగనున్న నరసింగరావు నానో టెక్నాలజీలో గొప్ప శాస్త్రవేత్తగా అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపుపొందారు.1994లో కాశీలోని బెనారస్ హిందూ యూనివర్సిటీలోని కెమిస్ట్రీ విభాగంలో పీహెచ్‌డీ పూర్తి చేసిన ఈయన మద్రాసు ఐఐటీలో రీసెర్చ్ అసోసియేట్‌గా పని చేశారు. టోక్యో యూనివర్సిటీలో 1996లో పోస్టు డాక్టోరల్ ఫెలోగా వ్యవహరించారు. 2001లో టోక్యో వర్సిటీలో అధ్యాపకులుగా చేరారు. హైదరాబాదులోని ఇంటర్నేషనల్ అడ్వాన్స్ రీసెర్చ్ సెంటర్‌లో సీనియర్ సైంటిస్టుగా 2003లో చేరి ఇదే కేంద్రానికి డైరెక్టర్‌గానూ సేవలందించారు. హైదరాబాదు ఐఐటీలో అడ్జంక్ట్ ప్రొఫెసర్‌గా పని చేశారు. ఎలక్ట్రో కెమిస్ట్రీ, నానో మెటీరియల్స్ రంగంలో నరసింగరావు పరిశోధనలు మంచి గుర్తింపు పొందాయి. వ్యక్తిగతంగానూ, బృందాలతోనూ పరిశోధనలు చేపట్టిన ఈయన విశేష ఆవిష్కరణలు చేశారు. కరోనా సమయంలో క్రిమి సంహారక మాస్కులను రూపొందించడంలో కృషి చేశారు. అధిక ఉష్ణోగ్రతలకు తట్టుకునే బ్యాటరీల తయారీకి ఈయన పరిశోధనలు తోడ్పడ్డాయి.2009లో మెటీరియల్ రీసెర్చ్ సొసైటీ ఆఫ్ ఇండియా అవార్డు, 2014లో టోక్యో యూనివర్సిటీ ఆఫ్ సైన్స్ ప్రెసిడెంట్ అవార్డు, 2015లో అకాడమీషియన్ ఆఫ్ ఆసియా పసిఫిక్ అకాడమీ ఆఫ్ మెటీరియల్ సైన్స్ అవార్డు, 2016లో భారత రాష్ట్రపతి నుంచీ అవార్డు, 2017లో ఫెలో ఆఫ్ తెలంగాణ-ఆంధ్రప్రదేశ్ అకాడమీ ఆఫ్ సైన్సెస్ అవార్డు, 2022లో ఎంఆర్ఎస్ఐ మెటీరియల్ సైన్స్ వార్షిక బహుమతిని స్వీకరించారు.190 పరిశోధనా వ్యాసాలు రూపొందించారు.ఈయన పరిశోధనలకు 20 జాతీయ, అంతర్జాతీయ పేటెంట్లు లభించాయి.

ముక్కంటి ఆలయంలోకి నాగశిలలు

● మహద్వారం వరకు తీసుకొచ్చిన తమిళనాడు భక్తులు
● మరోసారి వెలుగు చూసిన భద్రతా వైఫల్యం

శ్రీకాళహస్తి, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలోకి భక్తులు నాగశిలలను తీసుకురావడంతో కలకలం రేగింది. ఆలయ భద్రతా వ్యవస్థ వైఫల్యంపై మరోసారి చర్చ జరిగింది. బుధవారం తమిళనాడుకు చెందిన ఇద్దరు భక్తులు రాతితో చేసిన రెండు నాగశిలలను ఒకటో గేటులో భద్రతావ్యవస్థ తనిఖీలను తప్పించుకుని ఆలయంలోకి ప్రవేశించారు. అంతే కాకుండా రూ.750 మండపంలో ఈ నాగశిలలను పెట్టి 11.40గంటల ప్రాంతంలో సర్పదోష నివారణ పూజ కూడా చేశారు. ఆ తర్వాత మహద్వారం వద్ద ఆలయంలోకి ప్రవేశించే క్రమంలో హోంగార్డులు గుర్తించి నాగశిలలను స్వాధీనం చేసుకున్నారు. ఒకటో గేటు, రాహుకేతు పూజా మండపాల వద్ద భద్రతా వ్యవస్థ వైఫల్యంపై ఆలయ అధికారులు ఉలిక్కిపడ్డారు. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక ఆలయ భద్రతా వ్యవస్థను పటిష్టం చేశారు. కానీ ఇటీవల సిబ్బందిని మళ్లీ నిర్లక్ష్యపు నీడలు ఆవహిస్తున్నాయన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

● వైసీపీ హయాంలో నాలుగేళ్ల క్రితం ముక్కంటి ఆలయ భద్రతా వైఫల్యం కారణంగా గుర్తుతెలియని భక్తులు శివలింగం, నంది ప్రతిమలను ఆలయంలో పల అనధికారికంగా ప్రతిష్ఠించారు. దీనిపై విచారించి శివలింగం, నంది ప్రతిమలను ఆలయంలోకి తీసుకొచ్చిన తమిళనాడు భక్తులపై అప్పట్లో కేసు నమోదు చేశారు.

● రెండేళ్ల క్రితం 8వతరగతి విద్యార్థి రాత్రి ఆలయంలో ఉండగానే.. భద్రతాధికారులు తాళం వేశారు. రాత్రంతా ఆ విద్యార్థి ఆలయంలో సంచరించడమే కాకుండా భద్రతా సిబ్బందికి చిక్కకుండా దర్జాగా మూడవ గోపురం వద్ద ప్రహరీ దిగి వెళ్లిపోయారు.



ముక్కంటి ఆలయంలో పట్టుబడ్డ నాగశిల



వర్షంతో విమానంలోనే ప్రయాణికులు

బుధవారం మధ్యాహ్నం ఒంటిగంట. ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం. అదే సమయంలో కోలాపూర్ నుంచి స్టార్ ఎయిర్ విమానం వచ్చింది. వర్షంతో విమానాన్ని టర్మినల్ బిల్డింగ్ సమీపంలో రన్‌వేపై ఆపేశారు. 15 నిమిషాల తర్వాత వర్షం తగ్గడంతో ప్రయాణికులు విమానం నుంచి బయటకు వచ్చారు.

- రేణిగుంట, ఆంధ్రజ్యోతి

మేలుకో మహాశయా


అలా కుర్చీలో కునుకు తీశారా అధికారి. ఆయన్ను నిద్రలేపే సాహసం చేయలేకపోయారు సిబ్బంది. ఆయన తో పనుండి వచ్చిన వారూ ఎదురుగా కుర్చీల్లో కూర్చున్నారు. సార్.. ఎప్పుడు నిద్రలేస్తారోనని నిరీక్షిస్తున్నారు. ఇదీ నిత్యం రద్దీగా ఉండే రేణిగుంట సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో బుధవారం నాటి చిత్రం. ఇన్‌చార్జి సబ్ రిజిస్ట్రారు ఆనంద్‌రెడ్డి ఇలా కునుకుతీస్తూ కనిపించారు. ఆయన సంతకం కోసం పలువురు వేచి ఉన్నారు. ఇక్కడ రద్దీలో ఏ పని జరగాలన్నా కొంత ఆలస్యం సహజం. కానీ ఇలా ఇన్‌చార్జి సబ్‌రిజిస్ట్రారు వ్యవహారంతో సిబ్బందీ ఉదాసీనంగా ఉంటున్నారు.

- రేణిగుంట, ఆంధ్రజ్యోతి




నారా రోహిత్


అషురెడ్డి, పవిత్ర


కోనా వెంకట్

శ్రీవారి సేవలో ప్రముఖులు

తిరుమల శ్రీవారిని బుధవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వీరిలో సినీహీరో నారా రోహిత్, నటులు అషురెడ్డి, పవిత్ర, మాటల రచయిత కోనా వెంకట్, సీనియర్ ఐఏఎస్ అధికారి పంకజ్ కుమార్ బన్సల్, ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి ఉన్నారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

సత్యాత్మతీర్థ స్వామిజీకి తిరుమలలో పెద్దమర్యాద



తిరుమల, అక్టోబరు8 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాదిమఠాధిపతి సత్యాత్మతీర్థ స్వామిజీ బుధవారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. ఉదయం నైవేద్య విరామ సమయంలో అఖిలాండం వద్ద స్వామిజీకి టీటీడీ ఈవో అనిల్‌కుమార్ సింఘాల్, అర్చక బృందం ఇస్తికాఫల్(పెద్ద మర్యాద) స్వాగతం పలికారు. ఆలయం నుంచి పల్లకీలో తీసుకెళ్లిన శఠగోపంతో ఆశీర్వాదం అందించారు. అనంతరం ఆయన తన శిష్యబృందంతో కలిసి మంగళవాయిద్యాల నడుమ ఆలయంలోకి వెళ్లి శ్రీవారిని దర్శించుకున్నారు.

సర్వదర్శనానికి 14 గంటలు



తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 14 గంటల సమయం పడుతోంది. బుధవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 31 కంపార్టుమెంట్లు, నారాయణగిరిలోని 9 షెడ్లు సర్వదర్శన భక్తులతో నిండిపోయాయి. క్యూలైన్ శిలాతోరణం సర్కిల్ వరకు వ్యాపించింది. వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 6 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

సోమవారం హుండీ ఆదాయం: రూ.4.74 కోట్లు

మంగళవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 71,634

తలనీలాలు సమర్పించినవారు: 24,980

వెంకటేశ్వరస్వామి ఆలయంపై పిడుగుపాటు


దెబ్బతిన్న ఆలయ గోపుర శిఖర భాగం - పగిలి కిందపడిన దేవతామూర్తుల భాగాలు

సూళ్లూరుపేట,అక్టోబరు8(ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట మండలంలోని మంగళంపాడు వెంకటేశ్వరస్వామి ఆలయ గోపురంపై బుధవారం సాయంత్రం పిడుగు పడింది. 4 గంటల సమయంలో భారీ వర్షంతో పాటు పెద్ద శబ్దంతో పిడుగు పడడంతో ఆలయ గోపురంపై ఉన్న శిలలు దెబ్బతిన్నాయి. అలాగే గోపురంపై ఉన్న దేవతామూర్తుల భాగాలు పగిలి కింద పడ్డాయి. అదే సమయంలో ఆలయ వరండాలో ఉన్న కొందరు గ్రామస్తులు భయంతో పరుగులు తీశారు. కాసేపటికి తేరుకున్న గ్రామస్తులు పిడుగు పడిన ప్రదేశాన్ని పరిశీలించారు.

‘తుడా టవర్స్’సేల్‌పై కమిటీ

- రెసిడెన్షియల్ ఫ్లాట్ల ధరలు సవరణకు కసరత్తు
- ఒక్కోఫ్లాట్‌పై రూ.5లక్షల నుంచి రూ.10 లక్షల వరకు తగ్గే అవకాశం
- మంత్రి గ్రీన్ సిగ్నల్

తిరుపతి, ఆంధ్రజ్యోతి



తిరుపతి పట్టణాభివృద్ధి సంస్థ (తుడా) అన్నమయ్య సర్కిల్లో నిర్మిస్తున్న ఐకానిక్ టవర్స్‌లో రెసిడెన్షియల్ ఫ్లాట్ల ధరలు తగ్గనున్నాయి. అధిక ధరల వలన విక్రయాలు మందకొడిగా సాగుతుండడంతో కమిటీని ఏర్పాటుచేసేందుకు తుడా సిద్ధమైంది. 206 రెసిడెన్షియల్ ఫ్లాట్లలో ఇప్పటికి 21మాత్రమే అమ్ముడయ్యాయి. చదరపు అడుగు ధర ఎక్కువగా ఉండడం వల్లే కొనుగోలుదారులు ముందుకురావడం లేదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఇటీవల పురపాలక శాఖ మంత్రి నారాయణ తుడా కార్యాలయంలో జరిగిన సమీక్షలో ఐకానిక్ టవర్స్ గురించి ఆరాతీశారు. స్థానికంగా ఉన్న అపార్ట్‌మెంట్ల ధరలను పరిశీలిస్తే, తుడా టవర్స్‌లోని రెసిడెన్షియల్ ఫ్లాట్ల చదరపు అడుగు ధర ఎక్కువగా ఉందన్న అభిప్రాయానికి వచ్చినట్టు తెలిసింది. దీనికోసం ఓ కమిటీని ఏర్పాటుచేసి ధరలను సవరించాలని తుడా వీసీ శుభం బన్సల్ మంత్రిని కోరారు. మంత్రి కూడా గ్రీన్ సిగ్నల్ ఇస్తూ త్వరలోనే ఆ ప్రక్రియ పూర్తిచేయాలని సూచించారు. ప్రస్తుతం రెసిడెన్షియల్ ధర చదరపు అడుగు రూ.5,900 గా ఉంది. దీనిని రూ.5,500లుగా సవరించే అవకాశం కనిపిస్తోంది. అంటే ఒక్కో ఫ్లాట్ ధర రూ.5లక్షల నుంచి రూ.10లక్షలు తగ్గించే అవకాశం కనిపిస్తోంది. అదేవిధంగా కమర్షియల్ స్పేస్ చదరపు అడుగు రూ.12వేలు ఉంది. 31 వాణిజ్య సముదాయాల్లో 11 సేల్ అయిపోయాయి. దీనికి మంచి డిమాండు ఉండడంతో వీటి ధరలో ఎలాంటి మార్పు ఉండకపోవచ్చు.

టవర్స్ తాజా పరిస్థితి

తుడా టవర్స్ 3.6 ఎకరాల్లో రూ.345 కోట్లతో నిర్మాణం జరుగుతోంది. ప్రస్తుతం రూ.122 కోట్ల విలువైన పనులు పూర్తయ్యాయి. 14 అంతస్తుల భవనంలో 12వ ఫ్లోర్ స్లాబ్ పూర్తయింది. 6వ ఫ్లోర్ వరకు టైల్స్ పనులు జరిగాయి. ఈ ప్రాజెక్టు ద్వారా నిర్మాణ వ్యయం కాకుండా తుడా రూ.150కోట్లు ఆదాయం లక్ష్యంగా పెట్టుకుంది. ఇప్పటికే రూ.91కోట్లు విక్రయాల ద్వారా తుడా ఖాతాలోకి చేరాయి. మరో రూ.66 కోట్లు రావాల్సి ఉంది.

జూన్‌లో నిర్మాణం పూర్తి

గ్రౌండ్, ఒకటవ అంతస్తులో 27 విశాలమైన గదులతో వాణిజ్య సముదాయాలు, రెండు, మూడు, నాలుగు అంతస్థుల్లో ఆఫీసుల వినియోగానికి, మిగిలిన వాటిలో 206 రెసిడెన్షియల్ ఫ్లాట్లను నిర్మిస్తున్నారు. కమర్షియల్, రెసిడెన్షియల్‌కు వేర్వేరుగా యాంపుల్ పార్కింగ్, లిఫ్టులు, వేర్వేరుగా మార్గాలు ఏర్పాటు చేస్తున్నారు. జూన్‌లోపు అందుబాటులోకి వస్తుందని తుడా కార్యదర్శి డాక్టర్ శ్రీకాంత్ చెప్పారు.

డ్రైవర్ ఆత్మహత్య

- ఎస్ఐ బెదిరింపులే కారణమని తల్లి ఆరోపణ


అనిల్ (ఫైల్‌ఫొటో)

కోట, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): కోట మండలం చిట్టేడు గ్రామానికి చెందిన నన్నిమేల అనిల్ (36) గడ్డి మందుతాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఓ రొయ్యల పరిశ్రమకు చెందిన కార్మికులను తీసుకెళ్లే బస్సు డ్రైవర్‌గా పనిచేస్తున్న అనిల్ పెద్దమొత్తంలో అప్పులు చేశాడు. రుణదాతల ఒత్తిళ్లు భరించలేక బుధవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో గడ్డి మందు తాగాడు. కుటుంబసభ్యులు గమనించి కోట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో గూడూరులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. ఇదిలా ఉండగా ఒక బాకీదారుడికి అప్పు చెల్లించాలని ఎస్ఐ పవన్‌కుమార్ బెదిరించడంతోనే తమ బిడ్డ ఆత్మహత్య చేసుకున్నాడని అనిల్ తల్లి ఉమామహేశ్వరి గూడూరు డీఎస్పీ గీతాకుమారికి ఫిర్యాదు చేశారు. ఎస్ఐపై వచ్చిన ఆరోపణలపై దర్యాప్తు చేస్తున్నామని వాకాడు సీఐ హుస్సేన్ బాషా తెలిపారు.

‘మార్పు’తోనే మనుగడ

- సహకార రంగం బలోపేతమే లక్ష్యం
- తిరుపతి సదస్సులో కేంద్ర సహకార మంత్రిత్వశాఖ కార్యదర్శి ఆశిష్‌కుమార్ భూటాని


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఆశిష్‌కుమార్ భూటాని

తిరుపతి(కలెక్టరేట్), అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): ‘ఏ రంగమైనా మార్పుతోనే మనుగడ సాధిస్తుంది. గ్లోబలైజేషన్, సాంకేతిక పరిణామాలకు అనుగుణంగా మలచుకోలేక అనేక సహకార సంస్థలు ప్రాధాన్యం కోల్పోయాయి. పాత విధానాలు కొనసాగిస్తూ, సభ్యులను ఆకర్షించలేకపోయాయి. దీనికి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలే నిదర్శనం. ఏపీలో మాత్రం పీఏసీఎస్‌లు ఇపుడు పెట్రోల్ బంకు వంటి కొత్త రంగాల్లో అడుగుపెట్టడం సంతోషకరం’ అని కేంద్ర సహకార మంత్రిత్వశాఖ కార్యదర్శి ఆశిష్‌కుమార్ భూటాని అన్నారు. ‘సహకార రంగం అభివృద్ధి- డిజిటలైజేషన్, గ్రెయిన్ స్టోరేజ్, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు విస్తరణ, కోఆపరేటివ్ బ్యాంకింగ్ బలపరిచే దిశగా’ అంశంపై రెండు రోజుల పాటు జరిగే జాతీయ సదస్సు బుధవారం తిరుపతి తాజ్‌హోటల్‌లో ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్రాల్లో సహకార రంగాన్ని బలోపేతం చేయడం, ఆర్థిక వృద్ధిని పెంపొందించడంపై ప్రత్యేక దృష్టిపెడుతున్నట్లు చెప్పారు. సహకార బ్యాంకింగ్ రంగంలో రాష్ట్రాల నుంచి మరింత లోతైన ఆలోచన రావాల్సిన అవసరం ఉందన్నారు. కొత్త రంగాల్లో తాము చేస్తున్న ప్రయత్నాలపైనా చర్చ జరుగుతోందన్నారు. సహకార ట్యాక్సీలు, బీమా రంగంలో రాష్ట్రాల భాగస్వామ్యంపైనా చర్చిస్తామన్నారు. రాష్ట్రాలలో సహకార విద్యావ్యవస్థను ఎలా అనుసంధానించాలో, పాఠశాలలు ఎలా స్థాపించాలనే దానిపై ప్రత్యేక దృష్టి పెడుతున్నట్లు వివరించారు. ఈ సదస్సులో మూడు నెలల కార్యాచరణపై ముఖ్యమైన అంశాలు ఉంటాయన్నారు.



ఇతర రంగాల్లోకి విస్తరిస్తాం

సహకార సంస్థలు కేవలం రైతుల రుణావసరాలను తీర్చడమే కాకుండా ఆరోగ్యసేవలు(జన ఔషధి కేంద్రాలు), ఆహార ప్రాసెసింగ్, డ్రోన్ ఆధారిత ఎరువుల పంపిణీతో పాటు ఇతర రంగాల్లోకి విస్తరిస్తాయని రాష్ట్ర సహకార కమిషనర్ ఎం.బాబు తెలిపారు. ఇలాంటి సదస్సులు సహకార రంగాన్ని మరింత బలోపేతం చేస్తాయన్నారు. సహకార సంఘం బలోపేతం, ఆర్థికవృద్ధిపై కేంద్ర సహకార మంత్రిత్వ శాఖ అదనపు కార్యదర్శులు పంకజ్‌కుమార్‌బన్సాల్, రవీంద్రకుమార్ అగర్వాల్, సంయుక్త కార్యదర్శులు ఆనందకుమార ఝా, రమణకుమార్ ప్రసంగించారు. వివిధ సహకారశాఖలు స్టాళ్లను ప్రదర్శించాయి. ఈ ఎగ్జిబిషన్‌లో సామాన్యులకు అందజేస్తున్న హార్డ్‌వేర్ కిట్, ఈఆర్పీ సాఫ్ట్‌వేర్ ప్రత్యక్ష డెమోను నిర్వహిస్తున్నారు. సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాలు జరిగాయి. ఆయా కార్యక్రమాల్లో కలెక్టర్ వెంకటేశ్వర్, జేసీ శుభం బన్సల్, అడిషనల్ రిజిస్ట్రార్లు ఆనందబాబు, గౌరీశంకర్, జాయింట్ రిజిస్ట్రార్లు శ్రీలక్ష్మి, చిత్తూరు, తిరుపతి డీసీవోలు లక్ష్మి, నాగవర్ధన, వివిధ రాష్ట్రాల సహకార సంఘాల కార్యదర్శులు, రిజిస్ట్రార్లు, నాబార్డు, ఎంపీడీసీ, సహకార సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

దేశ భవితను తీర్చిదిద్దడంలో ప్రభుత్వ వ్యవస్థ కీలకం

- డాక్టర్ జయప్రకాష్ నారాయణ వెల్లడి


ఐఐటీ విద్యార్థులు, అధ్యాపకులు, సిబ్బందితో జయప్రకాష్ నారాయణ

ఏర్పేడు, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): దేశ భవిష్యత్తును తీర్చిదిద్దడంలో ప్రభుత్వ వ్యవస్థ ఎంతో అవసరమని లోక్‌సత్తా వ్యవస్థాపకుడు, ప్రజా విధాన నిపుణుడు డాక్టర్ జయప్రకాష్ నారాయణ సూచించారు. ఏర్పేడు వద్దనున్న తిరుపతి ఐఐటీలో ‘ఇండియా: ది రోడ్ అహెడ్’ అంశంపై బుధవారం ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. దేశ భవిష్యత్తును తీర్చిదిద్దడంలో సమర్థ పాలన ప్రాధాన్యాన్ని వివరించారు. శాంతి, చట్టపరమైన వ్యవస్థ, విద్య, ఆరోగ్య సంరక్షణ వంటి మౌలిక వసతులు, సామూహిక అవసరాల గురించి విశదీకరించారు. భారత ప్రజాస్వామ్య ఆర్థిక అభివృద్ధిపై సంస్కరణలు చూపిన ప్రభావాన్ని వివరించారు. సమగ్ర సుస్థిర వృద్ధి ద్వారానే సమాజంలోని అసమానతలు తొలగించవచ్చని చెప్పారు. తిరుపతి ఐఐటీ డైరెక్టర్ కేఎన్ సత్యనారాయణ మాట్లాడుతూ తిరుపతి ఐఐటీ సాధించిన ప్రగతి, చేపట్టిన చర్యలు, ఇప్పటి వరకు ఐఐటీ అందుకున్న అవార్డుల గురించి తెలిపారు. లెక్చర్ సిరీస్ అనంతరం విద్యార్థులు, అధ్యాపకులు, ఐఐటీ సిబ్బంది డాక్టర్ జయప్రకాష్ నారాయణతో ‘పాలన ప్రజా విధానాల సవాళ్లు, యువత పాత్ర’ వంటి అంశాలపై ముఖాముఖిగా మాట్లాడారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

బ్లైండ్ స్కేటర్‌కు ఆర్థికసాయం


హర్షవర్ధన్‌కు ఆర్థికసాయం అందిస్తున్న దాతలు

[ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్]

తిరుపతి (క్రీడలు), అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): తిరుపతికి చెందిన బ్లైండ్ స్కేటర్ హర్షవర్ధన్‌కు రూ.25 వేల సాయం అందింది. కళ్లు కనిపించకున్నా ఆ చిన్నారి స్కేటింగ్‌లో రాణిస్తున్న విషయమై సోమవారం ఆంధ్రజ్యోతిలో ‘చూపులేకున్నా తగ్గేదే లే’ శీర్షికన ప్రత్యేక కథనం ప్రచురితమైంది. దీనిపై స్పందించిన సూళ్లూరుపేటకు చెందిన ఆచార్య భరద్వాజ సేవా సంస్థ ప్రతినిధులు బుధవారం హర్షవర్ధన్ ఇంటికెళ్లి తల్లి రాజకుమారి, అన్న మునిచరణ్, కోచ్ ప్రతాప్ సమక్షంలో రూ.25వేల నగదు అందించారు. కోచ్ ప్రతాప్‌ను సన్మానించారు. ప్రపంచ రికార్డును కైవసం చేసుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సేవాసంస్థ ప్రతినిధులు ఎం.చంద్రబాబు, ఎ.అశోక్‌కుమార్, వి.రత్నబాబు, ఎ.భాస్కరరావు, ఎం.శ్రీనివాసులు, వి.సాయినాథ్ పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించకుంటే సమ్మె తప్పదు

- 13న ఛలో విజయవాడ
- డిస్కం కార్పొరేట్ కార్యాలయం వద్ద ధర్నా



తిరుపతి(ఆటోనగర్), అక్టోబరు8 (ఆంధ్రజ్యోతి): ‘సదరన్ డిస్కంలో పెండింగ్ సమస్యలు, కాంట్రాక్టు కార్మికులు,గ్రేడ్-2 జేఎల్‌ఎంలను రెగ్యులర్ చేయాలని జేఏసీ అధ్వర్యంలో దశలవారీ ఆందోళనలు చేస్తున్నాం. అయినా యాజమాన్యం, ప్రభుత్వం స్పందించలేదు. కమిటీలతో కాలయాపన తప్ప ఫలితం ఉండదు. 13న ఛలో విజయవాడ కార్యక్రమాన్ని నిర్వహిస్తాం. అప్పటికీ సమస్యలు పరిష్కారం కాకుంటే 15వ తేది నుంచి నిరవధిక సమ్మె తప్పదు’ అని పవర్ జేఏసీ నాయకులు హెచ్చరించారు. తిరుపతి సదరన్ డిస్కం కార్యాలయం ఎదుట బుధవారం జేఏసీ అధ్వర్యంలో మహా ధర్నా జరిగింది. జేఏసీ నాయకులు వి.దేవేంద్ర రెడ్డి, ఆర్.మురళీధర్, నాగరాజు, ఎల్.చలపతి, నాగార్జున, కృష్ణయ్య, బాలశౌరి, జయరామ్ మాట్లాడుతూ 26 ఏళ్లుగా పనిచేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వడం లేదన్నారు. ఉద్యోగులకు 4 డీఏలు చెల్లించలేదన్నారు. ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. ఈపీఎఫ్‌ను రద్దు చేసి జీపీఎఫ్‌ను అమలు చేయాలన్నారు. గ్రేడ్-2 జేఎల్‌ఎంలను రెగ్యులర్ చేసి, వారి సమస్యలు పరిష్కరించాలన్నారు. యాజమాన్యం జేఏసీ నేతలతో చర్చించకుండా, బలంలేని టీఎస్‌టీయూసీ నాయకులను ఆహ్వానించడం ఏమిటని ప్రశ్నించారు. కాంట్రాక్టు కార్మికులతో రెగ్యులర్ విధులు చేయిస్తూ స్టైఫండ్ ఎన్నేళ్లు ఇస్తారని ప్రశ్నించారు. ఈ ధర్నాలో నాయకులు రామలింగారెడ్డి, సంజీవరావు, తిరుపాలు, జయమణి, సతీష్, పృథ్వీరాజ్, ఆంజనేయులు, వి.గోపి, జి.ఏలుమలై, సుధాకర్, శంకర్, రాజేంద్రప్రసాద్ ప్రసంగించారు. ఈ ఆందోళనలో ఉమ్మడి ఏడు జిల్లాల నుంచి విద్యుత్ ఉద్యోగులు, అవుట్ సోర్సింగ్, కాంట్రాక్టు కార్మికులు పాల్గొన్నారు.


ధర్నాలో పాల్గొన్న కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ సంఘం నాయకులు

పశువైద్య రంగంలో ‘బేసిక్ సైన్స్’ పరిశోధనలు అవసరం

వెటర్నరీ వర్సిటీ జాతీయ సదస్సులో డాక్టర్ తిలగర్

తిరుపతిరూరల్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): పశువైద్య రంగంలో బేసిక్ సైన్స్‌తో సంబంధమైన పరిశోధనల రూపకల్పన ఎంతో అవసరమని తమిళనాడు పశువైద్య వర్సిటీ మాజీ వీసీ ప్రొఫెసర్ డాక్టర్ ఎస్.తిలగర్ పేర్కొన్నారు. ఎస్వీవెటర్నరీ కళాశాలలో పశువైద్య చికిత్స బోధన సముదాయ(వీసీసీ)విభాగ ఆధ్వర్యంలో ‘నేషనల్ క్లినికల్ కేస్ కాన్ఫరెన్స్ ఫర్ వెటర్నరీ స్టూడెంట్స్’ అంశంపై బుధవారం నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడారు. నైపుణ్యాలతోపాటు పశుచికిత్స, శస్త్రచికిత్సలకు సంబంధించిన ఆధునిక పశువిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలని సూచించారు. పశువ్యాధులు, వైద్యంలో స్పెషలైజేషన్లు చాలా అవసరమని, ఈదిశగా పీజీ, పీహెచ్‌డీ విద్యార్థులు ప్రత్యేక దృష్టిసారించాలన్నారు. శస్త్రచికిత్స, డయాగ్నోసిస్, వ్యాధినిర్ధారణ విభాగాల ప్రాముఖ్యతని ఇండియన్ సొసైటీ ఫర్ అడ్వాన్స్‌మెంట్ ఆఫ్ కెనైన్ ప్రాక్టీస్ అధ్యక్షుడు ప్రొఫెసర్ ప్రతాబన్ విశదీకరించారు. పశువైద్య రంగంలో కృత్రిమమేధ ఎంతో కీలకంగా మారిందని వర్సిటీ వీసీ ప్రొఫెసర్ జేవీ రమణ పేర్కొన్నారు. వీసీసీ ఆధ్వర్యంలో ఆధునిక పద్ధతుల్లో పశువైద్యసేవలు అందిస్తున్నామన్నారు. ఆప్తమాలజీ సేవలను పశువైద్యచికిత్స బోధనావిభాగంలో ఆధునిక పద్ధతుల్లో సమకూర్చాలని డీన్ ప్రొఫెసర్ కె.వీరబ్రహ్మయ్య వీసీని కోరారు. ఆయా అంశాలపై విద్యార్థులు అధ్యయనం చేయాలని అసోసియేట్ డీన్ ప్రొఫెసర్ డాక్టర్ జగపతిరామయ్య సూచించారు. పశువ్యాధులను ప్రారంభదశలో నిర్ధారించడం ద్వారా మెరుగైన వైద్యసేవలు అందించవచ్చని సదస్సు ఆర్గనైజింగ్ సెక్రటరీ ప్రొఫెసర్ డాక్టర్ వి.వైకుంఠరావు అన్నారు. ఈ సదస్సుకు 14 రాష్ట్రాల నుంచి 25 వెటర్నరీ కళాశాలలకు చెందిన 250మంది విద్యార్థులు హాజరయ్యారు. పలువురు విద్యార్థులు పేపర్ ప్రజంటేషన్ చేశారు. ప్రొఫెసర్లు ఎం.రఘునాథ్, ఎస్.ధనలక్ష్మి, ఎస్.భారతి, డాక్టర్ నస్రీన్ తదితరులు పాల్గొన్నారు.


జాతీయ సదస్సు బుక్‌లెట్‌ని ఆవిష్కరిస్తున్న డాక్టర్ తిలగర్, డాక్టర్ జేవీరమణ, ప్రతాబన్ తదితరులు

ముక్కంటి హుండీ ఆదాయం రూ.2.18 కోట్లు



శ్రీకాళహస్తి, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయ హుండీ ఆదాయం రూ.2,18,65,233 సమకూరినట్లు ఈవో బాపిరెడ్డి తెలిపారు. బుధవారం ఆలయం ఆవరణలోని కొట్టు మండపంలో హుండీ లెక్కింపు చేపట్టారు. ప్రధాన హుండీలతోపాటు పరివార దేవతల వద్ద ఉన్న హుండీల నుంచి 134 గ్రాముల బంగారం, 698.500 కిలోల వెండి, 151 విదేశీ కరెన్సీ 151 వచ్చింది. ఆగస్టు 30వ తేదీ నుంచి వచ్చిన కానుకలు లెక్కించగా ఈ ఆదాయం సమకూరింది. కార్యక్రమంలో ఆలయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరి దుర్మరణం

- మృతులది పళ్లిపట్టు సమీపం

పుత్తూరు అర్బన్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): పుత్తూరు జాతీయ రహదారిలో బుధవారం మధ్యాహ్నం 3.20 గంటలకు జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు దుర్మరణం చెందారు. తిరుమల శ్రీవారిని దర్శించుకుని ద్విచక్ర వాహనంలో ఇంటికి వెళుతుండగా.. వెనకనుంచి గుర్తు తెలియని వాహనం ఢీకొన్నట్లు ప్రత్యక్ష సాక్షులు చెబుతున్నారు. ఈ ఘటనలో అక్కడికక్కడే వీరిద్దరూ మృతిచెందారు. మృతులు.. తిరవళ్లూరు జిల్లా పళ్లిపట్టు తాలూకా పొతట్టూరుపట్టి గ్రామానికి చెందిన బి.వి.సుబ్రమణ్యం(53), మూర్తి గురునాథం (60)గా పోలీసులు గుర్తించారు. ప్రమాదానికి కారణమైన వాహనం కోసం పోలీసులు గాలిస్తున్నారు. మృతుల కుటుంబాలకు సమాచారం ఇచ్చిన ఎస్ఐ ఓబయ్య కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాలను పుత్తూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.




రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన బి.వి.సుబ్రమణ్యం, మూర్తి గురునాథం

గూడూరు
సూళ్లూరుపేట/వెంకటగిరి

వన్యప్రాణుల సంరక్షణకు సహకరించాలి


విద్యార్థులతో డీఎఫ్‌వో హారిక, అటవీశాఖ సిబ్బంది

సూళ్లూరుపేట, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): పర్యావరణంతో పాటు వన్యప్రాణుల సంరక్షణకు అందరూ సహకరించాలని డీఎఫ్‌వో హారిక అన్నారు. బుధవారం మండల పరిధిలోని అట్టకానితిప్ప పర్యావరణ విజ్ఞాన కేంద్రంలో వన్యప్రాణి వారోత్సవాల ముగింపు సందర్భంగా విద్యార్థులకు అవగాహన కల్పించారు. 5 పాఠశాలల నుంచి 60 మందికి పైగా విద్యార్థులు పాల్గొనగా, వారికి వ్యాసరచన, చిత్రలేఖనం, క్విజ్ పోటీలు నిర్వహించారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఫారెస్ట్ రేంజ్ అధికారి రమణయ్య, అటవీశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

ముత్యాలమ్మ ఆలయ పాలకమండలి నియామకం

చిల్లకూరు, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని తూర్పుకనుపూరు గ్రామంలో వెలసిన ముత్యాలమ్మ ఆలయానికి పాలకమండలిని నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. చిల్లకూరు దశరధ రామిరెడ్డి, ఆనిమెళ్ల సుబ్రహ్మణ్యం, వినుకొండ సుబ్రహ్మణ్యం, తూపిలి పద్మమ్మ, దువ్వూరు అనిత, అన్నం మునిశేఖర్‌గౌడ్, మేకల కమల, ఒబ్బాయి ఉమామహేశ్వరి, పొక్కలి శ్రీలక్ష్మి, సారంగం రమేష్‌లను పాలక మండలి సభ్యులుగా నియమించారు. ఛైర్మన్‌గా చిల్లకూరు దశరధరామిరెడ్డి నియమిలయ్యే అవకాశం ఉంది.

ఎన్‌బీకేఆర్‌లో ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్‌పై సదస్సు

కోట, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని విద్యానగర్ ఎన్‌బీకేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో నీడీ సెల్ విభాగం ఆధ్వర్యంలో ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్‌పై బుధవారం మెకానికల్ విద్యార్థులకు అవగాహన సదస్సు జరిగింది. కళాశాల డైరెక్టర్ డాక్టర్ విజయకుమార్‌రెడ్డి సదస్సును ప్రారంభించారు. నాయుడుపేట మండలం మేనకూరులోని మూవటెక్ టైటానియం ప్రాసెస్ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ సత్యనారాయణ పాల్గొని విద్యార్థులు అన్ని రంగాల్లో నైపుణ్యం సాధించేందుకు కావాల్సిన అంశాలను వివరించారు. కొత్త ఆలోచనలు, వాటిని అమలు చేసే విధి విధానాలపై సూచనలను ఇచ్చారు. డైరెక్టర్ విజయకుమార్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు భవిష్యత్తులో పారిశ్రామికవేత్తలుగా ఎదిగేందుకు అనుకూలమైన అంశాలను తెలియజేశారు. కార్యక్రమంలో కో ఆర్డినేటర్ డాక్టర్ శ్రీహరిరెడ్డి, మెకానికల్ విభాగ కోఆర్డినేటర్ మనోహర్‌బాబు, అధ్యాపకులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం


విజేత జట్టుకు ట్రోఫీని అందజేస్తున్న ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్

చిల్లకూరు, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): క్రీడల ద్వారా మానసిక ఉల్లాసంగా ఉంటారని ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ అన్నారు. బుధవారం మండలంలోని లింగవరం గ్రామంలో నిర్వహించిన జిల్లాస్థాయి వాలీబాల్ పోటీల్లో గెలుపొందిన లింగవరం జట్టుకు ట్రోఫీ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడతూ క్రీడల సాధన వల్ల ఆరోగ్యంగా ఉండవచ్చన్నారు. కార్యక్రమంలో దువ్వూరు రాజశేఖర్‌రెడ్డి, సతీష్‌యాదవ్, గుండాల లీలావతి, అన్నం మునిశేఖర్‌గౌడ్, మూగ శంకరయ్య, సాయి తదితరులు పాల్గొన్నారు.

జన్ని రమణయ్యకు ఎమ్మెల్యే కురుగొండ్ల పరామర్శ


రమణయ్యతో ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ తదితరులు

డక్కిలి, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): టీడీపీ రాష్ట్ర కార్యదర్శి, వెంకటగిరి నియోజకవర్గ పరిశీలకుడు జన్ని రమణయ్యను బుధవారం ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ పరామర్శించారు. జన్ని రమణయ్య తల్లి పిచ్చమ్మ అంత్యక్రియలు బుధవారం నెల్లూరులో జరిగాయి. ఈ కార్యక్రమానికి హాజరైన రామకృష్ణ ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రమణయ్య కుటుంబ సభ్యులను పరామర్శించారు. అలాగే వెంకటగిరి ఏఎంసీ మాజీ ఛైర్మన్ పులికొల్లు రాజేశ్వరరావు, తెలుగుయువత రాష్ట్ర కార్యదర్శి కేవీకే ప్రసాద్ నాయుడు, డక్కిలి, వెంకటగిరి, బాలాయపల్లి మండలాల టీడీపీ అధ్యక్షులు పోలంరెడ్డి కోటేశ్వరరెడ్డి, పప్పు చంద్రమౌళి రెడ్డి, అవ్వారు సత్యనారాయణ, రావి సత్యం, లింగసముద్రం, మోపూరు సింగిల్ విండోల అధ్యక్షులు రాజా, జనార్దనరెడ్డి తదితరులు పిచ్చమ్మ చిత్రపటానికి నివాళులర్పించారు.

ముఖ్యమంత్రి చంద్రబాబుకు స్థానిక ఎన్నికలు నిర్వహించే ధైర్యం లేదు: నేదురుమల్లి


మీడియాతో మాట్లాడుతున్న నేదురుమల్లి రాంకుమార్ రెడ్డి

వెంకటగిరి టౌన్, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థలు నిర్వహించే ధైర్యం సీఎం చంద్రబాబుకు లేదని వెంకటగిరి నియోజకవర్గ వైసీపీ సమన్వయకర్త నేదురుమల్లి రాంకుమార్‌రెడ్డి అన్నారు. బుధవారం తన నివాసంలో ఆయన మాట్లాడుతూ మూడన్నరేళ్లుగా ఖాళీగా ఉన్న వెంకటగిరి జడ్పీటీసీ స్థానానికి ఎన్నికలు నిర్వహించకుండా ఒంటిమిట్ట, పులివెందుల స్థానాలకు మాత్రమే ఎన్నికలు నిర్వహించడం స్థానిక సంస్థల ఎన్నికలపై చంద్రబాబు వైఖరికి నిదర్శనమన్నారు. కూటమి ప్రభుత్వంలో విద్యావ్యవస్థ నిర్వీర్యం అయిందని, ఏడు త్రై మాసికాలకు సంబంధించిన ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధుల ఊసేలేదన్నారు. మహిళలకు ప్రతి నెలా రూ.1500, నిరుద్యోగ భృతి రూ.3వేలు, హామీలు అమలు చేయలేదన్నారు. ఇక వెంకటగిరిలో నామినేటెడ్ పదవులు అమ్ముకున్నారని విమర్శించారు. కార్యక్రమంలో వైసీపీ పట్టణ కన్వీనర్ పులి ప్రసాద్‌రెడ్డి, నక్కా వెంకటేశ్వరరావు, కౌన్సిలర్లు రాధ, శంకరయ్య, బాలయ్య, రాజారెడ్డి, శ్రీనివాసులు రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టపాకాయల విక్రయంపై విచారణ చేపట్టాలి

తిరుపతి(జీవకోన), అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): టీటీడీ ముసుగులో టపాకాయల విక్రయంపై విజిలెన్స్ విచారణ చేపట్టాలని తిరుపతికి చెందిన శ్రీవారి భక్తుడు కిరణ్‌కుమార్ డిమాండ్ చేశారు. బుధవారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ 20 ఏళ్లుగా కో-ఆపరేటివ్ సొసైటీ పేరుతో రెండు టపాకాయల దుకాణాలను ఐదుగురు ఉద్యోగులు కలిసి నిర్వహిస్తున్నారని, అయితే ఉద్యోగులకు ఏ మాత్రమూ తక్కువ రేట్లకు ఇవ్వడం లేదని ఆరోపించారు. కో-ఆపరేటివ్ సొసైటీ పేరుతో టీటీడీ ముసుగులో జరుగుతున్న ఈ దోపిడీని అడ్డుకోవాలని కోరారు. జీఎస్టీ ఎవరి పేరుతో ఉంది. ఏ ఖాతాకు డబ్బు జమ అవుతోందన్న విషయాలు తేలాల్సి ఉందన్నారు. ఈ సమావేశంలో నాగులు, సురేష్‌నాయక్ పాల్గొన్నారు.

నేడు పంచాయతీల విభజనకు గ్రామసభలు

బాలాయపల్లి, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని నిడిగల్లు, వెంగమాంబపురం పంచాయతీల విభజనకు గురువారం ఉదయం 11 గంటలకు గ్రామసభలు నిర్వహించనున్నట్లు ఆ పంచాయతీల కార్యదర్శులు మోహన్‌రాజు, దయాకర్ తెలిపారు. నిడిగల్లు పంచాయతీ నుంచి గాజులపల్లి, వెంగమాంబపురం పంచాయతీ నుంచి అక్కసముద్రం గ్రామాన్ని విభజించే విషయమై ప్రజలు తమ అభిప్రాయాలను తెలియజేయాలని కోరారు.

షార్‌లో విద్యార్థుల సందడి

సూళ్లూరుపేట, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ అంతరిక్ష వారోత్సవాల్లో భాగంగా విద్యార్థులకు సతీష్ ధావన్ అంతరిక్ష కేంద్రం షార్‌ను సందర్శించే అవకాశం కల్పించారు. బుధవారం జిల్లా నలు మూలల నుంచి విద్యార్థులు షార్‌కు విచ్చేశారు. ప్రయోగ వేదికలతో పాటు, మిషన్ కంట్రోల్ సెంటర్, శ్రీహరికోటలో ఉన్న స్పేస్ మ్యూజియాన్ని విద్యార్థులు తిలకించారు. షార్ నుంచి ప్రయోగించిన రాకెట్లు, అంతరిక్షంలోకి పంపిన ఉపగ్రహాల గురించి షార్ ఉద్యోగులు విద్యార్థులకు వివరించారు.

హెచ్‌ఐవీపై అవగాహన

నాయుడుపేట, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): హెచ్‌ఐవీపై అవగాహన కలిగి ఉండాలని నవజీవన్ ప్రాజెక్టు మేనేజర్ బాలాజీరాజు అన్నారు. బుధవారం నాయుడుపేట, తుమ్మూరు, తిమ్మాజికండ్రిగ, రైల్వేస్టేషన్ ప్రాంతాల్లో సమగ్ర ఆరోగ్య ప్రచార రథం ద్వారా హెచ్‌ఐవీ నివారణపై డాక్యుమెంటరీ ప్రదర్శించారు.



తెలుగుగంగ కాలువ నుంచి పైప్‌లైన్‌తో సాగునీరు తోడుకునే ప్రయత్నంలో రైతులు - చుక్కనీరు లేని ఆరిమేనిపాడు చెరువు

చెంతనే 'గంగ'... రైతులకు తీరని బెంగ

- ఎండిపోయిన ఆరిమేనిపాడు చెరువు
- సాగునీటికి కటకటలాడుతున్న రైతులు

ఓజిలి, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): చెరువు నుంచి పట్టుమని పర్లాంగు దూరం కూడా లేని తెలుగుగంగ 5వ బ్రాంచి కాలువ... ఎన్నో ఏళ్లుగా రైతులు గంగ నీటి ప్రవాహన్ని చూస్తూనే ఉన్నారు... ఆ నీరు ఎప్పుడు తమ చెరువుకు చేరుతుందో అంటూ మరోపక్క ఆవేదన... కేవలం వర్షాధారం మీదనే ఆధారపడిన రైతులకు ఆయకట్టు సాగు ప్రశ్నార్థకమవుతోంది. ఓజిలి మండలం ఆరిమేనిపాడు చెరువు కింద 215 ఎకరాల ఆయకట్టు ఉంది. గ్రామంలోని 125 మందికి పైగా రైతులకు ఈ ఆయకట్టు కింద భూములున్నాయి. అందరూ సన్న, చిన్నకారు రైతులే. ఆరిమేనిపాడు చెరువుకు దిగువన దక్షిణం వైపునుంచి తెలుగు గంగ 5వ బ్రాంచి కాలువ వెళుతోంది. అయితే ఈ చెరువుకు మాత్రం సాగునీరు అందే పరిస్థితి లేదు.

లిఫ్టు ద్వారా మాత్రమే సాధ్యం

గంగ కాలువ కంటే 30 అడుగులకు పైగా ఎత్తులో ఆరిమేనిపాడు చెరువు ఉంది. కేవలం గంగ కాలువ నుంచి లిఫ్టు ద్వారా మాత్రమే చెరువును నింపడం సాధ్యమవుతుంది. రైతులు గతంలో ప్రజాప్రతినిధులకు నీటి పారుదలశాఖ ఉన్నతాధికారులకు వినతిపత్రాలు కూడా ఇచ్చి సమస్యను వివరించారు. అయినా ఎవరూ పట్టించుకోలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏటా సాగునీటి తిప్పలు తప్పడంలేదని, కొన్ని పర్యాయాలు సరైన వర్షాలు పడక భూములను బీడుగా వదిలిపెడుతున్నామని వాపోతున్నారు. సమీపంలోనే తెలుగు గంగ ప్రవహిస్తున్నా.. ఆ నీటిని తమ చెరువుకు మళ్లించేందుకు అవకాశం లేకపోవడం దరదృష్టకరమని, ఆరిమేనిపాడు చెరువు ఆయకట్టు రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు దృష్టిపెట్టాలని సాగునీటి సంఘం అధ్యక్షుడు ముప్పాళ్ల అశోక్‌రాజు కోరుతున్నారు.

రైల్వే స్టేషన్లను పరిశీలించిన డీఆర్ఎం


సూళ్లూరుపేట రైల్వేస్టేషన్‌ను పరిశీలిస్తున్న డీఆర్ఎం శైలేంద్ర సింగ్

సూళ్లూరుపేట, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట రైల్వే స్టేషన్‌ను చెన్నై డీఆర్ఎం శైలేంద్ర సింగ్ బుధవారం పరిశీలించారు. స్వచ్ఛభారత్ కార్యక్రమంలో భాగంగా ఆయన అధికారులతో కలిసి ప్రజలను నుంచి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సూళ్లూరుపేట కచ్చేరివీధిలో ఉన్న రైల్వేగేటు వద్ద అండర్ బ్రిడ్జి లేనందున అవస్థలు పడుతున్నామని, సత్వరమే నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరారు. డీఆర్ఎం మాట్లాడుతూ రైల్వే అండర్ బ్రిడ్జి నిర్మాణానికి స్థల సమస్య ఉందని, స్థానికులతో పాటు రాష్ట్ర ప్రభుత్వ సహకారం కూడా అవసరమన్నారు. అమృత్ భారత్ పథకం కింద సూళ్లూరుపేట రైల్వేస్టేషన్‌ను అన్ని విధాలా అభివృద్ధి చేశామని, పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. అనంతరం ఆయన టికెట్ బుకింగ్ సెంటర్, ప్రయాణికుల విశ్రాంత భవాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో సీనియర్ ప్రొటక్షన్ మేనేజర్ చలం, హరికృష్ణ, భరత్, మురళి పాల్గొన్నారు.

నాయుడుపేట టౌన్: స్థానిక రైల్వేస్టేషన్‌ను డీఆర్ఎం శైలేంద్రసింగ్ తనిఖీ చేశారు. బుధవారం చెన్నై నుంచి ప్రత్యేక రైలులో నాయుడుపేటకు చేరుకున్న ఆయనకు స్టేషన్ మాస్టర్ చిరంజీవి, ఉద్యోగులు స్వాగతం పలికారు. రైల్వేస్టేషన్ సమీపంలోని ఎస్ఎస్ఆర్ కాలనీలో మూసివేసిన 78వ నెంబరు రైల్వే గేట్‌ను పునరుద్ధరించాలని ఆ కాలనీవాసులు గత వారంలో చెన్నై వెళ్లి డీఆర్ఎంకు వినతిపత్రం అందజేశారు. దీంతో బుధవారం ఆయన నాయుడుపేటకు వచ్చారు. రైల్వేస్టేషన్‌తో పాటు రైల్వే గేట్‌ను డీఆర్ఎం పరిశీలించారు. కాగా, పట్టణవాసులు, సీజనల్ వ్యాపారస్తులు, విద్యార్థులు రైల్వేస్టేషన్‌కు చేరుకొని పలు సమస్యలపై డీఆర్ఎంకు వినతిపత్రం అందజేశారు.

ప్రకృతితోనే మానవ మనుగడ


విద్యార్థికి బహుమతి అందజేస్తున్న ఎఫ్‌ఆర్‌వో సౌజన్య

దొరవారిసత్రం, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): ప్రకృతితో మానవ మనుగడ ముడిపడి ఉందని నేలపట్టు పక్షుల కేంద్రం ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్(ఎఫ్ఆర్‌వో) సౌజన్య అన్నారు. వన్యప్రాణి వారోత్సవాల్లో భాగంగా నేలపట్టు పక్షుల కేంద్రంలో ఏకొల్లు జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు నేచర్ క్యాంప్ నిర్వహించారు. ఎఫ్ఆర్‌వో మాట్లాడుతూ.. మనవాళికి ప్రకృతి విద్యార్థులు అనేక రకాలుగా ఉపయోగపడుతోందన్నారు. నేలపట్టులోని పక్షులు, చెట్ల గురించి విద్యార్థులకు వివరించారు. అనంతరం క్విజ్ పోటీలు నిర్వహించి ప్రతిభ చూపిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో అటవీశాఖ సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వృద్ధాశ్రమానికి నిత్యావసరాల అందజేత


వృద్ధాశ్రమానికి నిత్యావసరాలు అందజేస్తున్న విద్యార్థులు

గూడూరు, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): స్థానిక గమళ్లపాళెంలోని సాయిరాం వృద్ధాశ్రమానికి బుధవారం గాయత్రి పాఠశాల విద్యార్థులు నిత్యావసరాలను అందజేశారు. పాఠశాల కరస్పాండెంట్ శివకుమార్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల్లో సేవాభావాన్ని పెంపొందించాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించామన్నారు. కార్యక్రమంలో కళ్యాణి, సుప్రజ, రేవతి, రజిని తదితరులు పాల్గొన్నారు.

డివిజన్ స్థాయి స్కూల్‌గేమ్స్


గెలుపొందిన కబడ్డీ జట్టు

గూడూరు, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): స్థానిక జడ్పీబాలుర ఉన్నత పాఠశాలలో బుధవారం డివిజన్‌స్థాయి స్కూల్‌గేమ్స్ పోటీలు నిర్వహించారు. అండర్-14, అండర్-17 బాలుర కబడ్డీ పోటీల్లో చిట్టమూరు జట్టు విజేతగా నిలవగా, గూడూరు జట్టు రన్నర్‌గా నిలిచినట్లు వ్యాయామ ఉపాధ్యాయులు తెలిపారు. కార్యక్రమంలో కరిముల్లా, సుబ్రహ్మణ్యం, భాస్కర్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

న్యాయవాదుల నిరసన

వెంకటగిరి, అక్టోబర్ 8(ఆంధ్రజ్యోతి): భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్‌పై దాడిని నిరసిస్తూ వెంకటగిరి బార్ అసోసియేషన్ న్యాయ వాదులు బుధవారం విధులను బహిష్కరించి కోర్టు ఆవరణలో నిరసన తెలిపారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ రామ్‌ప్రసాద్, ఎంవీఎస్ గిరిజా కుమారి, సుజాత, వాసు, స్వప్న తదితరులు పాల్గొన్నారు.


కోర్టు ఆవరణలో నిరసన తెలుపుతున్న న్యాయవాదులు

గూడూరులో మోస్తరు వర్షం

గూడూరు అర్బన్, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): పట్టణంలో బుధవారం మోస్తరు వర్షం కురిసింది. ఉదయం 11:30 నుంచి గంటపాటు వర్షం పడింది. పట్టణంలోని పలు ప్రాంతాల్లో వర్షపునీరు రోడ్లపై ప్రవహించడంతో పాదచారులు, వాహనదారులు అవస్థలు పడ్డారు. గత వారం రోజులుగా ఎండ తీవ్రతకు అల్లాడుతున్న ప్రజలు వర్షం కురిసి వాతావరణం చల్లబడడంతో సేదతీరారు.

డక్కిలి: మండల కేంద్రమైన డక్కిలిలో బుధవారం రెండు గంటల పాటు ఎడతెరిపి లేకుండా వర్షం పడింది. ఉదయం నుంచి ఎండతీవ్రత ఎక్కువగా ఉన్నా మధ్యాహ్నం తరువాత చల్లబడింది.

కోట, బాలాయపల్లెలో కుండపోత

కోట, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): కోట, బాలాయపల్లి మండలాల్లో కుండపోత వర్షం కురిసింది. కోటలో బుధవారం మధ్యాహ్నం 3.10 నుంచి భారీ ఉరుములతో 45 నిమిషాల పాటు ఎడతెరిపి లేకుండా కుండపోత వర్షం పడింది. కోట, విద్యానగర్‌లోని రోడ్లలో వర్షపునీరు నిల్వచేరింది. అలాగే బాలాయపల్లి మండలంలోనూ కుండపోత వర్షం కురిసింది. ముఖ్యంగా బాలాయపల్లి, వెంగమాంబ పురం, కడగుంట గ్రామాల్లో భారీ వర్షం పడింది. ఎండల తీవ్రతకు ఎండుముఖం పడుతున్న నిమ్మ చెట్లు వర్షంతో ఊపిరి పీల్చుకున్నా యని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

జగన్‌ను కలిసిన శ్రీమంత్‌రెడ్డి


జగన్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న శ్రీమంత్ రెడ్డి, ఆయన తల్లి సౌదామి

సూళ్లూరుపేట, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ ఛైర్మన్ దబ్బల శ్రీమంత్‌రెడ్డి వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి జగన్‌ను బుధవారం తాడేపల్లి క్యాంపు కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఇటీవల శ్రీమంత్ రెడ్డి వైసీపీ రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ మెంబర్‌గా నియమితులయ్యారు. ఈ నేపథ్యంలో ఆయన జగన్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు.

సీజేఐపై దాడికి యత్నించిన న్యాయవాదిపై కఠిన చర్యలు తీసుకోవాలి


టవర్‌క్లాక్ కేంద్రం వద్ద ధర్నా నిర్వహిస్తున్న ఐక్యవేదిక సభ్యులు

గూడూరు, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిపై దాడికి యత్నించిన న్యాయవాదిపై కఠిన చర్యలు తీసుకోవాలని రాజ్యాంగ పరిరక్షణ ఐక్యవేదిక సభ్యులు అన్నారు. బుధవారం స్థానిక టవర్‌క్లాక్ సెంటర్‌లోని అంబేడ్కర్ విగ్రహం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రధాన న్యాయమూర్తిపై దాడికి యత్నించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఇది ప్రజాస్వామ్యం, రాజ్యాంగంపై దాడి చేయడమేనన్నారు. ఈ చర్యలకు పాల్పడిన వ్యక్తిపై చర్యలు తీసుకుని పునరావృతం కాకుండా కఠినంగా వ్యవహరించాలన్నారు. అనంతరం సబ్‌కలెక్టర్ రాఘువేంద్రమీనాకు వినతిపత్రం అందజేశారు. జమాలుల్లా, భాస్కర్‌గౌడ్, శశికుమార్, శివకుమార్, చంద్రయ్య, గౌస్‌బాషా, విజయ్‌కుమార్, కోటేశ్వరరావు, రవి, సుబ్బరామరాజు, వేమయ్య, ఇబ్రహీం తదితరులు పాల్గొన్నారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో 11 మందికి జరిమానా


తిరుపతి(నేరవిభాగం), అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): తిరుపతిలో మద్యం తాగి వాహనాలు నడిపిన కేసులో 11 మందికి జరిమానా విధిస్తూ బుధవారం తిరుపతిలోని నాల్గవ అదనపు జిల్లా న్యాయమూర్తి గ్రంధి శ్రీనివాస్ తీర్పు చెప్పారు. ఒక్కొక్కరికి రూ. 10 వేలు వంతున మొత్తం రూ.1.10 లక్షలు జరిమానా విధించారు.


బాలిరెడ్డిపాళెం ప్రభుత్వాస్పత్రి భవనం

శిథిలావస్థలో ప్రభుత్వాస్పత్రి భవనం

తరచూ ఊడిపడుతున్న పెచ్చులు

బిక్కుబిక్కుమంటూ విధులు నిర్వహిస్తున్న సిబ్బంది



ఫార్మసీ గదిలో పెచ్చులూడిన శ్లాబు - కిందపడిన పెచ్చులు

వాకాడు, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బాలిరెడ్డిపాళెంలో ఏళ్ల కింద నిర్మించిన ప్రభుత్వాస్పత్రి భవనం శిథిలావస్థకు చేరుకుంది. ఇటీవల వర్షాలకు పైకప్పు పెచ్చులూడి పడుతోంది. భవనం చుట్టూ పిచ్చి మొక్కలు పెరిగిపోయాయి. తరచూ పెచ్చులూడి పడుతుండటంతో బిక్కుబిక్కుమని కాలం గడుపుతున్నామని వైద్యసిబ్బంది ఆందోళన చెందుతున్నారు. 2022లో నూతనంగా మంజూరైన భవన నిర్మాణం పునాదుల దశలో ఆగిపోవడంతో ఆస్పత్రి ఆవరణలో ఉన్న ఆయుర్వేద ఆస్పత్రి గదిలోనే డాక్టర్లు వైద్య సేవలు అందిస్తున్నారు. ఇక ఆస్పత్రిలో అత్యవసర సేవలకు వైద్యం అందడం లేదు. ఆస్పత్రిలో అధునాతన సౌకర్యాలు లేకపోవడంతో గర్భిణులకు చికిత్స అందించలేకపోతున్నారు. లేదు. దంత వైద్యులు ఉన్నా పరికరాలు లేవు. ప్రభుత్వం చొరవ చూపి ప్రారంభదశలో ఆగిపోయిన భవనాన్ని పూర్తి చేయించాలని ప్రజలు కోరుతున్నారు.

కమనీయం.. అశ్వత్థనారాయణ కల్యాణం


ప్రత్యేక పూజలో పాల్గొన్న కామిరెడ్డి దంపతులు

పెళ్లకూరు, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిల్లకూరులోని సుబ్రహ్మణేశ్వర ఆలయంలో ఆశ్వత్థనారాయణ(రావి, వేప చెట్లు) స్వామి కల్యాణ మహోత్సవం బుధవారం కమనీయంగా జరిగింది. వేద పండితులు ప్రశాంత్‌శర్మ, ఫణేంద్రశర్మల మంత్రోచ్ఛారణల నడుమ ప్రత్యేక పూజలు చేసి కల్యాణ తంతు నిర్వహించారు. అనంతరం సుబ్రహ్మణ్యంస్వామి, నాగ దేవతలకు ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు అన్నదానం చేశారు. ఎన్డీసీసీబీ మాజీ ఛైర్మన్ కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి, ప్రభావతమ్మ దంపతులు కల్యాణోత్సవ ఉభయదాతలుగా వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచు పడగాల హరిబాబురెడ్డి, గోపాల్‌రెడ్డి, రామ్మూర్తిరెడ్డి, శ్రీరాములురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భూముల రీసర్వే వేగవంతం చేయండి

డక్కిలి, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): డక్కిలి మండలంలో భూముల రీసర్వే వేగవంతం చేయాలని గూడూరు డివిజనల్ సర్వే అధికారి సీహెచ్ సుబ్బరాయుడు అన్నారు. బుధవారం డక్కిలి తహసీల్దార్ కార్యాలయంలో మండల సర్వేయర్ పెంచలయ్య ఆధ్వర్యంలో విలేజ్ సర్వేర్లతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రీ సర్వే పనులను అన్ని గ్రామాల్లో సకాలంలో పూర్తి చేయాలని ఆదేశించారు. భూ రీసర్వే పారదర్శకంగా నిర్వహించడంతో పాటు భూముల పరిమితులు, హక్కుల స్పష్టతను ప్రజలకు వివరించాలని సూచించారు.